నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఆదివారం SUNDAY 28.4.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+ 32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4+ 32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 324 ‖ వెల (Price) రూ.8.00

చవితి

ఆదివారం, సూర్యోదయం: 5-52, సూర్యాస్తమయం: 6-35. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: చవితి ఉదయం 8-21 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం: మూల తెల్లవారుజామున 4-48 వరకు. వర్జ్యం: రాత్రి 3-12 నుంచి తెల్లవారుజామున 4-49 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-59 నుంచి సాయంత్రం 6-34 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-52 నుంచి సాయంత్రం 5-43 వరకు. అమృతకాలం: రాత్రి 10-19 నుంచి రాత్రి 11-56 వరకు.

కాంగ్రెస్‌ను ముస్లింలు నమ్మడంలేదు

ఇది మహారాష్ట్రలో కాంగ్రెస్ ముస్లిం నేత మాట

› 7

మేడిగడ్డను అట్లా వదిలేస్తే ఎట్లా?

రేవంత్ సర్కారుకు ఘోష్ కమిషన్ చురక



- బరాజ్ రక్షణకు తక్షణ చర్యలు తీసుకోండి
- తక్షణం ఎన్డీఎస్ఏకు లేఖ రాయండి
- మధ్యంతర నివేదికను తెప్పించుకోండి
- అన్నారం, సుందిళ్లపైనా చర్యలు చేపట్టండి
- సాగునీటి కార్యదర్శికి ఘోష్ ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బరాజ్ బ్లాక్‌ను అలా వదిలేస్తే ఎలా? అని జ్యుడీషియల్ విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అభిప్రాయపడినట్టు విశ్వసనీయంగా తెలిసింది. జూన్ నెలలోనే ప్రాణహితకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బరాజ్‌లో తదుపరి నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఈ మేరకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)కి లేఖ రాసి, తక్షణం చేపట్టాల్సిన మరమ్మతులు, చర్యలపై మధ్యంతర నివేదిక తెప్పించుకోవాలని సూచించారు. అదేవిధంగా అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై కూడా నివేదిక తెప్పించుకోవాలని సూచించినట్టు తెలిసింది. మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్‌లో మూడు పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. దీనిపై ఎన్డీఎస్ఏ కమిటీ పలు దఫాలుగా క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఈ కమిటీ నివేదిక సమర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల గడువు ఇచ్చింది. అయితే, జూన్‌లోనే వరదలు వచ్చే అవకాశం ఉండటంతో బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నిపుణులు గతంలోనే సూచించారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్లు సైతం తక్షణ చర్యలపై ఎన్డీఎస్ఏకు నివేదిక కూడా ఇచ్చారు. కానీ, ఎన్డీఎస్ఏ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక అందలేదు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కూడా 'ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చే వరకు వేచిచూద్దాం' అన్నట్టుగా వ్యవహరిస్తున్నది. దీంతో మధ్యంతర నివేదిక కోసం ఎన్డీఎస్ఏపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. రెండు, మూడు › 5వ పేజీలో

మేడిగడ్డ బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆది నుంచీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కూడా అదే తరహాలో నీటి పారుదల శాఖను ఆదేశించడం గమనార్హం.





లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో శనివారం నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోకు హాజరైన జనం; (ఇన్‌సెట్‌లో) కేసీఆర్‌తో పార్టీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్, పార్టీ నేత నాగం జనార్దన్‌రెడ్డి

ఎందుకెయ్యాలె బీజేపీకి ఓటు?

- పనికిరాని నినాదాలు ఇచ్చినందుకా?
- ఒక్క హామీ కూడా నెరవేర్చనందుకా?
- మనకు మెడికల్ కాలేజీ ఇవ్వనందుకా?
- విభజన హామీలు అమలు చేయనందుకా?
- మోటర్లకు మీటర్లు పెట్టమన్నందుకా?

మన కోసం తన్లాడే నేను కావాల్నా?.. గాయిగత్తర మోదీ కావాల్నా?

- అక్కరకు రాని సుట్టం బీజేపీతో ఫాయిదా లేదు .. పాలమూరుకు మోదీ 25 పైసలు కూడా ఇయ్యలే
- బీజేపీ, కాంగ్రెస్‌కు ముస్లింలు బుద్ధి చెప్పాలె.. ఆ 2 పార్టీలకు కర్రుకాల్చి వాతపెట్టే సమయమొచ్చింది
- రైతుబంధు రేవంత్ అబ్బ జాగీరా?.. ఐదేకరాలకే ఇస్తవా?.. నాగర్‌కర్నూల్ బస్సు యాత్రలో కేసీఆర్
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వల్లే తెలంగాణ గురుకులాలకు ఖ్యాతి వచ్చిందని ప్రశంసలు

› 2

రాష్ట్రంలో చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట కిందట శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంట్ పోయింది. ప్రతిరోజూ సీఎం, డిప్యూటీ సీఎం కరెంట్ పోవటం లేదని ఊదరగొడుతున్నారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది? - కేసీఆర్ ట్వీట్

మరో రైతు ఆత్మహత్య



కొరు కోప్పుల సత్తయ్య (ఫైల్)

బెజ్జంకి, ఏప్రిల్ 27: నీళ్లు లేక పంట పండక.. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక సిద్దిపేట జిల్లాలో మరో రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన రైతు కొరుకోప్పుల సత్తయ్య (50) 19 గుంటల్లో వరి పంట వేయగా నీళ్లులేక పంట › 3వ పేజీలో

చనిపోయింది 18 మందే!



మా ఇంట్ల బోరు కూడా ఎండిపోయింది › 6

రైతు బీమా అందుకున్నది అంతమందే: రేవంత్

మళ్లీ జిల్లాల పునర్విభజనకు జ్యుడీషియల్ కమిషన్

రాష్ట్రంలో విద్యుత్తు కొరత లేదు.. మీడియాతో సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 18 మంది రైతులు మాత్రమే చనిపోయారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతుబీమాకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ప్రకారం ఈ లెక్క తేలిందని చెప్పారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చనిపోయిన రైతులకు సంబంధించిన బీఆర్ఎస్ పార్టీ › 6వ పేజీలో

ఆదాయం పెంచుకొని రుణమాఫీ చేస్తం

- మొత్తం దోపిడీ చేయకుండా ఉంటే రుణమాఫీ సాధ్యమే!
- పన్నులు పెంచుకోవడం, దుబారా తగ్గించడం అవసరం
- జూబ్లీహిల్స్ పెద్దమ్మ సాక్షిగా ఆగస్టు 15లోగా రుణమాఫీ: సీఎం

› 6



బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లికి పూలమాల వేస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ ఖతమైనట్టే

- ఆగస్టు 15న మోసం పార్ట్-2.. రేవంత్‌రెడ్డి ఉద్దెర కథలు ప్రజలు నమ్మరు
- ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ సహకారం.. కమలం పార్టీకి 220 సీట్లు దాటవు
- కేసీఆర్‌ను ప్రజలు తలచుకోని రోజు లేదు.. చిట్‌చాట్‌లో కేటీఆర్

› 5

ఇప్పుడు ఎలక్షన్ పెట్టుర్రి మళ్ల కేసీఆరే అస్తడు!

మీరు అనవసరంగ ఐదేండ్ల టైం పెట్టిండ్రు
మిషన్ల గురించి తెల్వక మోసపోయినం
నాకు మీ కరపత్రం ఎందుకు సారూ..
మా ఇంట్లనే కేసీఆర్ ఫొటో ఉన్నది

ఇది ఐలవ్వ మాట



ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ మార్కెట్ యార్డులో శనివారం ఐలవ్వతో మాట్లాడుతున్న మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

› 6

సర్కారును కూల్చేందుకు కోమటిరెడ్డి కుట్ర!

- 22 మంది ఎమ్మెల్యేలతో వస్తా.. కేసీఆర్‌తో మాట్లాడమన్నడు
- ప్రజల్లో నమ్మకం లేని వ్యక్తి.. ఆయన మాటలు ఎవరు నమ్ముతరు?
- అందుకే ఈ విషయం కేసీఆర్‌కు, కేటీఆర్‌కు చెప్పలేదు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సంచలన ఆరోపణలు

› 3





'జన'హోరు | నాగర్‌కర్నూల్ బస్టాండ్ ఎదుట శనివారం నిర్వహించిన కేసీఆర్ రోడ్ షోకు హాజరైన అశేషజనం.. సభలో నినదిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ఎందుకెయ్యాలె బీజేపీకి ఓటు?

- పాలమూరుకు ప్రధాని మోదీ 25 పైసలు కూడా ఇయ్యలే
- బీజేపీ, కాంగ్రెస్‌కు ముస్లింలు కర్రుకాల్చి వాతపెట్టే టైం వచ్చింది
- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వల్లే తెలంగాణ గురుకులాలకు ఖ్యాతి
- నాగర్‌కర్నూల్ బస్సు యాత్రలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్‌తోనే పంచాయితీ పడిందని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఎక్కడైనా పాలోళ్లకు పంచాయితీ పడితే గట్టిగా నిలబడేందుకు ఒక పంజును ఏర్పాటు చేసుకుంటారని, ఇప్పుడు తెలంగాణ ప్రజలకు.. కాంగ్రెస్‌కు జరిగే పంచాయితీలో మీ పంజుగా కేసీఆర్ కొట్లాడతాడని అభయమిచ్చారు. అందుకు తగిన ఎంపీల బలాన్ని ఓటు ద్వారా తనకు ఇస్తే అసమర్థ కాంగ్రెస్‌కు కార్రుకాల్చి వాతపెడతానని, హామీలన్నీ నెరవేర్చేలా వారి మెడలు వంచుతానని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాగర్‌కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంలోని ఉయ్యాలవాడలో రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడారు. నేడు బీఆర్‌ఎస్ ఆవిర్భవించిన గొప్ప రోజు అని, తెలంగాణ రాష్ట్రానికి శంకుస్థాపన జరిగిన రోజు అని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోతే తప్ప బాగుపడదనే ఉద్దేశంతో సరిగ్గా 23 ఏండ్ల క్రితం పిడికెడు మందితో, గుండె ధైర్యంతో, ఉక్కు సంకల్పంతో యుద్ధం ప్రారంభించిన రోజని పేర్కొన్నారు. ఉద్యమంలో భాగంగా అనేకసార్లు నాగర్‌కర్నూలు వచ్చినట్టు గుర్తుచేసుకున్నారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' ఏదో ఒకటి తేల్చాలని ఆమరణ దీక్షకు పోతే తనను ఖమ్మం జైలులో వేశారని పేర్కొన్నారు.

ఆ గౌరవం పాలమూరుకే

తాను మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. ఆ గౌరవం ఎప్పటికీ పాలమూరుకే ఉంటుందని చెప్పారు. సాధించుకున్న తెలంగాణలో పదేండ్లపాటు కోడి తన పిల్లలను సాదుకున్నట్టుగా సాదుకున్నట్టు తెలిపారు. 50 ఏండ్ల కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల పాలనలో పాత మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా రాలేదని, తాను ఐదు కాలేజీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



నాగర్‌కర్నూల్‌లోని బస్టాండ్ వద్ద కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగం జనార్దన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, బీరం హర్షవర్ధన్‌రెడ్డి

ప్రవీణ్‌కుమార్ అల్లాటప్పా వ్యక్తి కాదు

'నాగర్‌కర్నూలు బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అల్లాటప్పా వ్యక్తి కాదు. మంచిగా చదువుకున్న నాయకుడు. మాజీ ఐపీఎస్ అధికారి. నాగర్‌కర్నూలు చిత్రపటాన్ని ప్రపంచస్థాయిలో నిలబెట్టే బాధ్యత కేసీఆర్‌ది అని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. అలంపూర్‌లో పుట్టిన బిడ్డ. సొంతగడ్డకు సేవ చేయాలని మీ ముందుకు వచ్చాడు. మీరు బలాన్ని ఇస్తే ప్రవీణ్‌కుమార్‌తో సహా జిల్లా ముఖ్యనాయకులందరూ కలిసి ముఖ్యమంత్రి మెడలు వంచి అన్ని హామీలు అమలు చేయిస్తాం. ఆ శక్తిని, బలాన్ని మీరు అందించాలె. నేను ముఖ్యమంత్రి అయినంక ప్రవీణ్‌కుమార్‌ను పిలిచి గురుకులాలను బాగా నడుపుతున్నారని చెప్పి, ఇంకా బాగా నడపాలని చెప్పా. బడ్జెట్ పెంచుకొమని చెప్పా. గురుకులాను జూనియర్ కాలేజీలుగా చేయాలని చెప్పా. ఇప్పుడు తెలంగాణ గురుకులాలంటే అంతర్జాతీయ స్కూల్స్‌కు సమానం. అద్భుతమైన డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఐటీలు, ఐఐఎంలు, ఐపీఎస్‌లు, పైలట్లు, ఎవరెస్టు శిఖరాలు ఎక్కిన బిడ్డలను తయారు చేసిండు. ఆయనకొక కమిట్‌మెంట్ ఉంది. దేశాన్ని బాగు చేయాలని ఉంది. అట్టడుగు వర్గాలను పైకి తేవాలని, రైతులను కాపాడుకోవాలని, రాష్ట్రానికి మేలు చేయాలని ఉంది. ఆషామాషీ వ్యక్తి కాదు. ఇట్లాంటి వ్యక్తులు గెలిస్తే మనందరికీ మేలు జరుగుతుంది. ఇట్లాంటి వ్యక్తి మరోసారి దొరకరు. దయచేసి ఆలోచన చేయండి' అని కేసీఆర్ కోరారు.

రోజుకు పదిసార్లు పోతున్న కరెంటు

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఒక్క ఏడాదిలోనే కరెంటును బాగుచేసి, 24 గంటల కరెంటు ఇచ్చామని కేసీఆర్ తెలిపారు. ఇప్పుడు తరచూ కరెంటు పోతున్నదని, రాత్రి బావులకాడికి పోవుడు, తేళ్లు, పాములు కుట్టుడు మళ్లీ మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 225 మంది రైతులు చనిపోయారని, కొందరు ఆత్మహత్య చేసుకుంటే, మరికొందరు కరెంటు షాక్‌తో, ఇంకొందరు పొలం వద్ద పాముకాటుకు గురై చనిపోయారని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు 24 గంటల కరెంటు ఇస్తున్నట్టు చెప్తున్నారని మండిపడ్డారు.

> భగ్గుమన్న తెలంగాణలో నన్ను అడుగడుగునా అక్కున చేర్చుకుంటున్నరు. పూలు చల్లి, గుమ్మడికాయలు కొడుతున్నరు. రకరకాల పద్ధతుల్లో స్వాగతం చెప్తున్నరు. ఈ ప్రభుత్వానికి కర్రుకాల్చి సురుకు పెట్టాలని జనానికీ అర్థమైంది. మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది. మన తెలంగాణ బాగుపడతది. ఏం రంది పడాల్సిన అవసరం లేదు. జై తెలంగాణ.
>
> -కేసీఆర్

పంట కొనుగోళ్లకు దిక్కేలేదు

'రైతుబంధు అందరికీ వచ్చిందా?' అని ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రశ్నించారు. దీనికి వారు రాలేదని చెప్పడంతో 'అయ్యా ముఖ్యమంత్రీ.. ఇదీ ప్రజల భాష' అని చెప్పారు. తాను ప్రజల మధ్యన నిల్చొని మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. ప్రతి ఆడపిల్లకు రూ. 2,500 వచ్చాయా? రూ. 2 లక్షల రుణమాఫీ అయిందా? కల్యాణలక్ష్మి తులం బంగారం వచ్చిందా? ఆడపిల్లలకు స్కూటీలు వచ్చాయా? వరికి రూ. 500బోనస్ వచ్చిందా? అని ప్రజలను ప్రశ్నించగా, వారు 'రాలేదు రాలేదు' అని సమాధానం ఇచ్చారు.

మళ్లీ బోర్లు.. నీటి ట్యాంకర్లు

తమ పాలనలో మిషన్ భగీరథ పథకం పెట్టి ప్రతి ఇంటికీ నీళ్లు ఇచ్చి, మున్సిపాలిటీల్లో రూపాయికే కనెక్షన్ ఇచ్చి, ప్రతి పేదవాడి ఇంట్లో నల్లా ఫ్రీగా పెట్టి తాగునీటిని సరఫరా చేశామని కేసీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు బోర్లు, నీళ్ల ట్యాంకర్లు ఎందుకొస్తున్నాయని ప్రశ్నించారు.

రైతుబంధు డబ్బులు నీ అబ్బ జాగీరా?

రైతుబంధును 5 ఎకరాల వరకే ఇస్తామని అంటున్నారని, మరి ఆరెకరాల రైతులు, 9–10 ఎకరాలున్న రైతులు ఏం పాపం చేశారని కేసీఆర్ ప్రశ్నించారు. 10–15 ఎకరాల రైతులకన్నా ఇవ్వాలి కదా.. అని కేసీఆర్ అనగానే 'ఇవ్వాలి.. ఇవ్వాలి' అని జనం నినాదాలు చేశారు. రైతుబంధు ఇస్తే వాళ్ల అయ్య జాగీరే మన్నా పోతుందా? అని నిలదీశారు. ప్రజల సొమ్మును వారికే ఖర్చు చేయాలని వివరించారు. ప్రభుత్వాల సహకారం లేకుండా వ్యవసాయం జరగదనే దేశంలో ఎన్నడూ లేని విధంగా రైతుబంధును సృష్టించినట్టు తెలిపారు. తమ హయాంలో రైతుబంధు డబ్బులు ఠంచన్‌గా పడేవని, ఎక్కడున్నా సెల్‌ఫోన్లు టింగుటింగుమని మోగేవని చెప్పారు.

బీజేపీ అక్కరకు రాని చుట్టం

తెలంగాణలో ఉన్న బీజేపీ అక్కరకు రాని చుట్టమని కేసీఆర్ అభివర్ణించారు. 'నరేంద్ర మోదీ నూరు నినాదాలు చెప్పారు. 'భేటీ పడావో.. భేటీ బచావో' ఏడన్నా కనిపించిందా? 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్'తో దేశం ఏమన్నా బాగుపడిందా? ధరలు పెరిగినయ్, పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధర పెరిగింది. సామాన్యుడు బతికే పరిస్థితి లేదు' అని పేర్కొన్నారు. 'మేకిన్ ఇండియా' ఏడన్నా కనిపిందా? 'స్టార్టప్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' కనిపించిందా? వికసిత్ భారత్ వికసించిందా? దళితుల బతుకులు, పేదల బతుకులు మారినయా? బుల్లెట్ ట్రైన్‌లు వచ్చినయా? రైతుల ఆదాయం డబుల్ అయిందా? అమృత్‌కాల్ వచ్చిందా? మరి ఎందుకు వేయాలి వారికి ఓటు' అని ప్రశ్నించగా.. 'ఓటు వెయ్యం' అంటూ బదులిచ్చారు.

నవోదయ లేదు.. మెడికల్ కాలేజీ ఇవ్వలే

ఏ రాష్ట్రంలో ఎన్ని జిల్లాలుంటే అన్ని జిల్లాలకు ఒక్కో నవోదయ పాఠశాల ఇవ్వాలన్న నిబంధన ఉన్నదని, వంద ఉత్తరాలు రాసినా, దండంపెట్టి అడిగినా మోదీ పట్టించుకోలేదని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాడు మోదీ ఇచ్చి ఉంటే నాగర్‌కర్నూలులో ఏర్పాటుచేసి ఉండేవారమని తెలిపారు. 150 మెడికల్ కాలేజీల్లో తెలంగాణకు ఒక్కటీ ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

> కొత్త రాష్ట్రం కాబట్టి రూ. 25 వేల కోట్లు కావాలని మోదీని అడిగితే 25 పైసలు కూడా ఇయ్యలే. ఉల్టా రైతుల మోటార్లకు మీటర్లు పెట్టకుంటే ఏడాదికి రూ. 5 వేల కోట్ల గ్రాంట్ కట్ చేస్తానని బెదిరించారు. తల తెగిపడినా మీటర్లు పెట్టబోనని తెగేసి చెప్పా. ఇన్ని అవమానాలకు గురిచేసిన బీజేపీకి ఓటేస్తే మన మోటార్లకు మీటర్లు పెడతారు.
>
> -కేసీఆర్

యువకులు గ్రామాల్లో చర్చ పెట్టాలి

'ఈ దేశం, రాష్ట్రం యువకులది. మీరు ఆలోచన చేయాలి. ఒక గాడ్పులో కొట్టుకొని పోవద్దు. ఈ రాష్ట్రం శాశ్వతం. మీ భవిష్యత్తు శాశ్వతం. మన బతుకులు నిలవాలంటే బీఆర్‌ఎస్ గెలువాలి' అని కేసీఆర్ పిలుపునిచ్చారు. 'యువకులు ఆలోచించాలి. ఉన్మాదంలో పడిపోవద్దు. నరేంద్రమోదీ గాయి గత్తర కావాలో? మన బతుకులు కావాలో? మన పంటలు కావాలో? మన పొలాలు బాగుండాలో? మీరే ఆలోచన చేయండి. ఊరికే నినాదం చెప్పడం కాదు. మీ గ్రామాల్లో చర్చ పెట్టండి' అని యువకులకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'మన కోసం తండ్లాడే బీఆర్‌ఎస్‌ను కాపాడదామా? మన బతుకుల్ని ఆగం చేసేవారిని కాపాడదామా? అని చర్చ పెట్టాలి. ఈ మాటలు చెప్పి గ్రామ గ్రామాన ప్రతి చెల్లికి, తల్లికి దండం పెట్టి ఓటు అడగండి. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించండి. మన హక్కులను కాపాడుకుందాం. అన్ని సాధించుకుందాం' అని కేసీఆర్ ఆకాంక్షించారు.

ముస్లిం సోదరులు ఆలోచించాలి

తెలంగాణ సెక్యులర్ రాష్ట్రమని, తాము అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాలను కడుపులో పెట్టుకొని కాపాడుకున్నామని కేసీఆర్ పేర్కొన్నారు. ఇమాములను ఆదుకున్నామని తెలిపారు.ముస్లిం బిడ్డల కోసం ప్రత్యేకంగా గురుకులాలు పెట్టామని, మహిళలకు సంక్షేమ పథకాలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. నాగర్‌కర్నూలు బరిలో ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చదువుకున్నవాడని, మంచి వ్యక్తని కితాబిచ్చారు. ముస్లిం సోదరులు సైతం ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

సీఎంకు కర్రుకాల్చి వాతపెట్టాలె

'ఆనాడు మీ అందరి అండదండలతో 15 ఏండ్లు అన్నం తిన్నమో, అటుకులు బుక్కినమో పోరాటం చేసినం. నేను కూడా దీక్ష చేపట్టి తెలంగాణ తెచ్చా' అని కేసీఆర్ చెప్పారు. అలాంటి వ్యక్తిని 'కేసీఆర్ గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా. నీ పేగులు తీసి మెడలో వేసుకుంటా. నీ చెడ్డీ కూడా గుంజుకుంటా అని ముఖ్యమంత్రి అంటుండు. ఇదేనా ముఖ్యమంత్రి మాట్లాడే భాష. ఇది ధర్మమేనా? తెలంగాణ సాధించిన వ్యక్తిని, వచ్చిన తెలంగాణను తెల్లగ చేసిన వ్యక్తిని. రాష్ట్రానికి సాగునీరు, తాగునీరు కొట్లాడి తెచ్చుకున్న వ్యక్తిని. నన్ను అలా అనొచ్చునా' అని నిలదీశారు. 'ఎవరికి కర్రుకాల్చి వాతపెట్టాలో, ఎవర్ని అందలం ఎక్కించాలో అనే శక్తి మీ దగ్గర ఉన్నది. దయచేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించండి. నాకు శక్తి ఇవ్వండి. మళ్లీ మన గవర్నమెంటే వస్తుంది. అందులో అనుమానం అవసరం లేదు' అని కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు.

కేసీఆర్ కోసం కదిలొచ్చిన కందనూలు

కేసీఆర్ యాత్రకు నాగర్‌కర్నూలు జననీరాజనం

దారిపొడవునా మహిళల మంగళహారతులు

ఊరూరా సంబురాల్లో మునిగితేలిన శ్రేణులు

హైదరాబాద్, ఏప్రిల్27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, తమ ప్రాంత అభివృద్ధి ప్రదాత కేసీఆర్ కోసం కందనూలు కదిలివచ్చింది. కల్వకుర్తిని సాకారం చేసి బీళ్లను పచ్చని మాగాణం చేసిన కృషీవలుడికి నీరాజనం పలికింది. దశాబ్దాల ఆర్తిని, దాహార్తిని తీర్చి, వలస వెతలను రూపుమాపిన నేతను కండ్లారా చూసుకొని మురిసింది. నాగర్‌కర్నూలులో నిర్వహించిన బస్సు యాత్రకు అశేష ప్రజానీకం తరలివచ్చింది. యువతీ యువకులు, రైతులు, మహిళలు దారిపొడువునా రోడ్లకు ఇరువైపులా బారులుతీరి ఘనస్వాగతం పలికారు. పబ్బతి పట్టి జేజేలు కొట్టారు. బస్టాండ్ వద్ద చౌరస్తాలో కేసీఆర్ చేసిన రణగర్జనకు ఆ ప్రాంతమంతా ఉగ్రూతలూగింది. 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్' అన్న ముక్తకంఠంతో చేసిన నినాదాలు మిన్నంటాయి.

అభివృద్ధి ప్రదాతకు అపూర్వస్వాగతం

బీఆర్ఆర్ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర శనివారం సాయంత్రం 5.10 గంటలకు మహబూబ్‌నగర్‌లోని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంటి నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి భూత్పూర్, కొత్త మొల్గర, వెల్కిచర్ల, లట్లుపల్లి తండా, చేగుంట, మంగనూరు, వెలుగొండ, బిజినేపల్లి, పాలెం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడకు చేరుకున్నది. అక్కడి నుంచి ర్యాలీగా బస్టాండ్ చౌరస్తా వరకు యాత్ర సాగింది. బస్సుయాత్రకు దారిపొడవునా కందనూలు ప్రజానీకం కిలోమీటర్ల మేర బారులు తీరి పూలుచల్లుతూ, మహిళలు మంగళహారతులు ఇచ్చారు. పటాకులు పేల్చుతూ అభిమానం చాటుకున్నారు. భవనాలపైకి ఎక్కి చూస్తూ జనం జేజేలు పలికారు. ఆయా రూట్లలోని పల్లెవాసులు రోడ్డుపైకి చేరి నినాదాలు చేశారు. లట్లుపల్లి తండా వద్ద భారీగా గుమిగూడిన లంబాడీ ఆడబిడ్డలకు కేసీఆర్ కరచాలనం చేయగా తండావాసులు మురిసిపోయారు. దారివెంట ఆటోలు, బస్సుల్లోని ప్రజలు కేసీఆర్‌ను చూసేందుకు పోటీపడ్డారు.

ఎండిన వరి కంకులతో వచ్చిన రైతులు

కొందరు రైతులు ఎండిన వరి కంకులతో బస్సుయాత్రకు తరలివచ్చారు. జననేతను చూసి తమ బాధను వ్యక్తం చేశారు. తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. బస్సుయాత్రలో సెల్ఫీల కోసం ప్రజలు పోటీపడ్డారు. బస్సులోని కేసీఆర్‌ను ఫొటోలు తీసుకుని మురిసిపోయారు. ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. బస్సు అద్దాల నుంచే సార్‌ను తాకేందుకు వందలాది మంది పోటీపడ్డారు. కాంగ్రెస్ నయవంచన పాలనను ఎండగట్టిన ప్రతిసారీ ఈలలతో హోరెత్తించారు.

మోగిన గులాబీ నగారా

రాష్ట్రాన్ని సాధించినప్పుడు ఇదే ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించానని, ఉద్యమ సమయంలోనూ నాగర్‌కర్నూల్ ప్రజలు తనతో కలిసి నడిచారని గుర్తు చేసినప్పుడు ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారు. వలసల జిల్లా అభివృద్ధి చెందిందని సంతోషించానని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ పాత రోజులు వస్తాయేమో అని ఆందోళన కలుగుతున్నదని కేసీఆర్ తెలిపారు. పదేండ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే వాటికి కాంగ్రెస్ సర్కార్ మంగళం పాడుతున్నదని కేసీఆర్ అన్నప్పుడు 'అవును.. అవును' అన్న ప్రజల మాటలు ప్రతిధ్వనించాయి. రైతులను ఉద్దేశించి 'మీకు రైతుబంధు వచ్చిందా' అని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు 'రాలేదు.. రాలేదు' అంటూ నినదించారు. 'ఇదిగో ఇది ప్రజలనాడి విను... రేవంత్‌రెడ్డి' అని కేసీఆర్ గుర్తు చేశారు. 'మీలో ఒకడు, ఆలంపూర్ ముద్దుబిడ్డ, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్‌కు రాజీనామా చేసి ప్రజాసేవ చేయడానికిముందు కొచ్చాడని, ఆయన్ను ఎంపీగా గెలుపించుకుంటారా?' అని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు 'గెలిపిస్తాం.. అంటూ' చేతులూపారు. కేసీఆర్ ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసేలా సాగింది. కార్యకర్తల్లో ఉత్సాహం, ఉత్తేజాన్ని నింపింది.

నాగర్‌కర్నూలు రూపురేఖలు మార్చిన జననేతకు జేజేలు

కేసీఆర్ పదేండ్ల పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాధించిన ప్రగతికి నిలువెత్తు నిదర్శనంగా నాగర్‌కర్నూలు జిల్లా నిలుస్తుంది. ప్రత్యేక జిల్లా కావడమే కాకుండా అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించింది. దశాబ్దాలుగా పెండింగ్ ప్రాజెక్టుగా మిగిలిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కేసీఆర్ హయాంలో రన్నింగ్ ప్రాజెక్టుగా మారింది. వెరసి బీళ్లన్నీ పచ్చని మాగాణాలుగా మారాయి. మెడికల్, అగ్రికల్చర్ కాలేజీలు సహా ఇతర ఉన్నత విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా కందనూలు రూపురేఖలే మారిపోయాయి. తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. కానీ ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ రైతుల జీవితాలను ఆగం చేస్తుండటంతో, హామీలకు ఎగనామం పెట్టేందుకు యత్నిస్తుండడంతో గులాబీ అధినేత మరోసారి రణగర్జన చేశారు. బస్సుయాత్ర చేపట్టి 'నేనున్నాను' అంటూ భరోసా కల్పించారు.



దేవరకద్ర నియోజకవర్గంలోని భట్టుపల్లిలో బస్సు నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

> రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నా పోతున్నా సీఎం, మంత్రులు అబద్ధాలు చెప్తున్నారు. శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి భోజనం చేస్తుంటే కరెంటు పోయింది. నన్ను ఇబ్బంది పెట్టేందుకే తీశారేమోనని ఆరా తీస్తే రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని చెప్పారు.
>
> -కేసీఆర్

పిడికిలెత్తి హర్షధ్వానాలు

తెలంగాణ ప్రజలు, కాంగ్రెస్‌కు జరిగే పంచాయితీలో మీ పంజుగా ఎవరిని ఎన్నుకుంటారని ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ అడిగిన ప్రశ్నకు 'కేసీఆర్ కేసీఆర్' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. 'తెలంగాణ ప్రజల తరపున మీ పంజుగా నేను కొట్లాడాల్నా?' అన్న ప్రశ్నకు.. 'చేద్దాం.. చేద్దాం' పిడికిలెత్తి ముక్త కంఠంతో నినదించారు. 'మీ తరపున ఈ దుర్మార్గపు కాంగ్రెస్ మెడలు వంచాలంటే నాకు మీ బలం ఇవ్వాలె. చదువుకున్న వ్యక్తి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలవాలె' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.



నాగర్‌కర్నూల్ బస్టాండ్ ఎదుట రోడ్ షోలో జై తెలంగాణ అంటూ నినదిస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, నాయకులు, ప్రజలు

కాంగ్రెస్ 'కోతలే' కోతలు

- రాష్ట్రంలో ఎడాపెడా కరెంటు తీసేస్తున్న ప్రభుత్వం
- ఒక్క రోజే ముగ్గురు ప్రముఖులకు కోతల ప్రభావం
- అంతర్గత వైరింగ్ లోపమని ఇతరులపైకి సర్కారు నెపం
- స్వయంగా కోతల బారిన పడ్డట్టు పేర్కొన్న కేసీఆర్

ఒకే రోజు మూడు కోతలు (27.04.2024)

1. మహబూబ్‌నగర్‌లోని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో భోజనం చేస్తుండగా కరెంటు పోయింది. స్వయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కరెంటు కోతల బారిన పడ్డారు.

2. కాంగ్రెస్ అధికారిక భవనం గాంధీభవన్‌లో మంత్రి సీతక్క మాట్లాడుతుండగా పవర్‌కట్ అయ్యింది. ఏకంగా అధికార పార్టీ మంత్రే విద్యుత్తు కోతల ప్రభావానికి గురయ్యారు.

3. నాగారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో జరిగిన మల్కాజిగిరి బీఆర్ఎస్ పార్లమెంట్ సమావేశంలో మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతుండగా కరెంటు పోయింది.

హైదరాబాద్/హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ముగ్గురు ప్రముఖులు శనివారం కరెంటు కోతల ప్రభావానికి గురయ్యారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రి సీతక్క, మాజీమంత్రి మల్లారెడ్డి పాల్గొన్న కార్యక్రమాల్లో పవర్‌కట్ కావటం గమనార్హం. వీరు ప్రముఖులు కాబట్టి విద్యుత్తు కోతల విషయం బయటపడింది. 'తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్ర విచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట కిందట మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంట్ పోయింది. ప్రతి రోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంట్ పోవటం లేదని ఉదరగొడుతున్నారు. నాతోపాటు ఉన్న మాజీ శాసనసభ్యులు వారివారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంట్ పోతున్నదని నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పరిపాలన వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది? రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి. జై తెలంగాణ' అని కరెంటు కోతల పరిస్థితిపై కేసీఆర్ ట్వీట్ చేశారు.

పోయినప్పుడల్లా టెక్నికల్ సమస్యేనట..

కరెంటు కోతలపై అంతర్గత వైరింగ్ లోపం అని చెప్తూ ప్రభుత్వం తప్పించుకొంటున్నది. అదిగో కోతలంటూ వీడియోలు బయటికి రాగానే, ఇదిగో వివరణ అంటూ ఓ పత్రిక ప్రకటనను విడుదల చేస్తున్నది. ఏమన్నా అంటే.. తాము కరెంటు కోతలు విధించటం లేదు.. అంతర్గత వైరింగ్ సమస్యేనని చెప్పి చేతులు దులుపుకొంటున్నది. అందుకు గతంలో ఇచ్చిన వివరణలే అందుకు నిదర్శనం.

- ఈ నెల 20న పవర్ మంత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్కకూ కోతల సెగ తగిలింది. స్నేహహస్తం చాచేందుకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయానికి వెళ్లిన ఆయనకు కరెంట్ కోతలు స్వాగతం పలికాయి. కరెంట్ కట్‌కావటంతో ఆయన చీకట్లో చర్చలు జరిపారు. దాదాపు 20 నిమిషాలు పాటు ఆయన చీకట్లోనే ఉండాల్సి వచ్చింది. ఆఖరికి అంతర్గత వైరింగ్ లోపమని వివరణ ఇచ్చారు.
- గత మార్చి 31న సీఎం రేవంత్‌రెడ్డి సీనియర్ నేత కేశవరావు ఇంటికి వెళ్లారు. బంజారాహిల్స్‌లోని కేకే నివాసానికి సీఎం వెళ్లిన సమయంలో మూడు సార్లు పవర్ కట్ అయ్యింది. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం జరగలేదని, ఇంటి యజమాని అదనంగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక ఫ్లడ్‌లైటింగ్ కేబుల్ లూజ్ కాంటాక్ట్ కారణంగా లైట్లు ఆన్ అవటం.. ఆఫ్ అయ్యిందని, ఇది వైరింగ్ సమస్యని టీఎస్ఎస్పీడీసీఎల్ చెప్పింది.
- నాంపల్లిలోని జిల్లా క్రిమినల్ కోర్టులోనూ కరెంట్ సమస్య తలెత్తింది. కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తుండగా, కరెంటు పోయింది. చీకట్లోనే వాదనలు విన్న జడ్జి అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీనిపై స్పందించిన టీఎస్ఎస్పీడీసీఎల్ ఎంసీబీ ట్రిప్పింగ్ వల్ల అంతర్గత సమస్య వల్ల అంతరాయం ఏర్పడిందే తప్ప కరెంట్ కోతలు కాదని ప్రకటించింది.

ఉత్తమ్ ఉత్తమాటే..



రాష్ట్రంలో కరెంట్ కోతలు లేనేలేవు. ఒక్క నిమిషం కూడా కరెంట్ పోవటం లేదు. కోతలున్నాయన్నది పూర్తిగా అబద్ధం. ఔట్‌డేటెడ్ టెక్నాలజీలో భద్రాద్రి ప్రాజెక్టును చేపట్టారు. ఎంత ఖర్చుఅయినా సరే కరెంట్ కొనుగోలు చేసి 24 గంటల కరెంట్ ఇస్తాం. ఎంత పవర్ డిమాండ్ పెరిగినా కరెంట్ ఇచ్చేందుకు మేం కట్టుబడి ఉన్నాం. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్తు ఉత్పత్తి పెరగలేదు. 7 వేల మెగావాట్ల నుంచి 12 వేల మెగావాట్లకు పెంచామని చెప్పటం అబద్ధం.

– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

లోడ్ పెరిగినందుకే కోత


మాజీమంత్రి మల్లారెడ్డి సమావేశంలో విద్యుత్తు కోతలపై విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. శనివారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఒక హోటల్‌లోని బంకెట్‌హాల్‌లో నిర్వహించారు. వేదికపై మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి మాజీమంత్రి మల్లారెడ్డి మాట్లాడుతుండగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీనిపై స్థానిక విద్యుత్తుశాఖ సిబ్బంది ఒకరు స్పందించారు. బంకెట్ హాలుకు విద్యుత్తు సరఫరా అందించే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లోడ్ పెరగటంతో దాన్ని తగ్గించేందుకు ఒక లైన్‌కు విద్యుత్తు సరఫరా నిలిపివేశామని వెల్లడించారు.

కరెంటు పోలేదు: భట్టి

మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేల తో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయిందని కేసీఆర్ పేర్కొనటంపై డిప్యూటీ సీఎం, విద్యుత్తుశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. కరెంటు పోయిందన్నది అవాస్తవమని ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ ప్రకటనపై స్పందించి స్థానిక ట్రాన్స్‌కో ఎస్సీని విచారణకు ఆదేశించామని, ఆయన ప్రకటనలో వాస్తవం లేదని నిర్ధారణకు వచ్చినట్టు తెలిపారు. 'శనివారం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ ఇంటికి నిరంతర విద్యుత్తు సరఫరా జరిగింది. కరెంటు కోతలపై శ్రీనివాస్‌గౌడ్ ఇంటి పరిసరాల్లోని ఇంటి యజమానులను మా సిబ్బంది విచారించి ఎటువంటి కోతలు లేవని నిర్ధారించారు. శ్రీనివాస్‌గౌడ్ ఇంటి సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో నమోదైన రీడింగ్‌లోనూ కరెంటు కోతలు జరగలేదని తేలింది' అని వెల్లడించారు.

ఇది కాంగ్రెస్ 'పవర్' ప్రాబ్లం

- ఎడాపెడా విద్యుత్తు కోతలు
- ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా!?
- 'ఎక్స్'లో కాంగ్రెస్‌పై కేసీఆర్ విమర్శ
- ఎక్స్ ఖాతా తెరిచిన బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు
- మొదటి రోజే లక్షల వ్యూస్, వేల ఫాలోయర్స్



KCR
@KCRBRSPresident

తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి గారు, మరియు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది.

ప్రతి రోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు.

నాతోపాటు ఉన్న మాజీ శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు.

రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది?

రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి.

జై తెలంగాణ

కేసీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యాఖ్యలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో కరెంట్ కోతలపై బీఆర్ఎస్ కేసీఆర్ మండిపడ్డారు. శనివారం మహబూబ్‌నగర్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో బస చేసిన కేసీఆర్ ఎడాపెడా కరెంట్ పోతుండటంపై తన ఎక్స్ ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఒకవైపు మంత్రులు రాష్ట్రంలో కరెంట్ కోతలే లేవని చెప్తున్నారని, కానీ, సహచర పార్టీ నేతలతో కలిసి తాను ఉన్నప్పుడే రెండుసార్లు కరెంట్ పోయిందని, ఇది కాంగ్రెస్ పరిపాలన వైఫల్యం అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలని కోరారు. 'తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్ర విచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట కిందట మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంట్ పోయింది. ప్రతి రోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంట్ పోవటం లేదని ఉదరగొడుతున్నారు. నాతో పాటు ఉన్న మాజీ శాసనసభ్యులు వారివారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంట్ పోతున్నదని నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పరిపాలన వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది? రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి. జై తెలంగాణ' అని కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరిగారు. కాగా, పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేసీఆర్ 'ఎక్స్(ట్విట్టర్)'లో ఖాతా తెరిచారు. 'బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు' అని తొలి ట్వీట్ చేశారు. కేసీఆర్ ఎక్స్ ఖాతా తెరిచిన విషయం తెలియగానే నెటిజన్లు పెద్ద సంఖ్యలో ఆ ఖాతాను ఫాలో అవుతున్నారు. వ్యూస్, లైక్‌లు, ట్వీట్లు, రీట్వీట్లతో హోరెత్తించారు. శనివారం రాత్రి 9 గంటల సమయానికి తొలి ట్వీట్‌ను లక్షా 82 వేల మంది వీక్షించారు.

బీసీల వాటా తేల్చాకే కాంగ్రెస్ ఓట్లడగాలి

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 27: బీసీల వాటా తేల్చాకే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లడుగాలని ఓయూ ఉద్యమ నేత, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం 'స్థానిక సంస్థలు-రిజర్వేషన్లు' అన్న అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు పలు హామీలు ఇచ్చిందని తెలిపారు. మొదటి అసెంబ్లీ సమావేశంలోనే బీసీ సభ ప్లాన్ నిధుల మంజూరు, బీసీ సంక్షేమానికి లక్ష కోట్లు, ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వశాఖ ఏర్పాటు, బీసీ ప్రెస్‌క్లబ్‌లు, ఐక్యతా భవనాలు, స్టడీ సర్కిళ్లు, క్యాంటీన్ల స్థాపన, పాలక మండళ్ల నియామకాలు చేపడుతామని ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచారని గుర్తుచేశారు. బీసీలపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వివిధ బీసీ సంఘాల నేతలు సాయిని నరేందర్, దాసు సురేశ్, సంగెం సూర్యారావు, బత్తుల సిద్దేశ్వర్లు, సర్దార్ పుటం పురుషోత్తం పటేల్, పాలూరు రామకృష్ణ, కిరణ్‌కుమార్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



దళిత కార్యకర్తను పక్కకెళ్లి టిఫిన్ చేయాలని హుకుం జారీ చేస్తున్న మల్లురవి

ఏయ్.. పక్కకుపో

- దళిత యువకుడిని అవమానించిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆయనో కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్.. ఆ పార్టీ తరపున నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తున్నారు. సాక్షాత్తు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్సీలకు రిజర్వ్ చేసిన స్థానం నుంచి బరిలో ఉన్న మల్లు రవి ఎన్నికల ప్రచారం కొరకు నాగర్‌కర్నూల్‌కు వెళ్లారు. ఆ సెగ్మెంట్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో టిఫిన్ కోసం ఆగారు. అయితే తనతో అల్పాహారం చేస్తున్న దళిత యువకుడిని.. ఏయ్ పక్కకెళ్లి తిను, నా ముందు కూర్చోవద్దని చెయ్యి చూపిస్తూ అవమానించిన ఘటన సోషల్ మీడియాలో వైరలవుతున్నది. మల్లు రవి హుకుంతో పక్కనున్న నేతలు కూడా అతడిని పక్కకెళ్లు అని సైగ చేశారు. దీంతో షాక్‌కు గురైన దళిత కార్యకర్త ఆయన ముందు నిలబడి టిఫిన్ చేసి వెళ్లిపోయాడు. ఇది ప్రజాపాలన కాదు.. దురహంకార పాలన.. ఇదీ కాంగ్రెస్ పార్టీలో తోటి మనుషులకు ఇచ్చే గౌరవం ఇదేనా..? అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ఫైరవుతున్నారు.

జిల్లా స్థాయిల్లో యాంటి ర్యాగింగ్ కమిటీలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టేందుకు కలెక్టర్ నేతృత్వంలో జిల్లా స్థాయి యాంటి ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసింది. మొత్తం 8 మంది సభ్యులు ఉండే కమిటీల్లో కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ కార్యదర్శి (మెంబర్ సెక్రటరీ)గా, ఎస్పీ, యూనివర్సిటీ/కాలేజీ/విద్యాసంస్థ అధిపతి, స్థానిక మీడియా ప్రతినిధి, ఎన్జీవో, విద్యార్థి సంఘాలు, స్థానిక పోలీసులు, పరిపాలన విభాగం నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ వేసవి సెలవుల్లో ప్రతిసంస్థలో సన్నాహక సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. జాతీయంగా ర్యాగింగ్ నిరోధక హెల్ప్‌లైన్ 1800 – 180–5522 కాల్ చేయాలని, helpline @ anti ragging.in ఈ మెయిల్‌ను సంప్రదించవచ్చని యూజీసీ సూచించింది.

నల్లగొండ కాంగ్రెస్‌లో చేరికల చిచ్చు

- వివాదమైన మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చేరిక
- ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పేడ కొట్టి.. చెప్పల దండ
- చేరికను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు పీసీసీ ప్రకటన



కాంగ్రెస్‌లో మున్సిపల్ చైర్మన్ భార్గవ్, అనుచరుల చేరికను వ్యతిరేకిస్తూ ఫ్లెక్సీపై పేడ కొడుతున్న మహిళలు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్ శనివారం కాంగ్రెస్‌లో చేరిన ఘటన పార్టీలో చిచ్చురేపుతున్నది. భార్గవ్ కాంగ్రెస్‌లో చేరేందుకు రెండు నెలలుగా ప్రయత్నిస్తుండగా.. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అడ్డుపడుతున్నారు. సీనియర్ నేత జానారెడ్డి సైతం జోక్యం చేసుకుని సర్దిచెప్పే ప్రయత్నాలు చేసినా క్షేత్రస్థాయిలో ఫలితం లేదు. దీంతో భార్గవ్ తనతోపాటు మరో 12 మంది కౌన్సిలర్లను వెంటపెట్టుకుని శనివారం ఉదయం గాంధీభవన్‌లో పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిక ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం కాగానే.. స్థానికంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తమ అనుచరులతో భేటీ అయ్యారు. తమ అనుమతి లేకుండా, తమకు సమాచారం ఇవ్వకుండా పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించడంతోపాటు.. ఆయన చేరికను నిలిపివేయకుంటే పార్టీలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇదే సమయంలో భార్గవ్ చేరికను ఉద్దేశించి 'ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ గోడలు దూకే నాయకుల్లారా.. ఖబడ్దార్' అంటూ పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలకు చెప్పుల దండలు వేసి పేడతో కొట్టి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఎవరిని చేర్చుకోవాలన్నా స్థానిక నేతలు, కార్యకర్తల అభిప్రాయం మేరకే జరుగాలని డీసీసీ అధ్యక్షుడు పీసీసీ పెద్దలకు స్పష్టం చేశారు. జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, సీనియర్ నేత జానారెడ్డికి తెల్వకుండా పార్టీ పెద్దలు చేరికలను ప్రోత్సహిస్తే సహించేది లేదని చెప్పారు. దీంతో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటన విడుదల చేయక తప్పలేదు. చేరికలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. స్థానిక నాయకత్వంతో చర్చించాకే తదుపరి నిర్ణయం ప్రకటిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చేరికల లొల్లి నాగార్జునసాగర్, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో సైతం కొనసాగుతున్నది.

ఎన్నికలు సజావుగా నిర్వహించండి

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని రాష్ట్ర డీజీపీ రవిగుప్తాను కాంగ్రెస్ నాయకులు శనివారం కలిసి విన్నవించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో సరిపడా భద్రతను పెంచాలని కోరారు. తెలంగాణలో ఎన్నికలు సాఫీగా జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు డీజీపీకి తెలిపారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీలు కపిలవాయి దిలీప్‌కుమార్, రాములునాయక్, మాజీ మంత్రి పుష్పలీల, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, వినోద్‌రెడ్డి, దివ్యవాణి ఉన్నారు.

టాంజానియాలో వరద బీభత్సం... 155 మంది మృతి

న్యూఢిల్లీ : తూర్పు ఆఫ్రికా దేశాలైన టాంజానియా, కెన్యా, బురుండీల్లో కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రధాన నదులు పొంగి పొర్లుతుండటంతో ప్రజలు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. టాంజానియా ప్రధాన మంత్రి కాసిమ్ మజాలివా మాట్లాడుతూ.. పెను గాలులు, వరదల కారణంగా తమ దేశంలో పలు ప్రాంతాలు, పంటలు, వంతెనలు, రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 155 మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 236 మంది గాయపడ్డారని చెప్పారు.

మరో రైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

ఎండిపోయింది. దీనికితోడు పాపయ్యపల్లిలో మూడు ఎకరాల వ్యవసాయ భూమిని కౌలు తీసుకుని పత్తి వేయగా సరిపడా దిగుబడి రాలేదు. వ్యవసాయ పనులకు ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఇల్లు పూర్తిగా శిథిలావస్థ చేరుకోగా ఇంటి నిర్మాణం కోసం రుణం చేయగా సుమారు రూ.20 లక్షల వరకు అప్పులు అయ్యాయి. వీటిని ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన సత్తయ్య శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడికి వెళ్లి సత్తయ్యను కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సత్తయ్యకు భార్య శోభ, కుమారులు అనిల్, హరీశ్, విష్ణు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బెజ్జంకి ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ పేరు మీద సోషల్ మీడియా ఫేస్‌బుక్‌లో ఖాతా, డీపీ ఫొటోలో వంశీ

ఎన్నికవక ముందే ఎంపీ?

ఫేస్‌బుక్‌లో గడ్డం వంశీకృష్ణ ఎంపీ పేరిట ఖాతా ఓపెన్

కవర్‌ఫొటోలో వంశీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్

పెద్దపల్లి, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు జరుగలేదు.. ఫలితాలు వెలువడలేదు. కానీ.. కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పేరు మాత్రం.. సోషల్ మీడియాలో ఎంపీగా చెలామణి అవుతుండటం చర్చనీయాంశమవుతున్నది. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పేరిట ఫేస్‌బుక్‌లో ఫిబ్రవరి 3న 'గడ్డం వంశీకృష్ణ ఎంపీ' అని ఖాతా ఓపెన్ అయి ఉంది. అంతేకాదు.. ఫేస్‌బుక్ డీపీగా గడ్డం వంశీకృష్ణ ఫొటో, కవర్ ఫొటోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తన తండ్రి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఫొటోలు కనిపిస్తున్నాయి. ఈ ఎఫ్‌బీ ఖాతా తెరిచిన సమయానికి గడ్డం వంశీకృష్ణ ఎంపీ అభ్యర్థిత్వం కూడా ఖరారు కాలేదు. వర్క్స్ ఎట్ విశాఖ ఇండస్ట్రీస్, లైవ్స్ ఇన్ హైదరాబాద్ పేరుతో ఫేస్‌బుక్‌లో పోస్టింగ్‌లు చేస్తుండటంపై సొంత పార్టీ నుంచే అభ్యంతరం వ్యక్తమవుతున్నది. దీనిపై నెటిజన్లు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. పలువురు ఆయనకున్న పదవీ వ్యామోహానికి ఇదొక నిదర్శనమంటూ పేర్కొంటున్నారు. ఎన్నికల్లో గెలువకముందే ఆయన వ్యవహారశైలి ఇలా ఉంటే.. గెలిచిన తర్వాత ఎలా ఉంటుందోనని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే.. ఇది ఆయన అధికారిక ఖాతానా? లేక మరెవరైనా కావాలని గడ్డం వంశీకృష్ణ పేరుమీద ఎఫ్‌బీ ఖాతా ఓపెన్ చేశారా? అన్న విషయం తెలియరాలేదు.

సర్కారును కూల్చేందుకు కోమటిరెడ్డి కుట్ర

- 22 మంది ఎమ్మెల్యేలతో వస్తా.. కేసీఆర్‌తో మాట్లాడమన్నడు
- ప్రజల్లో నమ్మకం లేని వ్యక్తి.. ఆయన మాటలు ఎవరు నమ్ముతరు?
- హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సంచలన ఆరోపణలు



కరీంనగర్‌లో మాట్లాడుతున్న హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 27: 'ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుట్ర పన్నిండు. కాంగ్రెస్‌కు చెందిన 22 మంది ఎమ్మెల్యేలు నా దగ్గర ఉన్నరు. కేసీఆర్ సార్‌తో మాట్లాడు. వాళ్లను తీసుకొని వస్తానని నాతో చెప్పిండు' అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. వెంకటరెడ్డి ప్రజల్లో నమ్మకం కోల్పోయిన వ్యక్తి అని, ఆయన మాటలపై నమ్మకం లేకనే తాను ఈ విషయాన్ని ఇప్పటి వరకు కేసీఆర్‌కు కానీ, కేటీఆర్‌కు కానీ చెప్పలేదని వివరించారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ నివాసంలో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వెంకట్‌రెడ్డి ఓ మంత్రిగా కాకుండా మూర్ఖుడిలా మాజీ మంత్రి హరీశ్‌రావుపై మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. నిజంగా మొగోడే అయితే హరీశ్‌రావు రాజీనామా సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఓ మంత్రిగా కనీస సబ్జెక్టు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వచ్చే ఆగస్టు 15లోగా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తామంటూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నాడని, సీఎం హామీలపై నమ్మకం లేకనే హరీశ్‌రావు రాజీనామా సవాల్ చేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి నిజంగా రుణమాఫీ చేస్తాడని అనుకుంటే హరీశ్‌రావు సవాల్‌ను ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. హరీశ్‌రావు రాజీనామా పత్రం పట్టుకొని వస్తే కోమటిరెడ్డి ఇంట్లో కూర్చొని మతిలేని మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఏ ఫార్మాట్‌లో కావాలంటే ఆ ఫార్మాట్‌లో హరీశ్‌రావు నుంచి రాజీనామా లేఖ తీసుకొస్తానని, మరి రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి తమ రాజీనామా లేఖలను కూడా తీసుకురావాలని సవాల్ చేశారు. . టెస్కాబ్ చైర్మన్ కొం డూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బండ శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ పాల్గొన్నారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

పదవిని పణంగా పెట్టి రైతుల కోసం..

తెలంగాణ అసెంబ్లీలో మొత్తం 119 స్థానాలుంటే 39.40 శాతం ఓట్లు సాధించి కాంగ్రెస్ 64 సీట్లు దక్కించుకున్నది. 37.35 శాతం ఓట్లతో బీఆర్ఎస్ 39 స్థానాలు పొందింది. రెండు పార్టీల మధ్య ఉన్న ఓట్ల తేడా 2.05 శాతం మాత్రమే. వ్యాసం ప్రారంభంలోనే ఈ మాటలను ఇప్పుడెందుకు చెప్పాల్సి వస్తున్నదంటే... బీఆర్ఎస్ ఏ అధికారంతో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తుండంతో ఈ వాస్తవాన్ని గుర్తుచేయాల్సి వస్తున్నది. ప్రజలు ఇచ్చిన అధికారంతో బాధ్యత గల ప్రధాన ప్రతిపక్షంగా విధులు నిర్వర్తిస్తున్నదని చెప్పడమే దీని సారాంశం. కేవలం 2 శాతం ఓట్లు తగ్గినంత మాత్రాన బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారనో, శిక్షించారనో అనుకోవడం తగదు. ఉద్యమ పార్టీగా చూశారు.. అధికార పక్షంగా చూశారు... ఇప్పుడు ప్రతిపక్ష బాధ్యతలు అప్పగించారు. ప్రజలు అప్పగించిన పనిని చేస్తుంటే దానిపై కామెంట్లు ఎందుకు?



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఏం చేస్తున్నదంటే? ముఖ్యమైన మూడు పనులు నిర్వర్తిస్తున్నది. ఒకటి.. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, రెండు.. ఈ సమస్యల పరిష్కారానికి అర్థవంతమైన సూచనలు ఇవ్వడం, మూడు.. అధికార పక్షం చేసిన వాగ్దానాలను ఎప్పటికప్పుడు గుర్తుచేసి అవి అమలయ్యేలా ప్రజలతో కలిసి పోరాటం చేయడం. ఇది తెలంగాణ ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీ బాధ్యత. ఈ పోరాటం చేస్తున్నందుకే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆర్థికశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావుపై అధికారపక్షం దాడి చేస్తున్నది. రాజీనామా చెయ్ అంటూ సవాలు విసిరింది. హరీశ్‌రావుకు రాజీనామాలు కొత్త కాదు, అధినాయకుడు కేసీఆర్ వెంట తెలంగాణ విముక్తి కోసం గడ్డిపోచల వలె ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేసిన నాయకుడు హరీశ్‌రావు. ఒక్కసారి కాదు, పలుమార్లు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన వ్యక్తి. మరోసారి కాదు, ఇంకా ఎన్ని సార్లయినా తెలంగాణ ప్రజల కోసం రాజీనామా చేసే నాయకుడు హరీశ్‌రావు. రాజీనామా ఒక లెక్క కాదు, ఆయనకు తెలంగాణ ప్రజలు ముఖ్యం. అందుకే హరీశ్‌రావు రైతుల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

ఇంతకూ ఆయనేం చేశారు? రాష్ట్రంలో కరవు నెలకొన్నందున తక్షణ సాయం కింద కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న రుణమాఫీని అమలుచేస్తారా? క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇస్తారా? అని ప్రశ్నించారు. రైతులతో పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. ప్రభుత్వం స్పందించింది. ఆగస్టు 15 కల్లా రుణమాఫీ చేస్తామని చెప్పింది. అక్కడితో పని ముగిసిందనుకుంటే ప్రతిపక్ష నాయకుడు, అందులో ఉద్యమకారుడు ఎందుకవుతారు? ఇది కల్లబొల్లి మాటేనా? నిజంగా చేస్తారా? అని మళ్లీ ప్రశ్నించారు. తప్పకుండా చేస్తాం... చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఇస్తారా అని ముఖ్యమంత్రే అడిగారు. ఆ తేదీనాటికి ఇవ్వలేరు.. ఒకవేళ ఇస్తే రాజీనామా చేస్తా.. ఉప ఎన్నికలు వస్తే మళ్లీ పోటీ చేయను.. ఇదిగో రాజీనామా పత్రం అంటూ అమర వీరుల సాక్షిగా తెలిపారు. ఇది రాష్ట్రంలో సంచలనం కలిగించింది. దీనిమీద అధికారపక్షం విమర్శలు, వ్యాఖ్యానాలు, సవాళ్లు చేస్తున్నది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలను స్వాతంత్ర్య దినోత్సవం నాటికి అమలు చేయలేదని, ఒకవేళ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని పునరుద్ఘాటిస్తూ మాట్లాడారు.

ముందుగా రుణమాఫీని పరిశీలిద్దాం. ఇదేమీ రైతులు కోరింది కాదు. ఇతర పార్టీలు డిమాండ్ చేసింది కాదు. కాంగ్రెస్ పార్టీయే తనకుతానుగా వాగ్దానం చేసి ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. మరి అమలు చేయాల్సిన పూచీ ఎవరిది? ఆ పార్టీదే కదా? దాన్నే బీఆర్ఎస్ తరఫున ఉద్యమ నాయకుడు హరీశ్‌రావు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే దీన్ని నెరవేరుస్తామని ప్రకటించింది. పార్టీ ఇచ్చిన హామీని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది.

రుణమాఫీ చేస్తామని అన్నామే గానీ మొదటి వంద రోజుల్లో అమలు చేస్తామనలేదని ప్రభుత్వ పెద్దలు మాట మార్చారు. సరే దీనికీ ఒప్పుకొందాం. కొత్త ప్రభుత్వానికి కొంత ఊపిరి తీసుకునే సమయమైనా ఇవ్వాలి కదా. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎలక్షన్ కోడ్, నిధుల సర్దుబాటు, ఇతర ఇబ్బందులుంటాయి, కాదన లేం. కానీ, సమస్య ఎక్కడ వచ్చిందంటే... రుణ మాఫీకి నిధులు విడుదల చేయలేకపోయినా అందుకు సంబంధించిన కసరత్తును మొదటి వందరోజుల్లోనే ఎందుకు ప్రారంభించలేదన్న ప్రశ్న తలెత్తుతున్నది.

రుణమాఫీ చిన్న విషయమేమీ కాదు. ఎంతమంది రైతులున్నారు? ఎంత మొత్తం రుణం ఉన్నది? అన్న సమాచారం మొదలు తెలుసుకోవాలి. ఇందుకోసం లీడ్ బ్యాంకుకు లేఖ రాయాలి. అర్హులైన రైతులను ఎలా గుర్తించాలి? కౌలు రైతుల పరిస్థితి ఏమిటి? ఎవరైనా రైతులు ముందుగా చెల్లించి ఉంటే సమానత్వ సాధన కోసం వారి పట్ల ఏ విధంగా వ్యవహరించాలి? హామీ ఇచ్చినట్టు మొత్తం రూ.2 లక్షలు రద్దు చేస్తారా? లేదంటే ఎకరానికి ఇంత అన్న పరిమితి విధిస్తారా? ఇవన్నీ తేలాలి. సహకార సంఘాలు, గ్రామీణ బ్యాంకుల నుంచి కూడా సమాచారం తెప్పించుకోవాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖకో, ఆర్థిక శాఖకో ఒక సర్క్యులర్ గానీ, ఆర్డర్ గానీ పంపించి ఉంటే ఈపాటికే కొంత స్పష్టత ఉండేది. రుణమాఫీ కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది అందులో ఉన్న ఇబ్బందులను అధికారులతో చర్చించి. ఇతర రాష్ర్టాల్లో కూడా గతంలో అమలైంది. అక్కడి అనుభవాలేమిటి? ఎదురైన సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారు? ఇలాంటి సమాచారం అంతా సేకరించాలి. మ్యానిఫెస్టోలోని అంశం కాబట్టి ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకోవాలి. ఇదంతా జరిగి ఉంటే రుణమాఫీపై మార్గదర్శకాలు ఇప్పటికే సిద్ధమై ఉండేవి. ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించిందన్న నమ్మకం రైతుల్లో కలిగి ఉండేది. ఇవేవీ జరగడం లేదన్నదే హరీశ్‌రావు ఆవేదన అంతా. మరోసారి రైతులను మోసం చేస్తుందనేదే ఉద్యమ నాయకుడి ఆవేదన.



ఆర్థికమంత్రిగా ఆయనకున్న అనుభవంతో రుణ మాఫీకి మొత్తం రూ.39 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తాన్ని ఎలా సేకరిస్తారు? అసలు రుణమాఫీకి రిజర్వ్‌బ్యాంక్ ఎంతవరకు అంగీకరిస్తుంది? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? ఇలా చర్చకు వచ్చే అంశాలు ఇంకెన్నో ఉన్నాయి. వీటిపై ఇంతవరకు ఎలాంటి పేపర్ వర్క్ జరగలేదు కాబట్టే పంద్రాగస్టు నాటికి రుణమాఫీ అమలు చేయలేరని ఆయన అంత గట్టిగా చెప్తున్నారు. ఆ రోజున జెండా ఎగురవేసి ఏదో మొక్కుబడిన ఒకరిద్దరు రైతులకు రుణమాఫీ పత్రాలు అందజేస్తే కుదురుతుందా? అది మాటను నిలబెట్టుకోవడం అవుతుందా? ఏక కాలంలో రూ.2 లక్షలను మాఫీ చేయాలని, అదీ రైతులందరికి ఒకేసారి చేయాలని హరీశ్‌రావు పట్టుబడుతున్న విషయాన్ని మరచిపోకూడదు. లేదంటే ఒకరిద్దరు రైతులకు రుణమాఫీ పత్రాలిచ్చి మోసం చేసే వ్యక్తి రేవంత్‌రెడ్డి.

మరో అంశాన్ని కూడా పరిశీలించాలి. ఈ ఏడాది జూన్‌లో బాగా వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. అంటే, రైతులు మే నెల నుంచే వానకాలం పంటలకు సన్నద్ధం కావాలి. మరి పెట్టుబడుల కోసం వారు బ్యాంకుల వద్దకు వెళ్తే వారికి అక్కడ ఎదురయ్యే పరిస్థితి ఏమిటి? పాత రుణాలు చెల్లిస్తేనే కొత్తవి ఇస్తామంటారా? రుణమాఫీపై మాకు ఎలాంటి సమాచారం రాలేదంటారో? ఏమంటారో తెలియదు. ధరణి పోర్టల్‌ను నిలిపి వేస్తామంటున్నారు. మరి, రుణాలు పొందడానికి పాస్ పుస్తకాలు పెట్టాలా? బ్యాంకులు ఎలాంటి అభ్యంతరాలు పెడుతాయో తెలియదు. అందువల్ల బ్యాంకులకు తగిన సమాచారం ఉంటే గందరగోళ పరిస్థితులు తగ్గుతాయి. ఇవన్నీ రైతులు రోజూ మాట్లాడుకునే విషయాలే. వీటిని రైతుల పక్షాన అడుగుతున్నారనే హరీశ్‌రావుపై విమర్శలు. రాజకీయం చేస్తున్నారని ఆరోపణలు. ప్రజాభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తెస్తే అందులో రాజకీయం ఏముంది? తులం బంగారం ఇస్తామన్న హామీని ప్రజలు అంతగా నమ్మారో లేదో తెలియదు గానీ, రుణమాఫీ మాత్రం తప్పకుండా జరుగుతుందన్న నమ్మకంలో రైతులున్నారు. ఆ ఆశ వమ్ము కాకుండా చూడాలన్నదే ఆయన తాపత్రయం.

మిగిలిన హామీలను కాసేపు పక్కనపెట్టినా వరికి రూ.500 బోనస్ ఇస్తామన్న వాగ్దానం అమలుపై కూడా ప్రభుత్వం నుంచి ప్రకటనలేమీ రాలేదు. వ్యవసాయ మంత్రి ఏమో వచ్చే వానాకాలం పంటకు మద్దతు ధర ఇస్తామని చెప్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దానిపైన రైతులకు ఏమీ చెప్పడం లేదు. ఒకవైపు వడ్లు కళ్లాల కాడికి వచ్చి ఉన్నాయి. మరో వైపు రైతుపై అకాల వర్షం దాడి. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ మాట ఎలా ఉన్నా, ప్రకటించిన మద్దతు ధర ఎంతవరకు అమలవుతున్నదో, లేదో చూసే పరిస్థితులే కనిపించడం లేదు. అది తెలిస్తే కదా బోనస్‌ను అమలుచేయడం సాధ్యపడుతుంది. కరువు, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఈ బోనస్ తక్షణావసరం. దీన్ని ఎలా అమలుచేస్తారో స్పష్టత కూడా లేదు. పార్టీలో కిసాన్ కాంగ్రెస్ అన్న ప్రత్యేక విభాగమే ఉన్నది. దీనికి అధ్యక్షత వహించేవారు సీనియర్లు, రైతుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న నేతలు. బోనస్ విషయమై వారితోగానీ, రైస్ మిల్లర్లు, వ్యాపారులతో కానీ చర్చలు జరిపిన సందర్భం ఇంతవరకు లేదు. ప్రాథమిక చర్యలే ప్రారంభం కానప్పుడు హామీ అమలవుతుందన్న నమ్మకం రైతులకు ఎలా కలుగుతుంది? వానకాలం పంటల నుంచి దీన్ని అమలుచేస్తామంటే సెప్టెంబర్, అక్టోబర్ నాటికిగానీ ఇది అమలు చేయరన్న మాట. అంటే సుమారుగా ఏడాది ఆలస్యం కానున్నది.

హరీశ్‌రావు చేస్తున్నది సద్విమర్శ. నిర్మాణాత్మక సలహా. పోనీ రాజకీయ కోణంలోనో, ప్రజలను రెచ్చగొట్టే విధంగానో విమర్శలు చేస్తున్నారనంటే అవేవో చెప్తే బాగుంటుంది. వీటిపై స్పందించకుండా 'దూలంలా ఉన్నావు' అని ముఖ్యమంత్రి అంతటి వారే విమర్శలు చేయడం సబబు అనిపించుకోదు. రైతులే హరీశ్‌ను గెలిపించుకున్నారు. వాళ్లకోసమే ఒక శ్రామికుడుగా ఆయన పోరాటం చేస్తున్నారు, చేస్తారు. హరీశ్‌రావు మలిదశ ఉద్యమం మొదలు పెట్టి తెలంగాణను విముక్తి చేసిన మహానాయకుడు కేసీఆర్ నాయకత్వంలో ఉద్భవించిన ఉద్యమ నాయకుడు. 24 ఏండ్లు తెలంగాణ విముక్తి కోసం నిరంతర శ్రామికుడిగా కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం అహర్నిశలు హరీశ్‌రావు ఉద్యమించారు. 1969లో తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది కాంగ్రెస్ ప్రభుత్వం.

ఆ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఈరోజు ముఖ్యమంత్రి అయినారు కాబట్టి అమరవీరుల త్యాగాల విలువ రేవంత్ రెడ్డికి ఎలా తెలుస్తుంది? కనీసం ఇప్పటివరకు అమరవీరుల స్థూపం దగ్గరికి వచ్చి అమరవీరులకు జోహార్లు చెప్పని రేవంత్‌రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరం.

ఇవేకాకుండా సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఆయన వ్యక్తిగత అంశాల జోలికి వెళ్లకుండా హుందాతనంగా వ్యవహరించాలి. ప్రభుత్వ హామీలపైనే ప్రశ్నిస్తున్నప్పుడు అదే రీతిలో జవాబిస్తే బాగుంటుంది. ముఖ్యంగా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. హామీలను అమలు చేయించాలనే ఒత్తిడి పెంచే ఉద్దేశ్యంతోనే హరీశ్‌రావు తన పదవిని పణంగా పెట్టారు. ఎమ్మెల్యే పదవి ఆయన వ్యక్తిగతమైనది కాదు, తనపై నమ్మకం ఉంచి వరుసగా ఘన విజయాలు ఇస్తున్న సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరిదీ. ఇలాంటి పదవిని త్యాగం చేయడానికి సిద్ధపడ్డారంటే ఆయన నిబద్ధతను అర్థం చేసుకోవచ్చు. 'నేను ఐదేండ్లు పదవిలో లేకపోయినా రాష్ట్ర ప్రజలకు మేలు జరిగితే అంతకన్నా సంతోషం ఏముంటుంది?' అని నిర్భీతిగా ప్రకటించారు. చూద్దాం ఏం జరుగుతుందో?

ఆర్థికమంత్రిగా ఆయనకున్న అనుభవంతో రుణ మాఫీకి మొత్తం రూ.39 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇంత పెద్ద మొత్తాన్ని ఎలా సేకరిస్తారు? అసలు రుణమాఫీకి రిజర్వ్‌బ్యాంక్ ఎంతవరకు అంగీకరిస్తుంది? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? ఇలా చర్చకు వచ్చే అంశాలు ఇంకెన్నో ఉన్నాయి. వీటిపై ఇంతవరకు ఎలాంటి పేపర్ వర్క్ జరగలేదు కాబట్టే పంద్రాగస్టు నాటికి రుణమాఫీ అమలు చేయలేరని హరీశ్‌రావు అంత గట్టిగా చెప్తున్నారు. ఆ రోజున జెండా ఎగురవేసి ఏదో మొక్కుబడిన ఒకరిద్దరు రైతులకు రుణమాఫీ పత్రాలు అందజేస్తే కుదురుతుందా? అది మాటను నిలబెట్టుకోవడం అవుతుందా?

(వ్యాసకర్త: అధ్యక్షులు, జనతంత్ర వేదిక)

కురవకుండా ఉరిమే మబ్బు మోదీ-బీజేపీ!

ప్రధాని మోదీ ఉపన్యాసాలను వింటే చినుకు రాలకుండానే గంటల తరబడి ఉరిమే మబ్బులు గుర్తుకువస్తున్నాయి. అలాగే బయటకు రాక, లోపలికి పోక అక్కడే కదలాడే సోడాబుడ్డిలోని గోలీని తలపిస్తున్నాయి. తన పదేండ్ల పాలనలో 'ఆయిల్, టెలికాం, విద్యుత్తు, ఇన్సూరెన్స్, వ్యవసాయం, మీడియాలను అంబానీకి.. ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, వ్యవసాయ భూములు, బొగ్గు గనులు, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకి అప్పగించారు. అంతేకాదు, ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో ఉన్నాయంటూ ప్రైవేటు వాళ్లకు కారుచౌకగా తెగనమ్మారు. అదే ప్రైవేటు సంస్థలు నష్టాల్లో ఉంటే వాటికున్న రూ.లక్షల కోట్ల రుణాలను రద్దుచేశారు.




పాతూరి వేంకటేశ్వరరావు
98490 81889

తత్కారణంగా మోదీ హయాంలో పేరుకుపోయిన నిరర్థక ఆస్తులు భారతదేశ బ్యాంకుల రుణాలలో 3.2 శాతం. మనకన్నా పెద్ద దేశం చైనాలోని నిరర్థక ఆస్తులు కేవలం 1.6 శాతం. ఐరోపా దేశాల నిరర్థక ఆస్తులు 1-1.5 శాతమే. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం.. ఒక దేశపు నిరర్థక ఆస్తులు 2 శాతం ఉంటే ఆ దేశ బ్యాంకు రుణాలు ప్రమాదంలో పడినట్టుగా పరిగణిస్తారు. మరి 3.2 శాతం నిరర్థక ఆస్తులను పోగేసి భారతీయ బ్యాంకులను మీరు ఎంత పెద్ద ప్రమాదంలో నెట్టేశారో తెలుస్తున్నదా మోదీజీ? బ్యాంకులు ప్రమాదంలో పడితే ఆ దేశపు ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో పడినట్టే. గతంలో సంభవించిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేర్పిన గుణపాఠమదే కదా!

పదేండ్ల బీజేపీ పాలనలో మీరు ప్రజలకు ఇచ్చిందేమిటో ఒక్కసారి మననం చేసుకోండి. మీరు పోగు చేసిన నిరర్థక ఆస్తులు ఏంటంటే.. భారీ అప్పులు, జీఎస్టీ పేరిట నిర్బంధ పన్నులు, అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగం, దారిద్ర్యం, వినసొంపైన ఉపన్యాసాలు, మత విద్వేషాలు. మీరు ప్రజలకు అంటగట్టింది ఇవే కదా మోదీజీ! ప్రజాహిత కార్యక్రమాలు చేయకున్నా సరే కార్పొరేట్ బీజేపీ ఎలా విజయం సాధించగలుగుతుంది? అన్న ప్రశ్నలకు పరిశీలకులు పలు కారణాలు చెప్తున్నారు. అవేమిటంటే.. క్విడ్ ప్రో కో ద్వారా ఎన్నికల బాండ్ల రూపంలో బడా కార్పొరేట్లు ఇచ్చిన వేల కోట్ల నిధులతో ఓటర్లను, ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనడం. నిఘా వ్యవస్థలను, దర్యాప్తు సంస్థలను తమ చేతి రిమోట్లుగా మార్చుకొని ప్రతిపక్షాలపై కేసులు పెట్టించి ఆయా పార్టీలను, నేతలను ప్రజల్లో అప్రతిష్ఠ పాలుచేయడం, ఆ కేసులకు బెదిరి లొంగిపోయినవారికి పార్టీ కండువా కప్పి బీజేపీ బలాన్ని పెంచుకోవడం. భావోద్వేగాలను రెచ్చగొడుతూ మెజారిటీ హిందూ ఓటర్లను సమీకరించుకోవడం. జాతీయ మీడియాను మోదియాగా మార్చడం. మోదీని ఆకాశానికెత్తే, ప్రతిపక్షాలను పాతాళానికి పడేసే అబద్ధాల సోషల్‌మీడియా యూనివర్సిటీని నిర్మించుకోవడం ద్వారా గత రెండు దఫాలు బీజేపీ అధికారాన్ని దక్కించుకున్నది.

'కాదేదీ కవితకనర్హం' అని శ్రీశ్రీ అంటే.. 'కాదేదీ భావోద్వేగానికి అనర్హం' అని అంటున్నారు మోదీజీ! అందుకే ఆయన సముద్రతీరాన ప్లాస్టిక్ సంచులేరారు. పార్లమెంట్‌కు ప్రణమిల్లారు. చప్రాసీ కాళ్లు కడిగారు. నెమళ్లకు గింజలు పెట్టారు. హిమాలయాలకు వెళ్లి సైనికులతో టీ తాగారు. చర్చికెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చిలను తగలబెడుతుంటే మౌనం వహించారు. హిందువులున్న చోట గోవులను పూజించారు. ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల పర్యటనలో పశుమాంస భక్షణం తప్పు కాదని ప్రకటింపజేశారు. ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ వేషం వేశారు, ఆ తిండి తిన్నారు.




గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో పాకిస్థాన్, చైనా, పుల్వామా, బాలాకోట్ అంశాలతో పొరుగు దేశాల పట్ల ద్వేషాన్ని.. శివాజీ, పటేల్ ప్రస్తావనతో చారిత్రక హీరోయిజాన్ని.. ఔరంగజేబు పేరిట చారిత్రక విద్వేషాన్ని రగిల్చి మెజారిటీ హిందూ ఓటర్లను ఆకర్షించింది బీజేపీ.

ప్రస్తుత ఎన్నికల్లో కూడా మత ప్రాతిపదికన పౌరసత్వ చట్టాన్ని, అయోధ్య రామాలయాన్ని ఆయుధాలుగా చేసుకోవాలని బీజేపీ భావించింది. ముఖ్యంగా రామమందిరం కూడా వాళ్లు ఊహించినంతగా ప్రభావితం చేయలేకపోతున్నది. రామాలయాన్ని కూల్చి మసీదు కట్టారు కనుక దాన్ని కూల్చి తిరిగి అక్కడే రామాలయాన్ని కడతామన్న బీజేపీ.. తద్విరుద్ధంగా మసీదుకు అల్లంత దూరాన రామాలయాన్ని నిర్మించడం ఒక కారణం. మన దేశంలోని రామాలయాలు సీతా-రామ-లక్ష్మణ-ఆంజనేయుల విగ్రహాలతో అలరారుతుంటాయి. ఎందుకంటే, మానవాళికి ఏకసతీ-పతీవ్రతాన్ని ఆచరించి చూపిన ఆదర్శ దంపతులు సీతారాములు. భ్రాతృ ప్రేమకు లక్ష్మణుడు, సేవానిరతికి ఆంజనేయుడు ప్రతీకలు. యథారాజా తథా ప్రజా అని ఆచరణ ద్వారా ప్రబోధించిన ప్రజా పాలకుడు శ్రీరాముడు. అందుకే వారి విగ్రహాలతో అలరారుతూ పాలకులకు, ప్రజలకు సదరు ఆశయాలను ప్రబోధిస్తుంటాయి రామాలయాలు. అదే రామాలయాల విశిష్ఠత. ఈ ఔన్నత్యాన్ని విస్మరించి, కేవలం బాలరాముడిని ప్రతిష్ఠించి భారీ ప్రచారపు ఖాళీ చెంచాతో ఎన్నాళ్లు తినిపించినా హిందువుల కడుపు నిండుతుందా?

కుంభకోణాల పార్టీలంటూ హేళన చేయటమే కాదు, ఎన్నికలు రాగానే వాళ్లను త్రిశూలంతో వేటాడి వేధిస్తున్నారు కూడా. ఉదాహరణకు కొందరికి భారీ మొత్తంలో లబ్ధి కలిగించేలా మద్యం పాలసీని రూపొందించి, రూ.100 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ కేజ్రీవాల్, కవిత తదితరులను చెరసాలలో వేయించారు కదా. మీ హిందూత్వ, దేశభక్తి, అవినీతి నిర్మూలన, నిస్వార్థం, నిజాయితీలో ఉన్న డొల్లతనాన్ని ప్రజలు మాత్రం పసిగట్టారు. అంతేకాదు, ఉపన్యాసాల్లో మీరు ఎంతగా ఉరిమినా, వాగ్దానాలతో ఎంతగా మెరిసినా, ప్రజాహిత కార్యక్రమమనే చినుకును కూడా వర్షించని మాయమబ్బు నరేంద్ర మోదీ-బీజేపీ అన్న వాస్తవాన్ని ప్రజలు గ్రహించారు. బహుశా ఇటీవల జరిగిన తొలి దశ ఎన్నికల్లోనే మీకు ఈ విషయం తెలిసినట్టుంది. అందుకే కాబోలు ప్రతిపక్షాలపై మరింతగా విరుచుకుపడుతున్నారు.

ఒకరినొకరు రక్షించుకోవటానికి.. విలువలను భక్షించుకోవటానికి జరుగుతున్న తాంత్రిక యుద్ధం. ప్రజలపై మంత్రప్రయోగం జరుగుతున్నది. చెరసాలలో ప్రజలను వేసి ఉపన్యాసాల కొరడాతో ఫడేల్ ఫడేల్మనే శబ్దతరంగాల ప్రయోగం జరుగుతున్నది. ఆ తరంగాలకు న్యాయబద్ధతో.. హేతుబద్ధతో ఏమీ లేదు. ఆ గంటకు ఆ ఆటను రక్తి కట్టించాలి. అవసరమైతే ఒంటిమీద ఉన్న ఒక్కొక్క వస్త్రాన్ని విప్పుతూ చిందులేయాలి. ఆ పిచ్చిగంతులను చూసి వెర్రి జనం ఈలలు.. కేకలు.. కేరింతలు.. పెడబొబ్బలు పెట్టాలి. ఆ దృశ్యాలను చూసి పులకించి పోవాలి. అవును. నిజం. అదే కదా జరుగుతున్నది!



ఆ కుర్చీని మడతపెట్టి..!




నూర శ్రీనివాస్

బాధ్యతలున్నవారే బాధితులుగా మారినట్టు. పరిష్కరించవలసిన వారికే సమస్యలు ఎదురైనట్టు గుడ్డివాదం ఒకటి ప్రజల ముందుకు వస్తున్నది. దాన్నేవారు అందరిముందు పెడుతున్నారు. తాళిబొట్లు తాకట్టు పాలవుతాయనే హెచ్చరికలు. మనింట్లో పక్కింటివాడు నిద్రిస్తాడనే భ్రమలు. కంటి మీద కునుకు లేకుండా చేస్తారనే భయాలను సృష్టించటమే ఆ మెదళ్ల.. ఆ నాలికల టక్కుటమార దస్తావేజుల చిట్టా. అలాంటి గడుసు దయ్యాలు కళ్లముందు నాట్యమాడుతుంటే బుద్ధిమంతుల సుద్దులు ఎవరికి కావాలోయ్? తప్పు చేస్తున్నామని, తప్పుగా మాట్లాడుతున్నామని తెలియని ప్రసంగీకులు.. అదీ బాధ్యత గల కుర్చీని (గల్లీ అయినా... ఢిల్లీ అయినా) అస్త్రంగా (ఆలంబన ఇక గతం) ధరించిన వాళ్లు చెప్తున్నప్పుడు.. ఆ చెప్తున్నది.. చెప్పేదీ నిజమే కానప్పుడు ప్రజలు ఏమనుకుంటారో అనే దానికన్నా 'నేను సృష్టించే వశీకరణ తాంత్రిక 'మైక్'హిత మాంత్రిక బలంతో నావైపు రావాల్సిందే.. నన్ను బలపరచవలసిందే.. నాకు భయపడ వలసిందే' అనే కదా హుంకరింపు. అదే మనపట్ల వారికున్న అమోఘ వాత్సల్యపూరిత గీతామృతం.

నిజాన్ని నమ్మించలేనపుడు అబద్ధమనే ఆయుధాన్ని ఆశ్రయించాలి. అదే ఈ ప్రజలకు అసలైన శిక్ష. ఎన్నికఎన్నికకూ ఈ శిక్ష తీవ్రత పెరిగిపోతున్నది. అందులో భాగంగానే రాజ్యాంగం రాద్ధాంతమైంది. హక్కులు భగ్నమయ్యాయి. కాళోజీ 'పీకనొక్కు' సిద్ధాంతమే చెలామణి అవుతున్నది. కుర్చీలు అదే కోరుకుంటున్నాయి. 'నాకు నచ్చింది నువ్వు చేయలేదనుకో...నీకు నచ్చనిది నేను చేసేస్తాను అంతే' అనేరీతిలో హుకుంలు జారీ అవుతూనే ఉంటాయి. అదే అసలైన ఎంపికగా నిట్టూర్పు ఒకటి సాగిలపడుతుంది.

'దోచినవాళ్లదే ఘనత. దాచుకోవాలనుకునే వాళ్లదే భవిత' అనే తాత్విక భూమికపై కుర్చీలు కుతూహలపడుతున్నాయి. వాటికి ఉచితానుచితాలతో పనిలేదు. న్యాయాన్యాయాలతో పేచీలేదు. అదే నీతివంతమైన దారి. అవినీతి అంతమైందని పుంఖానుపుంఖాల ప్రకటనలు వెలువడతాయి. చూపుడువేలు కొసను సిరామరకలు ఐదేండ్లకోసారి అనుభవంలోకి వచ్చిన తర్వాత కూడా అదే వాదన. బలాన్ని మరింత కూడగట్టేందుకు యుద్ధక్షేత్రంలో నాల్కలు పోటీపడుతున్నాయి.

ఇటువంటి సమయంలో ఒక 'రక్ష'ణరేఖ గీస్తే ఎంతబాగుంటుంది? 'ఈ రేఖ దాటితే నువ్వు భస్మీపటలం అయిపోతావ్' అనే హెచ్చరిక ఒకటి ఆకాశమార్గన వినపడితే ఎంతబాగుంటుంది? 'దేశమంటే మట్టికాదోయ్...దేశమంటే మనుషులోయ్'... చిలుముపట్టిన నినాదమైపోయి.. 'మనుషులంటే జీవచ్ఛవముల్' అని కదా చదువు'కొన' వలసివస్తున్నది. అది త్వరలోనే మరోసారి నిరూపితం కావటానికి, ఈవీఎంల్లోకి ఐదేండ్ల రక్తాశృవులుగానో.. భవితాశ్రువులుగానో చిందేందుకు బొటనవేలు సిద్ధం అవుతున్నది. అయ్యో.. శిలక్కొయ్యకు వేలాడుతూ ఇంకా ఎంతకాలం ఉంటావు? 'కండ్లముందు జరుగుతున్నదంతా చూస్తూ ఉండటానికి కర్మసాక్షిని కాదు.. సాక్షాత్తూ మానవుణ్ని' అని ఛటాల్న చర్నాకోలాతో చరిచి గుడ్లు ఉరిమే కాళోజీ పిడికిలిని ఒక్కసారి దర్శిస్తే ఎంతబాగుండు?



నేనెప్పడూ ప్రజల మధ్యనే

యావత్ దేశం నేను క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని కోరుకుంటున్నది. నేనెప్పడూ ప్రజల మధ్యనే ఉంటాను. అమేథీ నియోజకవర్గంలో 1999 నుంచి ప్రచారంలో పాల్గొంటున్నాను. అమేథీ నుంచి గెలిచిన కేంద్రమంత్రి స్మృతి ఇరానీ తాను ఇచ్చిన హామీలేవీ నెరవేర్చుకోలేకపోయారు.



- రాబర్ట్ వాద్రా,
కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ భర్త

కాంగ్రెస్ ఖతమైనట్టే!

ఆగస్టు 15న రుణమాఫీ మోసం పార్ట్-2

ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ సహకారం • రేవంత్‌రెడ్డి ఉద్దెర కథలు ప్రజలు నమ్మరు

దేశంలో బీజేపీకి 220 సీట్లకు మించి రావు • బీజేపీని నిలువరించేది బీఆర్‌ఎస్ ఒక్కటే

కేసీఆర్‌ను ప్రజలు గుర్తుచేసుకోని రోజులేదు • బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గడ్డుకాలం ఎదుర్కొంటున్నదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన పార్లమెంటు పరిధిలోనే గింగిరాలు తిరిగుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పర్యటిస్తున్న ఆయనకు క్షేత్రస్థాయి పరిస్థితులు అర్థమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతృప్తిగా లేదన్న కేటీఆర్, ప్రజలు నిత్యం కేసీఆర్‌ను తలచుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తం వారికి భస్మాసుర హస్తం కానుందని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. దేశంలో బీజేపీని ఎదుర్కొంటున్నది ప్రాంతీయ పార్టీలేనని, కాంగ్రెస్‌కు దానిని ఎదుర్కొనే సత్తా లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 220 సీట్లు దాటే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయాలను కేసీఆర్ శాసించాలంటే బీఆర్‌ఎస్‌ను 10-12 స్థానాల్లో గెలిపించాలని ప్రజలను కోరారు.

ఆగస్టు 15 రుణమాఫీ మోసం పార్ట్-2

రేవంత్‌రెడ్డి మాటమీద నిలబడే వ్యక్తి కాదని, ఆగస్టు 15 లోపు రుణమాఫీ అని చెప్పడం మోసం పార్ట్-2లో భాగమని కేటీఆర్ విమర్శించారు. ఆయనకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థమైంది కాబట్టే ఆయన తన సొంత నియోజకవర్గం మహబూబ్‌నగర్‌కు పదిసార్లు వెళ్లారని ఎద్దేవా చేశారు. ప్రజల మూడ్ మారిందని, కాంగ్రెస్‌కు గడ్డుకాలం మొదలైందని చెప్పారు. సీఎంవి అన్నీ ఉద్దెర మాటలేనని, బస్సు ఉద్దెర, సిలిండర్ ఉద్దెర, కరెంటు కూడా ఉద్దెరేనని.. ఇప్పటి వరకు ఎవరి ఖాతాలోనూ రూపాయి కూడా పడలేదనని తెలిపారు. రూ. 4 వేల పింఛన్, ఆడబిడ్డలకు రూ. 2500, రూ. 500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, కౌలు రైతులకు భరోసా, నిరుద్యోగులకు రూ. 4వేల భృతి, ఫ్రీ స్కూటీ, తులం బంగారం వంటివి అతీగతీ లేకుండా పోయాయని, ఉన్న రైతుబంధుకు కూడా దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకసారి మోసపోతే అది మోసం చేసినవాడి తప్పని, రెండోసారి కూడా అదే వ్యక్తి చేతిలో మోసపోతే అది మన తప్పు అవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు మోసం పార్ట్-1లో భాగంగా రుణమాఫీ డిసెంబర్ 9న రిలీజ్ అన్నారని, ఓట్లు వేయించుకుని గట్టెక్కాక.. మోసం పార్ట్-2లో భాగంగా రుణమాఫీ ఆగస్టు-15 అంటూ కొత్త మోసానికి తెరతీశారని మండిపడ్డారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటాననని రెండుసార్లు చెప్పి మాట నిలుపుకోలేదని కేటీఆర్ గుర్తుచేశారు.



బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్. చిత్రంలో సత్యవతి, మాగంటి, శ్రవణ్ తదితరులు

> మహబూబ్‌నగర్, చేవెళ్ల ఇన్‌చార్జిని తానేనని రేవంత్ తొలుత ప్రకటించుకున్నారు. రెండు చోట్లా పరాజయం పక్కా అని తేలిపోవడంతో ఇన్‌చార్జ్‌గా తప్పుకున్నారు. భట్టి విక్రమార్క కూడా రెండు సీట్లకు ఇన్‌చార్జిగా ఉండగా ఆ తర్వాత తప్పుకోవడంతోనే పరాజయం ఓటమి తేలిపోయింది. -కేసీఆర్

ప్రజలు నమ్మేది బీఆర్‌ఎస్‌నే

చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరిలో తాము బలంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రజలు బీఆర్‌ఎస్‌నే నమ్ముతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మార్పు మొదలైందని, ప్రజలకు కాంగ్రెస్ తత్వం బోధపడిందని చెప్పారు. మైనార్టీ నుంచి ఒక్క మంత్రి కూడా లేరని, రంజాన్ తోఫా లేదు, క్రిస్మస్ కానుక లేదని ఆవేదన వ్యక్తం చేశారు.46 లక్షలమంది ఆసరా పింఛన్‌దారులకు చేయూత అని చేయిచ్చారని ఆరోపించారు.100 రోజుల్లో 1.67 కోట్లమంది ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500 ఇస్తామని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయకుంటే ఫ్రీ బస్సు పథకాన్ని ఎత్తివేస్తామని ప్రజలను ముఖ్యమంత్రి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు.

20 సార్లు అన్నా.. సప్పుడు లేదు

ఇఫ్తార్ విందులో సీఏఏ, ఎన్‌ఆర్‌సీపై మీ వైఖరేంటో చెప్పాలన్న అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నకు రేవంత్ ఒక్క మాటా మాట్లాడలేదని, రేవంత్ బీజేపీలోకి జంప్ అవుతాడంటూ తాను 20సార్లు అంటే దాని పైనా స్పందించడం లేదని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి మార్చి 15కు వంద రోజులు అయ్యాయని, ఆగస్టు 15 నాటికి 250 రోజులు అవుతాయని, అప్పటికీ హామీలు అమలు చెయ్యవా? అని ప్రశ్నించారు. హరీశ్ కూడా అదే అడిగారని, రేవంత్‌కు సత్తా ఉంటే స్పందించాలని కోరారు. రేవంత్ రుణమాఫీ నేతిబీరకాయలోని నెయ్యిలాంటిదేనని ఎద్దేవా చేశారు. మోదీని రాహుల్‌గాంధీ చౌకీదార్ చోర్ అంటారని.. చౌకీదార్ చోర్ హమారే బడే భాయ్ అని రేవంత్ అంటారని, ఆయన ఎవరి కోసం పనిచేస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

కేసీఆర్‌ను గెలిపిస్తే మోసగాళ్లకు బుద్ధి

2014లో బడే భాయ్ బడా మోసం చేస్తే, 2023లో చోటే భాయ్ కూడా బడా మోసం చేశారని కేటీఆర్ విమర్శించారు. ఈ మోసగాళ్లకు బుద్ధి చెప్పేందుకు కేసీఆర్‌ను తిరిగి గెలిపించాలని కోరారు. మోదీ తెలంగాణ పుట్టకనే అవమానించారని, ఒకటికి పదిసార్లు విషం చిమ్మారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్యాస్ నుంచి డీజిల్ పెట్రోలు వరకు అన్ని ధరలు పెంచేసి మోదీ దేశ ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా చమురు ధరలు మాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు జనామోదం, క్యాడర్ ఆమోదం లేదని తెలిపారు. వరంగల్‌లో కడియం శ్రీహరిని కాంగ్రెస్‌లో చేర్చుకోగానే మూడో స్థానంలోకి వెళ్లారని అన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలవనివ్వకుండా చేయడమే కాంగ్రెస్, బీజేపీ లక్ష్యమని, అందుకు ఆ పార్టీలు కొన్ని స్థానాల్లో నిలబెట్టిన అభ్యర్థులే సాక్ష్యమని పేర్కొన్నారు.

> బీఆర్‌ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి వెళ్లినవారు అక్కడ కంఫర్ట్‌గా లేరు. కాంగ్రెస్‌లోకి వెళ్లినవారు రేవంత్‌తో డీల్ చేసుకుని వెళ్లారు. పార్టీ మారిన నాయకుల పరిస్థితి ఏమిటో ఎన్నికల తరువాత బయటపడుతుంది. కేసీఆర్ పక్కన కూర్చునే కేకే కాంగ్రెస్‌లో ఎక్కడా కనిపించడం లేదు. పార్టీని విడిచి వెళ్లిన వారి వల్ల కొంత నష్టం జరిగిన మాట వాస్తవమే. -కేటీఆర్

బస్సుయాత్రకు బ్రహ్మరథం

కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 10-12 స్థానాల్లో గెలిస్తే రాష్ట్ర రాజకీయాల్లో చాలా మార్పులు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గట్టిగా కష్టపడితే 12 స్థానాలు గెలుచుకోవడం కష్టం కాదని తెలిపారు. ప్రజలు విజ్ఞతతో ఓట్లు వేయాలని కోరారు. రేవంత్ ప్రభుత్వంలో కమ్మ, ముదిరాజ్, మాదిగ, మైనార్టీ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని, ఆయా వర్గాలకు సీట్లు ఇవ్వలేదని కేటీఆర్ గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ మాత్రం సామాజిక సమతూకం పాటించిందని తెలిపారు. ఏ వర్గాన్నీ విస్మరించకుండా సీట్లు ఇచ్చామని గుర్తు చేశారు.

మల్లారెడ్డివి మునగచెట్టు ఎక్కించే మాటలు

మీడియా తన చుట్టూ ఉన్నప్పుడు మజాక్ చేస్తుండడం మల్లారెడ్డికి అలవాటేనని కేటీఆర్ పేర్కొన్నారు. ఈటలను మునగచెట్టు ఎక్కించి కిందపడేసేందుకే ఆయన గెలుస్తారని మల్లారెడ్డి అన్నారని తెలిపారు. మల్లారెడ్డి మాటలతో రాజేందర్ ఉబ్బితబ్బిబ్బయి ప్రచారాన్ని బంద్ పెడితే బీఆర్‌ఎస్ స్పీడ్ పెరుగుతుందని, తద్వారా బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుస్తాడంటూ మల్లారెడ్డి మాటల్లోని ఆంతర్యాన్ని బయటపెట్టారు. ఈటలను గతంలో రెండుసీట్లలో ఓడించామని, ఈసారి కూడా ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన నాయకులు పోటీ చేసిన స్థానాల్లోనే ఎక్కువ దృష్టి పెడతామని, వారిని ఓడించేందుకు కృషి చేస్తామని చెప్పారు. శారీరకంగా ఇబ్బంది పడుతున్నప్పటికీ రైతుల కోసం కేసీఆర్ పర్యటిస్తున్నారని, క్యాడర్‌లో ఉత్సాహం నింపుతున్నారని తెలిపారు. ఎన్నికల తర్వాత పార్టీ సంస్థాగత నిర్మాణం చేపడతామని, ప్రజా సమస్యలపై పోరాడతామని స్పష్టం చేశారు.

దేశ ప్రయోజనాల కోసం అంశాలవారీ మద్దతు

దేశానికి ఉపయోగం ఉంటుందనే జీఎస్టీ, నోట్ల రద్దుకు అప్పట్లో మద్దతు తెలిపామని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటు వేశామని, సీఏఏ, ఎన్‌ఆర్‌సీలకు అసెంబ్లీలో తీర్మానం చేశామని, విభజన చట్టంలోని హామీల గురించి కొట్లాడామని పేర్కొన్నారు. దళితుడు రాష్ట్రపతిగా, తెలుగువ్యక్తి ఉపరాష్ట్రపతిగా పోటీలో ఉంటే మద్దతు తెలిపామని పేర్కొన్నారు. బీజేపీకి తాము ఇచ్చింది అంశాలవారీ మద్దతు మాత్రమేనని పేర్కొన్నారు. చాలా బిల్లులకు కాంగ్రెస్ మద్దతు తెలిపిందని, అంతమాత్రాన ఆ రెండు పార్టీలూ ఒకటే అని అనలేమని చెప్పారు.

> 400 సీట్లు అంటూ మోదీ ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నారు. బీజేపీకి 220 సీట్లకు మించి వచ్చే ప్రసక్తే లేదు. 2014లో దేశం మొత్తం మోదీ గాలి వీచినా తెలంగాణలో మాత్రం బీజేపీని బీఆర్‌ఎస్ అడ్డుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి. -కేటీఆర్

అక్కడ తిడుతూ ఇక్కడ మద్దతు

కాంగ్రెస్ నాయకులు కేరళ వెళ్లి తిడతారని, మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం కలిసి పనిచేస్తారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో సీపీఎంను రేవంత్‌రెడ్డి బండబూతులు తిట్టినా ఇక్కడ మాత్రం వారు కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తారని, అది వారికే చెల్లిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిటీ కేసీఆర్‌ను పిలిస్తే ఆయన హాజరవుతారని పేర్కొన్నారు. సిరిసిల్లలో సాంచాలు నడవక నలుగురు నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడోసారి గెలిచి ఉంటే మహారాష్ట్రలో పోటీచేసి ఉండేవారమన్న కేటీఆర్.. ఏపీలో మాత్రం ప్రాంతీయ పార్టీలే గెలవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అక్కడ జగన్ గెలుస్తారని తమకు సమాచారం ఉందని కేటీఆర్ తెలిపారు.

> ఢిల్లీ లిక్కర్ స్కాం జరగలేదని, కేజ్రీవాల్ అరెస్ట్ అన్యాయమని రాహుల్‌గాంధీ అంటారు. మద్యం కుంభకోణం జరిగిందని, కవిత అరెస్ట్ న్యాయమేనని రేవంత్ అంటారు. ఒకే కేసులో అరెస్ట్ అయిన ఇద్దరిపై కాంగ్రెస్ పార్టీకి రెండు రకాల వైఖరి ఎలా ఉంటుంది. -కేటీఆర్


కడియంను ఎవరూ కాపాడలేరు

వరంగల్ ప్రజల హృదయాలను కడియం శ్రీహరి తీవంగా గాయపరిచారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా కడియంను కాపాడలేరని తేల్చిచెప్పారు. కడియం శ్రీహరి ఉద్యమ ద్రోహి అని, ఆయనకు కేసీఆర్ చాలా పదవులు ఇచ్చారని, చివరికి ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ కూడా ఇచ్చారని గుర్తుచేశారు. ఆయన చేసిన మోసాన్ని పార్టీ కార్యకర్తలు కూడా జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కాకతీయ కళాతోరణాన్ని అధికారిక ముద్ర నుంచి తీసేస్తామన్న రేవంత్‌రెడ్డి వరంగల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వారందరికీ పాదాభివందనం

ఒక రాజకీయ పార్టీ o23 సంవత్సరాలు పూర్తి చేసుకోవడమంటే చిన్న విషయం కాదని కేటీఆర్ పేర్కొన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీగా ప్రయాణం మొదలుపెట్టి, ఈ స్థాయికి చేరుకోవడమంటే మామూలు విషయం కాదని అన్నారు. 24 ఏండ్లలో 14 సంవత్సరాలు ఉద్యమం, 10 ఏండ్లు ప్రభుత్వంలో ఉన్నామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులందరికీ పాదాభివందనం చేస్తున్నట్టు చెప్పారు. వారు లేకపోతే తాము లేమని, వారు ఆనాడు చేసిన అసమాన పోరాటాలే ప్రభుత్వంలో రావడానికి, 33 జిల్లాల్లో పార్టీ వేళ్లునుకోవడానికి కారణమైందని వివరించారు. పిడికెడు మందితో జలదృశ్యంలో ప్రారంభమైన టీఆర్‌ఎస్.. తెలంగాణను సుజల దృశ్యంగా మార్చిందని పేర్కొన్నారు. మేధావులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువత, సబ్బండవర్గాలకు శిరసు వంచి ధన్యవాదాలు తెలుపుకొంటున్నట్టు చెప్పారు. మీరు చూపిన బాటలోనే ముందుకు నడుస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 3 నుంచి గత 144 రోజులుగా ప్రతి రోజు ఏదో ఒక సందర్భంలో కేసీఆర్‌ను తలుచుకోని వారు లేరని పేర్కొన్నారు. కేసీఆర్ మళ్లీ వస్తే బాగుంటదని ప్రజలు ఆలోచిస్తున్నారని చెప్పారు.

లోకం పోకడ



మన పార్టీ ప్రచార రథం సిద్ధం చేసాం సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	47.8°c	27.3°c
ఆదిలాబాద్	44.8°c	27.3°c
రంగారెడ్డి	43.5°c	22.8°c
నిజామాబాద్	43.4°c	28.5°c
ఖమ్మం	43.0°c	26.0°c
హైదరాబాద్	42.3°c	28.3°c
మెదక్	42.1°c	23.0°c
కరీంనగర్	42.0°c	28.0°c
వరంగల్	42.0°c	28.0°c
మహబూబ్‌నగర్	41.5°c	29.3°c

గ్యారెంటీలు అమలు చేసినట్టు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా

కాంగ్రెస్ నేతలకు బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సవాల్

విద్యానగర్, ఏప్రిల్ 27: 'కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసినట్టు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా.. సమయం, తేదీ, వేదిక మీరే నిర్ణయించండి' అని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించేందుకు యత్నిస్తున్నదని మండిపడ్డారు. శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు మీడియాలో బ్రేకింగ్‌ల కోసం సవాళ్ల పేరిట నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామన్నారని, మేనిఫెస్టో బైబిల్, ఖురాన్, భగవద్గీత అని మోసం చేశారని నిప్పులు చెరిగారు. మరో కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ముస్లింల పార్టీ కాంగ్రెస్ అని.. హిందూత్వ టీం బీజేపీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

బీఆర్‌ఎస్.. తెలంగాణ ఇంటి పార్టీ

- ప్రజాస్వామిక ఉద్యమాలకు దిక్సూచి
- రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిన ఘనకీర్తి
- కేసీఆర్ బాటలో పునరంకితమవుతం
- ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్.. తెలంగాణ ఇంటి పార్టీ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన గులాబీ జెండాను ఎగరవేశారు. అంతకు ముందు తెలంగాణ తల్లికి పూలమాల వేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణకంటూ ఒక గొంతు ఉండటం అవసరమని, తెలంగాణకంటూ ఉన్న ఒక ఇంటి పార్టీ బీఆర్‌ఎస్ అని, తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీ రామరక్ష అన్న నాటి జయశంకర్ సార్ మాటలు ఎప్పటికీ వాస్తవంగా నిలుస్తాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఏనాడూ విజయాలకు పొంగిపోదని, అపజయాలకు కుంగిపోదని తెలిపారు. 2001లో శూన్యంలాంటి వాతావరణంలో, అనేక ప్రతికూలతలు ఉన్నా చిమ్మ చీకటిలో ఒక చిన్న కాంతిరేఖలాగా జలదృశ్యంలో పార్టీని ప్రారంభించినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ సాధించుకున్న తెలంగాణకు సరైన నాయకత్వం కేసీఆర్‌దేనని గుర్తించిన ప్రజానీకం 2014లో తమ పార్టీకి అధికారం కట్టబెట్టారని కేటీఆర్ చెప్పారు. తొమ్మిదిన్నరేండ్ల పరిపాలనలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేశామని తెలిపారు. జాతీయస్థాయిలో మన ఆలోచనా విధానాన్ని తీసుకెళ్లాలని, తెలంగాణలో సాధించిన ప్రగతిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలన్న ఉద్దేశంతోనే భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చి జాతీయ పార్టీగా రూపాంతరం చెందిందని వివరించారు.

ప్రజలకు పాదాభివందనం

బీఆర్‌ఎస్ పార్టీకి 24 యేండ్లు నిండుతున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, గులాబీ సైనికులు, ఆడబిడ్డలు, అఖండమైన ప్రేమను నింపిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన వందలాదిమంది తెలంగాణ అమరవీరులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ రుణపడి ఉంటామని, కేసీఆర్ చూపిన బాటలో మరోసారి పునరంకితం అవుతామని కేటీఆర్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ జైలు నుంచి విడుదలైన తర్వాత అడ్వకేట్ రాజేశంతో మాధవరావు

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్‌కు బెయిల్

- మాధవరావు విడుదలకు చొరవ చూపిన కేసీఆర్, కొప్పుల

ధర్మారం, ఏప్రిల్ 27: పోలీసుల అక్రమ కేసులో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా మండల ప్రధాన కార్యదర్శి సల్వాజీ మాధవరావుకు బెయిల్ వచ్చింది. శనివారం సాయంత్రం కరీంనగర్ జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. మార్చి 18న సల్వాజీ మాధవరావుపై యూత్ కాంగ్రెస్ నాయకుడు సోగాల తిరుపతి దాడి చేయడమే కాకుండా ఎస్సీ కులం పేరిట దూషించారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి చేసిన తిరుపతిపై మాత్రం పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ నెల 25 వరకు కోర్టు రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పార్టీ లీగల్ సెల్ చొరవతో మాధవరావుకు బెయిల్ వచ్చింది.

కమిటీయే లేదు.. పునరుద్ధరణ ఎట్లా?

- 'కాళేశ్వరం' బాగుపై సర్కార్‌కు ఏదీ శ్రద్ధ?
- ఎన్డీఎస్‌ఏ ఆదేశాల అమలుకు ఎస్డీఎస్‌వో తప్పనిసరి!
- స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ పటిష్టతపై స్పష్టత కరువు
- డైవర్షన్ ఉద్యోగులతోనే కొనసాగింపు
- మేలో కీలక అధికారుల ఉద్యోగ విమరణ
- నియామకాలపై నెలక్రితమే మార్గదర్శకాలు
- అయినా పట్టింపులేని రాష్ట్ర సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) మార్గదర్శకాలు జారీ అయ్యాకే కాళేశ్వరం ప్రాజెక్టును పునరుద్ధరిస్తాం' అని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెబుతున్నది. కానీ, ఆ మార్గదర్శకాల అమలు కోసం పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటులో అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఎన్డీఎస్‌ఏ ఆదేశాల అమలుతో పాటు పర్యవేక్షణ బాధ్యతలు చూడాల్సిన 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్‌వో)'ను పటిష్టం చేయకుండా ఇప్పటికీ డైవర్షన్ ఉద్యోగులతోనే సరిపెడుతున్నది. వీరిలో ఇద్దరు కీలక అధికారులు వచ్చే మేలోనే విరమణ పొందనుండగా నియామకాలపై నెలక్రితమే ఎన్డీఎస్‌ఏ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఎవరిని నియమించాలనేదానిపై సిఫార్సులు కూడా చేసింది. అయినా ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగుకూడా వేయకుండా ప్రాజెక్టు పునరుద్ధరణపై అశ్రద్ధ చూపుతున్నది.

ఎస్డీఎస్‌వోలదే ముఖ్య భూమిక

ప్రాజెక్టుల నిర్వహణ, భద్రత కోసం డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 మేరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు అంచెల వ్యవస్థను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా డ్యామ్‌ల భద్రతను పర్యవేక్షించేందుకు 'ఎన్డీఎస్‌ఏ'ను ప్రత్యేకంగా నెలకొల్పింది. ఆనకట్ట భద్రత విధానాల రూపకల్పన, నిబంధనల సిఫార్సు కోసం వివిధ విభాగాల్లో నిపుణులు, రాష్ట్రాల అధికారులతో కలిపి 'డ్యామ్ సేఫ్టీ జాతీయ కమిటీ'ని ఏర్పాటు చేసింది. జాతీయ ప్రాజెక్టుల భద్రత ప్రమాణాలను ఏటా రెండు సార్లు నిర్ధారించేందుకు 'డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్స్'ను ఏర్పాటు చేయాలి. ఇదే తరహా రాష్ట్రాలు సైతం తమ పరిధిలోని డ్యామ్‌ల భద్రత పర్యవేక్షణ, ఎన్డీఎస్‌ఏ మార్గదర్శకాల అమలు కోసం ఎస్డీఎస్‌వోలను ఏర్పాటు చేయాలి. సలహాలు, సూచనలు, సిఫార్సుల కోసం 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ కమిటీ'లను, భద్రత, ఆడిట్ కోసం 'స్టేట్ డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్'ను నెలకొల్పాలి. ఇలా చట్టంలో మొత్తంగా ఎస్డీఎస్‌వోలదే కీలక భూమిక. ఏదైనా ప్రాజెక్టులో లోపాలను గుర్తిస్తే వాటి పునరుద్ధరణ బాధ్యత కూడా వీటిదే. ఎన్డీఎస్‌ఏ మార్గదర్శకాలు, ఆమోదం, పర్యవేక్షణలోనే పనులు కొనసాగించాలి. ఇందుకోసం డ్యామ్ సేఫ్టీ యాక్ట్, 2021లోని సెక్షన్ 21 ప్రకారం ఎస్డీఎస్‌వోలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.



డైవర్షన్ ఉద్యోగులతోనే..

చట్టాన్ని అనుసరిస్తూ ఎస్డీఎస్‌వోను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. చీఫ్ ఇంజినీర్, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇద్దరు ఈఈలు, నలుగురు డీఈఈలు, ఎనిమిది మంది ఏఈఈలు, కార్యాలయం కోసం ఒక డీఈఈ, డ్రాయింగ్ డిస్బర్సింగ్ ఆఫీసర్, ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఏఈఈ), ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 10 మంది ఆఫీస్ సబార్డినేట్లతో ఎస్డీఎస్‌వోను నెలకొల్పాలి. దీని హెడ్ అకౌంట్‌ను కూడా ప్రత్యేకంగా నిర్వహించాలి. ఈ విభాగం డ్యామ్‌ల భద్రతను పర్యవేక్షిస్తూనే, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ కూడా ఇవ్వాలి. చట్టం అమల్లోకి వచ్చిన వెంటనే అప్పటికప్పుడు ఏర్పాటు చేసే పరిస్థితి లేక అప్పటి ప్రభుత్వం తాత్కాలికంగా కమిటీ ఏర్పాటు చేసింది. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగం కింద ఉన్న అధికారులనే డైవర్షన్ చేసి ఎస్డీఎస్‌వో బాధ్యతలు అప్పగించింది. ఇప్పటికీ ఆ అధికారులతోనే ఎస్డీఎస్‌వో కొనసాగుతున్నది. ఈఎన్సీ చైర్మన్‌గా, ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఈఎన్సీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజినీర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్, రామగుండం ఈఎన్సీ సభ్యులుగా 'స్టేట్ కమిటీ ఆన్ డ్యామ్ సేఫ్టీ'ని గత ప్రభుత్వం నియమించింది. ఇందులోనూ మహారాష్ట్ర, కర్నాటక, ఏపీ చీఫ్ ఇంజినీర్లు, ఓయూ, జేఎన్టీయూల నుంచి హైడ్రాలజీ, డ్యామ్ డిజైన్ నిపుణులు, సీడబ్ల్యూసీ నుంచి హైడ్రాలజీ, పవర్ తదితర రంగాల నిపుణులను నియమించాల్సి ఉంది. ఎన్డీఎస్‌ఏ మార్గదర్శకాల మేరకే మేడిగడ్డ బరాజ్‌ను పునరుద్ధరిస్తామని నాలుగు నెలలుగా చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటికీ ఎస్డీఎస్‌వో, ఎస్డీఎస్‌సీలపై దృష్టి పెట్టక వాటిని పూర్తిస్థాయిలో నియమించలేదు.

పూర్తిస్థాయి కమిటీదే బాధ్యత

జలాశయాల నిఘా, తనిఖీ, ఆపరేషన్, నిర్వహణ, రక్షణ, ప్రమాదాలకు బాధ్యులను నిర్ధారిస్తూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) సిఫారసులు- 2023 పేరిట కేంద్రం నెల క్రితమే కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి ఆనకట్టకు సంబంధించి డిజిటల్ లాగ్‌బుక్‌లు, డాటాబేస్‌ను ప్రతి రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ తప్పక నిర్వహించాలి. నిర్దేశిత ఆనకట్ట ఎక్కడుంది? ఎప్పుడు, ఎందుకోసం, ఏ నదిపై? ఎవరు, ఏ సంవత్సరంలో నిర్మించారు? ఆపరేషన్ ప్రోటోకాల్ ఇలా ప్రతి సాంకేతిక అంశాన్ని డిజిటల్ రూపంలో ఎస్డీఎస్‌వోనే రూపొందించాలి. ప్రాజెక్టు ఆపరేషన్ ప్రోటోకాల్, నిర్వహణ, క్రమం తప్పకుండా తనిఖీలు, మరమ్మతులు ఎప్పుడు ప్రారంభించారు? ఎప్పుడు పూర్తిచేశారు? తదితర వివరాల డిజిటల్ రికార్డులను నిర్వహించాలి. ప్రాజెక్టులో ఎప్పుడు, ఎలాంటి ప్రమాదం జరిగింది? ఏ నిర్మాణం దెబ్బతిన్నది? సీపేజీ తీరు, లీకేజీలు, భూకంపాలు, మట్టికోతకు గురవడం వంటివి ఏమైనా ఉన్నాయా? గుర్తించి ఏ అధికారి, ఏ రోజున తనిఖీ చేశారు? ఏం పరిశీలించారు? ప్రమాద నివారణకు చేసిన ప్రతిపాదనలు ఏమిటి? నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యాయా? వంటి వివరాలను కూడా క్రోడీకరించాలి. ప్రభుత్వం పూర్తిస్థాయి ఎస్డీఎస్‌వోలను నియమించకపోవడంతో ఎన్డీఎస్‌ఏ మార్గదర్శకాల అమలు కొనసాగడం లేదు.

మేలో అధికారుల విరమణ

ఎస్డీఎస్‌వోలో ఓఅండ్‌ఎం ఈఎన్సీ నాగేందర్‌రావు కీలకభూమిక పోషిస్తున్నారు. సీఈ ప్రమిల, ఎస్ఈ మురళీకృష్ణ సైతం ఆది నుంచీ సేవలందిస్తున్నారు. వారిలో నాగేందర్‌రావు, మురళీకృష్ణ ఇద్దరూ వచ్చే నెలలో విరమణ పొందనున్నారు. ఆనకట్టల భద్రత పర్యవేక్షణకు సంబంధించి నియమించాల్సిన అధికారుల అర్హతలను తెలుపడంతోపాటు, ప్రమాదాలకు బాధ్యత వహించాల్సిన అధికారులకు సంబంధించిన నిబంధనలను కూడా ఎన్డీఎస్‌ఏ స్పష్టం చేసింది. ఆనకట్టల భద్రతకు చీఫ్ ఇంజినీర్ మొదలు దిగువ జేఈల వరకు బాధ్యులను చేయడంతోపాటు, సదరు అధికారులకు ఉండాల్సిన అర్హతలు, అనుభవం, పొందాల్సిన శిక్షణపైనా మార్గదర్శకాలు ఇచ్చింది. నిర్దేశిత డ్యామ్‌ల పరిశోధన, రూపకల్పన, నిర్మాణంలో పాటించాల్సిన నిబంధనలు, అందుకోసం నియమించే ఇంజినీర్ల అర్హతలను సైతం నిర్దేశించింది. కానీ, భారీ ప్రాజెక్టుల్లో పనిచేసి, విద్యార్హతలేనివారు కొందరు, విద్యార్హతలున్నా భారీ ప్రాజెక్టుల్లో అనుభవం లేనివారు కొందరు ఉండడంతో కమిటీ ఏర్పాటుపై రాష్ట్ర సర్కారు ఒక్క అడుగుకూడా ముందుకు వేయడం లేదు. మరి ఈ పరిస్థితిలో ఎన్డీఎస్‌ఏ మార్గదర్శలు అమలు చేయాల్సిన ఎస్డీఎస్‌వోలు పటిష్టంగా లేకపోవడంతో 'కాళేశ్వరం' పునరుద్ధరణ ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మేడిగడ్డను అట్లా వదిలేస్తే ఎట్లా?

మొదటిపేజీ తరువాయి...

రోజుల్లో ఎన్డీఎస్‌ఏ నివేదిక రాబోతున్నదని ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించినా అలాంటిదేమీ రాలేదు. ఈ నేపథ్యంలో ఎన్డీఎస్‌ఏ మధ్యంతర నివేదికను వెంటనే తెప్పించుకోవాలని ప్రభుత్వానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్ సూచించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. బరాజ్‌కు మరింత నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆది నుంచీ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అదే తరహాలో తాజాగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కూడా నీటిపారుదల శాఖను ఆదేశించడం విశేషం.

నీటిపారుదల శాఖ అధికారులతో ఘోష్ భేటీ

కాళేశ్వరంపై జ్యుడీషియల్ విచారణ చేపట్టిన ఘోష్.. శనివారం కోల్‌కతాకు వెళ్లేముందు అధికారులతో సమావేశమయ్యారు. మే నెలాఖరున లేదా జూన్‌లో గోదావరికి వరదలు రానున్న నేపథ్యంలో బరాజ్‌లు మరింత దెబ్బతినకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. దీనికోసం అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ నిపుణుల కమిటీ నివేదికను తెప్పించుకోవడానికి వీలుగా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌కు లేఖ రాయాలని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. ఆ నివేదికను వెనువెంటనే తెప్పించుకొని, దాని ఆధారంగా బరాజ్‌ల రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విచారణలో ఎన్డీఎస్‌ఏ నివేదిక కూడా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

మే 8న రాష్ట్రానికి..

విచారణ కోసం ఈ నెల 24న హైదరాబాద్ వచ్చిన జస్టిస్ పినాకి చంద్రఘోష్, మూడురోజుల పాటు హైదరాబాద్‌లో మకాం వేసిన అనంతరం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోయారు. మరోవైపు, కాళేశ్వరం విచారణపై పత్రికల్లో బహిరంగ ప్రకటనను విడుదల చేసి, విచారణకు అవసరమైన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మే 8న కోల్‌కతా నుంచి హైదరాబాద్ రానున్న ఆయన.. అదేరోజు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను సందర్శించనున్నారు. తదనంతరం హైదరాబాద్‌కు చేరుకొని.. కాగ్ నివేదికతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక, ఎన్డీఎస్‌ఏ నివేదికలపై అధ్యయనం చేసే అవకాశాలున్నాయి.

ఈటల ఏం చేసిండని గెలుస్తడు?: మల్లారెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఈటల రాజేందర్‌ను ఉద్దేశించి అన్న వ్యాఖ్యలపై మాజీమంత్రి మల్లారెడ్డి వివరణ ఇచ్చారు. 'ఎదురుపడిన మనిషిని మాట వరసకు నువ్వే గెలుస్తావ్ అని అన్న. దానికి సోషల్ మీడియాలో తిప్పుతుండ్రు. అసలు ఈటల రాజేందర్ మల్కాజిగిరికి ఏం చేసిండు? ఆయనకు ఇక్కడ ఓటు లేదు. ఆయనది మల్కాజిగిరి కాదని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థిపై ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థి గోడం నగేశ్, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషాపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్‌కుమార్, ఆశిష్ శనివారం సీఈవో వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. గోడం నగేశ్ ఎన్నికల అఫిడవిట్‌లో పూర్తి వివరాలు నమోదు చేయలేదని, ఈ విషయంపై ఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సీఈవో దృష్టికి తెచ్చారు. బీజేపీ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించి, రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా బీజేపీకి అనుకూలంగా పని చేస్తున్నదని దాసోజు శ్రవణ్ విమర్శించారు. నగేశ్ నామినేషన్‌ను తిరస్కరించడానికి ఆధారాలు చూపినా రిటర్నింగ్ అధికారి తిరస్కరించలేదన్నారు.

మతిస్థిమితం కోల్పోయిన రేవంత్

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో టీడీపీలో పనిచేశారని, బాలకృష్ణ తరహాలో పెద్ద పెద్ద డైలాగులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు ఆడుతున్నదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని ఎక్కువసార్లు సవరించింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చి, ఎస్టీలు, బీసీలకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్ గుర్తుకు రావడమే లేదని ఆరోపించారు.

నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు

- రేవంత్‌రెడ్డికి ఓటమి భయం.. అందుకే ఒట్లు
- కేసీఆర్ బస్సుయాత్రతో బుగులు
- ఉద్యమంలో జిరాక్స్ పేపర్ ఇచ్చి ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు ఒత్తిండు
- తెలంగాణకోసం పదవులు త్యజించిన
- ఇప్పటికీ మాట మీద కట్టుబడి ఉన్నా
- దేవుళ్ల మీద ఒట్టు పెట్టి మోసాలు
- కాంగ్రెస్ నేతల్లో ఫ్రస్ట్రేషన్..
- హస్తం పార్టీకి ఓటేస్తే జిల్లాలను రద్దుచేస్తరు
- సీఎం రేవంత్‌పై హరీశ్ ధ్వజం



కరీంనగర్‌లో 9వ డివిజన్ కోతిరాంపూర్‌లో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సిద్దిపేట/కరీంనగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): నాడు ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన రేవంత్‌రెడ్డి.. నేడు ఓటు కోసం దేవుళ్లపై ఒట్టు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ 24వ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శనివారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో గులాబీ జెండాను ఎగురవేశారు. అనంతరం కరీంనగర్‌లో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో భాగంగా పాదయాత్ర చేశారు. ఈ సందర్భాల్లో మాట్లాడిన హరీశ్.. ఓటమి భయంతోనే సీఎం రేవంత్ దేవుళ్లపై ఒట్టు పెట్టుకోవటం, రిజర్వేషన్ల ముసుగులో కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే తనను దించేస్తారనే భయం రేవంత్‌రెడ్డికి పట్టుకున్నదని, ఇది ఆయన మాటల్లో, ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. కేసీఆర్ బస్సు యాత్రలో ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేసినట్టు వెంటనే తన రాజీనామా లేఖను మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి అందించాలని, ఆ తర్వాత రెండు నిమిషాల్లో తాను రాజీనామా లేఖ అందజేస్తానని మరోసారి సవాల్ విసిరారు. రాజీనామా లేఖతో తాను గన్‌పార్క్ వద్దకు వస్తే, సీఎం తన రాజీనామా లేఖ ఇవ్వకుండా సొల్లు మాటలు చెప్తున్నారని విమర్శించారు. ఉద్యమ సమయంలోనూ రాజీనామా చేయాలని అడిగితే రేవంత్‌రెడ్డి జిరాక్స్ పేపర్ ఇచ్చి ఆంధ్రా నాయకుల అడుగులకు మడుగులు ఒత్తారని ఆరోపించారు. తాము మాత్రం పదవుల కోసం పాకులాడే వ్యక్తులం కాదని, తెలంగాణ కోసం తాను రెండు సార్లు ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లానని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పినట్టు ఆరు గ్యారెంటీలు, రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు రూ.2,500, రైతుబంధు రూ.15 వేల రైతుభరోసాతో పాటు 100 రోజుల్లో అమలు చేస్తామని సోనియాగాంధీతో చెప్పించిన హామీలను ఆగస్టు 15లోపు అమలు చేస్తే తాను రాజీనామాకు సిద్ధమేనని మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం రాజీనామా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తేల్చిచెప్పారు. దమ్ముంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంతేకాని దేవుళ్ల పేరుమీద ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేయడం తగదని చురక అంటించారు. ఇప్పటికైనా బాండ్‌పేపర్లలో రాసిచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కోమటిరెడ్డి సొల్లుమాటలు

తొలి సంతకం రుణమాఫీపైనే అని చెప్పి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని, గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని అబద్ధపు మాటలు చెప్పిందని హరీశ్ విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా హామీలు అమలు చేయాలని కోరితే.. కోమటిరెడ్డి లాంటోళ్లు కొంతమంది సొల్లు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తే, ఆ ఫ్రస్ట్రేషన్‌లో తనను తిడుతున్నారని తెలిపారు. తిట్టుడు మాని ఇచ్చిన హామీలు అమలు చేయాలని హితవు పలికారు. ఉద్యమ సమయంలో రాజీనామాలు చేయాలని కోరితే కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి తప్పించుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి జిరాక్స్ పేపర్ ఇస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాజీనామా చేయకుండా వెన్ను చూపారని విమర్శించారు. తాము ప్రజల కోసం పదవులను వదులుకుంటే, ఈ నాయకులు ఇద్దరు ఆంధ్రా పాలకుల కోసం పదవులు పట్టుకొని వేలాడారని ధ్వజమెత్తారు. ఇక, జిల్లాలు ఎక్కువయ్యాయని, కమిషన్ వేసి పార్లమెంట్ స్థానం లెక్కన జిల్లాను చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, మెదక్ పార్లమెంట్ పరిధిలోని మూడు జిల్లాలు ఉన్నాయని, మరి ఇందులో ఏ రెండు జిల్లాలను రద్దు చేస్తారని ప్రశ్నించారు. జిల్లాలు రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ మోసపోతామని, ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తామంటే, జిల్లా ప్రజలు ఊరుకోబోరని, గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు.

తెలంగాణ కోసం బీఆర్ఎస్ మరో ప్రజా ఉద్యమం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్న ఈ తరుణంలో తెలంగాణ కోసం మరోసారి ప్రజా ఉద్యమానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉన్నదని హరీశ్‌రావు తెలిపారు. శనివారం ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గులాబీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఒక్కడితో మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం, ఉద్యమ తమ్ముళ్ల ఆశలను మారి స్వరాష్ట్ర కలను సాకారం చేసింది. తెలంగాణ జెండా ఎత్తుకున్నాక కేసీఆర్ వెంట పిడికిలి బిగించిన మంది ఎందరో. కానీ, ఎన్నో పిడికిళ్లకు మూడున్నర కోట్ల పిడికిళ్లను కేసీఆర్ జత చేసింది. ఎన్నో ఎత్తు పల్లాలు, ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో అణచివేతలు, ఎన్నో అవమానాలు. 23 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేసీఆర్ ఎత్తిన జెండాను దించలేదు. పట్టిన పట్టును విడవలేదు. త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ ప్రత్యేక రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడి, పదేండ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించింది. ఈ ఘనత ముమ్మాటికీ గులాబీ జెండాదే. ఆత్మగౌరవ పతాకై బతికిన జాతి తెలంగాణ జాతి. ఆత్మగౌరవం దెబ్బ తీస్తున్న ఢిల్లీ దిక్కారస్వరమై నిలిచింది. కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఇచ్చిన హామీలను అమలు చేయటం లేదు. తెలంగాణకు నష్టం జరిగిన ప్రతిసారి బీఆర్ఎస్ గొంతెత్తి నినదించింది. ప్రజల పక్షాన పోరాటం చేసింది. ఇప్పుడు మరోసారి ప్రజల పక్షాన ప్రజా ఉద్యమం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ సంసిద్ధమైంది' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, స్థానిక కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్ సవాల్‌ను స్వీకరించు

- రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను ఆగస్టు 15లోగా అమలు చేయకుంటే రాజీనామా చేస్తానని ప్రకటించాలి
- ఓటమి భయంతోనే దేవుడిపై ఒట్లు
- రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద



హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీలను ఆగస్టు 15లోగా అమలు చేయకుంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. రేవంత్ రాజకీయ ప్రస్థానమే అబద్ధాల పునాదుల మీద మొదలైందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్‌ను రేవంత్‌రెడ్డి స్వీకరించలేకపోతున్నారని, మాటల గారడీలతో ప్రజలను మభ్య పెడుతున్నారని దుయ్యబట్టారు. శనివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రేవంత్‌రెడ్డి ప్రజా విశ్వాసం కోల్పోయారని విమర్శించారు. ఎక్కువ ఎంపీ స్థానాలు గెలుచుకోలేకపోతే, సీఎం పదవికి ఎసరు వస్తుందన్న భయంతోనే దేవుళ్ల మీద ఒట్లు పెడుతున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు అంటే ప్రజల్లో నమ్మకం ఉన్నదని, ఆయన రాజీనామా సవాల్‌ను ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే తన రాజీనామా పత్రాన్ని తనకు ఇష్టమైన వ్యక్తి దగ్గర పెట్టాలని సవాల్ చేశారు. కొడంగల్‌లో ఎమ్మెల్యేగా ఓడిపోతే, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన రేవంత్ రెండుసార్లు మాట తప్పారన్నారు. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లేటప్పుడు రేవంత్ రాజీనామా లేఖను స్పీకర్‌కు కాకుండా చంద్రబాబుకు పంపారని గుర్తుచేశారు. హరీశ్‌రావు రాజీనామాపై మాట్లాడే ముందు రేవంత్ తన గతాన్ని గుర్తు చేసుకోవాలని హితవు పలికారు.

ఖమ్మం కాంగ్రెస్‌లో అసంతృప్త జ్వాలలు

- బరిలో నిలవాలని 'పోట్ల'పై అనుచరుల ఒత్తిడి
- ఎన్నికల ప్రచారానికి కీలక నేతల హాజరుపై ఫోకస్
- రంగంలోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రఘురాంరెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు ఆ పార్టీ నుంచి అనేకమంది నేతలు దరఖాస్తు చేసుకున్నారు. 25 రోజులపాటు వీరి మధ్య దోబూచులాడిన అభ్యర్థిత్వం ఎట్టకేలకు ఖరారైంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రఘురాంరెడ్డిని ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. దీంతో టికెట్ ఆశించి భంగపడిన నేతల్లో నెలకొన్న అసంతృప్తి ఒక్కసారిగా భగ్గుమన్నది. కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశించిన మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అనుచరులు శుక్రవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సమావేశమై పోట్లకు టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన పోట్ల నాగేశ్వరరావు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవాలని ఆయన అనుచరుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తున్నట్టు సమాచారం. 17 లోక్‌సభ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా కమ్మ సామాజికవర్గానికి కేటాయించలేదని చర్చించుకున్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురాంరెడ్డిని పార్టీ ఖరారు చేసిన తర్వాత ఈ నెల 25న ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసిన పొంగులేటి ప్రసాదరెడ్డి మినహా ఏ ఒక్కరూ హాజరు కాలేదు. ఉప ముఖ్యమంత్రి మల్లు కూడా గైర్హాజరవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీనియర్ నేతలు పార్టీ ఇచ్చే ప్రాధాన్యాన్ని బట్టి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలా? వద్దా? అని భావిస్తున్నట్టు సమాచారం.

అసంతృప్తులకు నేతల బుజ్జగింపులు

ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్‌లోని అసంతృప్తులను బుజ్జగించేందుకు పార్టీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థి రఘురాంరెడ్డి రంగంలోకి దిగారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం చివరిరోజు కావడంతో.. రెబల్ నామినేషన్లను ఉపసంహరింపజేసేందుకు కాంగ్రెస్ నేతలు పోట్ల నాగేశ్వరరావు, యాదయ్యలతో మంతనాలు జరుపుతున్నారు.

ఇప్పుడే ఎలచ్చన్ పెడితే కేసీఆరే అస్తడు

- రేవంత్‌రెడ్డి అదీ ఇదీ ఇస్తనన్నడు
- ఏదీ ఇస్తలేడు.. అన్నీ పోయినయ్
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో ఐలవ్వ

గజ్వేల్, ఏప్రిల్ 27 : 'మళ్లేసుడు కాదు.. ఇప్పుడే ఎలచ్చన్ పెట్టుర్రి. ఇప్పుడే తెలంగాణ పార్టీ గెలుస్తది. మిషన్‌లతో తెలువక మోసపోయినమ్. కేసీఆర్ దేవుడు' అంటూ గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన ఐలవ్వ అనే కూరగాయల వ్యాపారి మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో అన్నమాటలివి. శనివారం ఆయన సమీకృత కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సదరు మహిళను కారు గుర్తుకు ఓటు వేయాలి కోరారు. వెంటనే ఐలవ్వ స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించింది. 'మూడు నెలల్లో పొలాలు అన్ని ఎండిపోయినయ్.. కరెంట్ పోయింది.. ఫ్రీ బస్సుతో జనం సచ్చిపోతుర్రు. కిందొకరు సస్తుర్రు.. మీదొకరు సస్తుర్రు.. రేవంత్‌రెడ్డి పింఛన్లు నాలుగు వేలు ఇస్తనన్నాడు.. అదీ పోయింది. ముసలోల్లకు ఇవి అవ్వి అన్నడు.. అన్నీ పోయినయ్. ఉరేసుకొనికి పోతుర్రు. బ్యాంకుల మాఫీ అయితయన్నడు. అవీ కాలే అని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కల్యాణలక్ష్మి ఇస్తుర్రా అని ఐలవ్వను వెంకట్రామిరెడ్డి అడగ్గా.. ఎప్పుడో దెంకపోయింది. తులం బంగారం అన్నడు అదీ పోయింది. కారుకు మళ్లేసుడు. కాదు, ఇప్పుడే ఎలచ్చన్లు పెట్టుర్రి, ఇప్పుడే తెలంగాణ వస్తది. ఇప్పుడే కేసీఆర్ వస్తడు. మీరు అనవసరంగా ఐదేండ్ల టైం పెట్టిర్రు. మిషన్లు పెట్టడంతో తెల్వక మోసపోయాం' అని ఆమె పేర్కొన్నది. కచ్చితంగా అందరు కారు గుర్తుకే ఓటు వేయాలని వెంకట్రామిరెడ్డి కోరుతూ కరపత్రాన్ని అందిస్తుండగా.. 'ఇదెందుకు సారూ.. మా ఇంట్ల కేసీఆర్ ఫొటోనే ఉన్నది' అని చెప్పింది.

15, 16న 'పీఆర్సీ' చర్చలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల వేతన సవరణకు నియమించిన పీఆర్సీ కమిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపనున్నది. ఈ మేరకు వివిధ సంఘాలకు పీఆర్సీ కమిటీ ఆహ్వానాలను పంపింది. మే 15న బీఆర్కే భవన్‌లో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ), 16న సమావేశానికి హాజరుకావాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) తదితర సంఘాలకు ఆహ్వానాలు పంపించింది. ఇటీవలే పీఆర్సీ కమిటీ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. ఫిట్‌మెంట్ సహా పలు అంశాలపై ప్రతిపాదనలను సంఘాలు కమిటీ ముందుంచాయి.

ఆగస్టు 15లోపు రుణమాఫీ సాధ్యమా?

- కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా అంత ఈజీ కాదంటున్న ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు
- రుణ బదిలీకి బ్యాంకులు ఒప్పుకోవాలి
- రిజర్వ్‌బ్యాంక్ అనుమతి తప్పనిసరి
- మార్గదర్శకాలు, కటాఫ్ తేదీ నిర్ణయించని సర్కార్
- రైతుల వివరాలసేకరణకే 4 నెలలు
- మాఫీ చేయాల్సిన రుణం సుమారు 40 వేల కోట్లు
- ఎంపీ ఎన్నికల వేళ మభ్యపెట్టేందుకేనని విమర్శలు

కేసీఆర్ చేసిన రుణమాఫీ పొందినవారు వెంటనే బ్యాంకుకు వెళ్లి రూ.2 లక్షలు తెచ్చుకోండి. నేను రాగానే డిసెంబర్ 9న మొత్తం రుణాలను మాఫీ చేస్తా. అందుకే రుణాలు తెచ్చుకోవాలని రైతులను కోరుతున్నా.
-అసెంబ్లీ ఎన్నికలకు ముందు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

రుణమాఫీ సాధ్యమవుతుంది. ఇందుకు రూ.30-32 వేల కోట్లు అవసరం. 50 నెలలకు ఇన్‌స్టాల్‌మెంట్‌గా తీసుకుంటాం. ఒక నెలలో రుణమాఫీ పూర్తిచేస్తాం.
- జనవరి 6న ఒక న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం రేవంత్‌రెడ్డి

నారాయణపేట గడ్డపై నుంచి 69 లక్షల మంది తెలంగాణ రైతులకు మాట ఇస్తున్నా. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతా.
- ఏప్రిల్ 15న ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామంటూ నమ్మబలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన తరువాత ఎప్పటికప్పుడు దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు మాట తప్పిన రేవంత్‌రెడ్డి మరోసారి మాట తప్పరనే గ్యారెంటీ ఏమున్నదని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్నందున ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామంటూ ప్రకటించారని, దీనిని నమ్మలేమని రైతులు చెప్తున్నారు. రైతుబంధు అంశంలోనూ ఇదేవిధంగా చేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ కష్టమే

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేయడం కష్టమేనని ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రుణమాఫీ సీఎం చెప్పినంత ఈజీ కాదని చెబుతున్నారు. జూన్ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటున్నందున అప్పటివరకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేరు. మిగిలిన రెండు నెలల్లోనే మార్గదర్శకాలు రూపొందించడం, కార్పొరేషన్ ఏర్పాటు చేయడం, బ్యాంకుల నుంచి లెక్కలు తెప్పించడం, బ్యాంకుల రుణాలను కార్పొరేషన్‌కు బదిలీ చేయించడం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం రుణమాఫీపై మార్గదర్శకాలను రూపొందించలేదు. కటాఫ్ తేదీని నిర్ణయించలేదు. మార్గదర్శకాలు రూపొందించలేదు. బ్యాంకర్లు రైతు రుణాల వివరాలను ప్రభుత్వానికి ఇచ్చేందుకు 4 నెలల సమయం పడుతుందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చెప్పినట్టుగా ఆగస్టు 15లోపు రుణమాఫీ ఏవిధంగా సాధ్యమవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



కార్పొరేషన్ ఏర్పాటు.. అనేక సమస్యలు

రుణమాఫీ ఏ విధంగా చేస్తారనే దానిపై ఒక సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ కోసం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తామని తెలిపారు. బ్యాంకుల్లో ఉన్న రైతుల మొత్తం రుణాలను ఆ కార్పొరేషన్‌కు బదిలీ చేయించుకొని, ఆ మొత్తాన్ని నెలవారీ వాయిదాల మాదిరిగా బ్యాంకులకు చెల్లిస్తామని చెప్పారు. కార్పొరేషన్ ఏర్పాటు, దాని ద్వారా రుణమాఫీ అంత సులువుకాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కటాఫ్ తేదీ ఎప్పుడు?

మార్గదర్శకాలు రూపొందించి, కటాఫ్ తేదీని నిర్ణయించిన తరువాతనే రైతుల రుణాలు మొత్తం ఎంత ఉన్నాయనే లెక్క తేలుతుంది. గతంలో కేసీఆర్ సర్కారు తొలిసారి రుణమాఫీ చేసినప్పుడు 2014 మార్చి 30 వరకు ఉన్న రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం 35.31 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.16,144 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 11 వరకు ఉన్న రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేనాటికి 23 లక్షల మందికి సంబంధించిన రూ.13 వేల కోట్లను మాఫీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రుణమాఫీపై కటాఫ్ తేదీని నిర్ణయించకపోవడంతో అసలు మాఫీ చేయాల్సిన రుణం ఎంత? ఏ రైతులకు మాఫీ అవుతుంది? ఎవరికి కాదు? అనే అంశంపై స్పష్టత కొరవడింది.

మాఫీ చేయాల్సిన రుణం 40వేల కోట్లు!

మాఫీ చేయాల్సిన రైతుల రుణం రూ. 32 వేల కోట్ల వరకు ఉంటుందని ఒక సందర్భంలో రేవంత్‌రెడ్డి పేర్కొనగా, ఈ మొత్తం రూ.40 వేల కోట్ల వరకు ఉంటుందని వ్యవసాయశాఖవర్గాలు అంచనా వేస్తున్నాయి. కటాఫ్ తేదీ నిర్ణయించి, బ్యాంకుల నుంచి సమాచారం సేకరించిన తర్వాత కటాఫ్ తేదీ నిర్ణయిస్తే ఏ రైతుకు రుణమాఫీ వర్తిస్తుంది? అనే అంశంపై స్పష్టత వస్తుందని తెలిపాయి.

బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులు

సాధారణంగా వివిధ పథకాలకు ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, ఆ ప్రకారం అమలు చేస్తాయి. రుణమాఫీ విషయంలో ఇందుకు భిన్నంగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా రుణమాఫీ చేయాలని భావిస్తే, బడ్జెట్‌తో సంబంధం లేకుండానే నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. బ్యాంకుల రుణాలను కార్పొరేషన్‌కు బదలాయిస్తే ప్రతి నెలా కచ్చితంగా బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్‌తో సంబంధం లేకుండా నిధులు సమకూరే ఇతర మార్గాల ద్వారా కేటాయించాల్సిన అవసరం ఉంటుంది. అలా అయితేనే బ్యాంకులు ఈ ప్రతిపాదనకు ఒప్పుకుంటాయని భావిస్తున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు

- కార్పొరేషన్‌కు రుణాలను బదిలీ చేసేందుకు బ్యాంకులు అంగీకరించాలి.
- సదరు కార్పొరేషన్‌కు రెగ్యులర్‌గా వచ్చే ఆదాయ మార్గాలను బ్యాంకులకు చూపించాల్సి ఉంటుంది.
- రుణమాఫీ కోసం బడ్జెట్‌లో కేటాయించే నిధులు కాకుండా, ప్రత్యేకంగా వచ్చే ఆదాయాన్ని చూపించాల్సి ఉంటుంది.
- దీంతోపాటు బ్యాంకులకు ప్రభుత్వం నమ్మకం కల్పించాలి. బాండ్స్ రూపంలో గానీ, ఇతర మార్గాల్లో గానీ బ్యాంకులకు ప్రభుత్వం ష్యూరిటీ ఇవ్వాల్సి ఉంటుంది.
- మెజార్టీ రుణాలు మూడు నాలుగు పెద్ద బ్యాంకుల్లోనే ఉంటాయి. అంత పెద్ద మొత్తం రుణాలను ఒకేసారి మాఫీ చేసినట్టు చూపించడం బ్యాంకులకు సమస్యే.
- కార్పొరేషన్‌కు రుణాలను బదిలీ చేయాలంటే ఇందుకు బ్యాంకులు తప్పనిసరిగా రిజర్వ్‌బ్యాంకు అనుమతి తీసుకోవాలి. ఇందుకు ఆర్బీఐ అనుమతి ఇవ్వకపోతే రుణమాఫీ అంతే సంగతులు.

ఆదాయం పెంచి రుణమాఫీ చేస్తాం

పన్నులు రాబడతాం.. దుబారా తగ్గిస్తాం • పెద్దమ్మతల్లి సాక్షిగా ఆగస్టు 15లోగా..

మరోసారి సీఎం రేవంత్ ఒట్టు • రుణమాఫీకి 40 వేల కోట్లు 4నెలల్లో సమకూరేనా?

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): రూ.2 లక్షల రైతు రుణమాఫీపై తమకొక ప్రణాళిక ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదాయాన్ని పెంచుకోవడం, పన్నులు రాబట్టడం, దుబారా ఖర్చులు తగ్గించుకోవడం, ఆర్థిక క్రమశిక్షణ పాటించడం ద్వారా ఆగస్టు 15లోపు రైతుల రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టంచేశారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సాక్షిగా ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసితీరుతానని మరోసారి, మరో దేవతపై ఒట్టు పెట్టారు. మొత్తం దోపిడీ చేయకుండా ఉంటే, రుణమాఫీ చేయగలుగుతామనే నమ్మకం తనకు ఉన్నదని పేర్కొన్నారు. భూములు అమ్మకుండా రుణమాఫీ చేయాలన్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. 'వాళ్లు రుణమాఫీ చేయొద్దని కోరుకుంటున్నారా?' అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి మాటలతో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రుణమాఫీకి రూ.30-40 వేల కోట్లు అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో వెల్లడించారు. ఈ నేపథ్యంలో అంత భారీ మొత్తం ఆదాయం ఎప్పుడు పెరుగుతుంది? రుణమాఫీ ఎలా అవుతుంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రుణమాఫీ కోసం రేవంత్‌రెడ్డి నిర్దేశించిన ఆగస్టు 15 గడువుకు ఇంకా నాలుగు నెలలు మాత్రమే ఉన్నది. ఈ స్వల్ప కాలంలో రూ.40 వేల కోట్ల ఆదాయం ఎలా సమకూర్చుకుంటారనేది ప్రశ్న. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడటంపై విమర్శలొస్తున్నాయి. ఎన్నికలకు ముందు డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. మరోసారి ఒక న్యూస్ చానల్ ఇంటర్వ్యూలో నెల రోజుల్లో రుణమాఫీ పూర్తి చేస్తామని, ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి, రైతుల రుణాలను దానికి బదలాయించుకుంటామని తెలిపారు. నిన్న మొన్నటి వరకు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని చెప్తూ వచ్చారు. తాజాగా ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా రుణమాఫీ చేస్తామని చెప్తున్నారు. ఇలా పూటకో మాట చెప్తున్న నేపథ్యంలో అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

చనిపోయింది 18 మందే!

మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన జాబితాపై అధికారులను ఆయా రైతుల ఇండ్లకు పంపించి విచారణ జరిపించామని వెల్లడించారు. వాళ్లంతా వివిధ కారణాలతో చనిపోయినట్టు తేలిందని పేర్కొన్నారు. రైతు చనిపోతే ఆ కుటుంబం కచ్చితంగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకుంటుందని, ఇప్పటి వరకు 18 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

నా ఇంట్లోనూ బోరు ఎండిపోయింది!

రాష్ట్రంలో నీటి సమస్య ఉన్నదని, ప్రభుత్వం దీనిని అధిగమించి నీటి సంక్షోభం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నదని రేవంత్‌రెడ్డి తెలిపారు. 'నా ఇంట్లోనూ బోరు ఎండిపోయింది. మాకు నీళ్లు సరిపోతలేవు. భూగర్భ జలాలు పడిపోవడంతో అన్ని బోర్లు ఎండిపోయాయి. కాబట్టి నీళ్ల కొరత ఏర్పడింది' అని వివరించారు. గత సంవత్సరంతో పోల్చితే నీటి సరఫరా 140% పెరిగిందని చెప్పారు. తనకు కేసీఆర్ కరువును వారసత్వంగా ఇచ్చారని పేర్కొన్నారు. కరువు పరిస్థితులను ముందే గుర్తించి, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోజువారీగా ఎన్ని నీళ్లు అవసరమవుతున్నాయో లెక్కగట్టి జూలై నెల వరకు ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎటువంటి విద్యుత్తు కొరత లేదని స్పష్టం చేశారు. పంటలు కోతకు రావడంతో పవర్ క్రైసిస్ జీరో అని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్తు సమస్య ఏర్పడితే, అది పవర్ ఇంటరప్షన్ మాత్రమేనని, పవర్ కట్ కాదని చెప్పారు.

జిల్లాల పునర్విభజనకు జ్యుడీషియల్ కమిషన్

మళ్లీ జిల్లాల పునర్విభజనకు సంబంధించి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సీఎం



రేవంత్‌రెడ్డి స్పందిస్తూ... 'జిల్లాల పునర్విభజన చేస్తామని అసెంబ్లీలోనే చెప్పినం. ఇందు కోసం జ్యుడీషియల్ కమిషన్ వేస్తాం. ఆ కమిషన్ విచారణ జరిపి రాష్ట్రంలో ఎన్ని మండలాలు ఉండాలి? ఎన్ని రెవెన్యూ డివిజన్లు ఉండాలి? ఎన్ని జిల్లాలు ఉండాలి? అనే అంశాన్ని తేల్చుతుంది. ఒక క్రమ పద్ధతిలో మళ్లీ విభజన చేస్తాం' అని స్పష్టం చేశారు.

రిజర్వేషన్ల ఎత్తివేతకు మోదీ, షా కుట్ర

ఆరెస్సెస్ ఎజెండా ప్రకారం భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు, రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా కుట్ర చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశం ప్రమాదకర స్థితిలో ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. 1925లో ఏర్పాటైన ఆరెస్సెస్.. ఈ దేశాన్ని వందేండ్లలో పూర్తి హిందూ దేశంగా, రిజర్వేషన్లు లేని దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నదని, 2025తో ఆ గడువు ముగుస్తున్నదని తెలిపారు. అందుకే ఆరెస్సెస్ ఎజెండాను పూర్తి చేసేందుకు మోదీ, షా కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు కావాలంటూ డ్రామా ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవేళ వారు అనుకుంటున్నట్టు సీట్లు వస్తే, దేశ రాజ్యాంగాన్ని మార్చేస్తారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేస్తారని హెచ్చరించారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉండాలనుకునే వాళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలని, వద్దనుకునే వాళ్లు బీజేపీకి ఓటేయాలని సూచించారు. చదువుకున్నవారు, విజ్ఞులు, కామన్‌సెన్స్ ఉన్నచోట బీజేపీ పాచికలు పారవని, సెంటిమెంట్ ఉన్నచోట మాత్రమే బీజేపీ పాచికలు పారుతాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తులు లాగేసుకుంటుందంటూ ప్రధాని మోదీ, అమిత్‌షా చేస్తున్న ఆరోపణలపై ఆయన మండిపడ్డారు. ప్రతి ఒక్కరి ఆస్తికి రాజ్యాంగ రక్షణ ఉంటుందని, సదరు వ్యక్తి ఆమోదం లేకుండా ఒకరి ఆస్తిని మరొకరు తీసుకోవడం కుదరదని స్పష్టం చేశారు. మోదీకి ఓటమి భయం పట్టుకున్నదని, అందుకే ఇలాంటి చీప్ ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

సీపీఎం మద్దతు కోరాం: రేవంత్

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో తమ పార్టీకి మద్దతు ఇవ్వాల్సిందిగా సీపీఎం నేతలను కోరామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సీపీఎం రాష్ట్ర ముఖ్య నేతలు శనివారం సీఎంను కలువగా భువనగిరితోపాటు అన్ని స్థానాల్లో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీపీఎం నాయకులను కోరామని తెలిపారు. బీజేపీని ఓడించేందుకు, కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు సీపీఎం నాయకులు అంగీకరించారని తెలిపారు. రాష్ట్రంలో సీపీఎం సహకారంతో ముందుకెళ్తామని చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను నిలిపామని, వారిని విరమించుకోవాలని తమను సీఎం కోరినట్టు సీపీఎం నేతలు తెలిపారు. బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



సునీత కేజ్రీవాల్‌కు ఆప్ ప్రచార బాధ్యతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచార బాధ్యతలను ఆ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ తీసుకున్నారు. కేజ్రీవాల్ జైలులో ఉన్నందున ఆయన తరపున ప్రజల్లోకి వెళ్లాలని సునీత నిర్ణయించారు. శనివారం ఆమె తూర్పు ఢిల్లీ లోక్‌సభ స్థానంలో రోడ్‌షో నిర్వహించారు. ఢిల్లీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తున్న పంజాబ్, గుజరాత్, హర్యానాల్లో పార్టీ అభ్యర్థుల తరపున సునీత రోడ్‌షోలు నిర్వహిస్తారని ఢిల్లీ మంత్రి ఆతిశి తెలిపారు. మరోవైపు ఎన్నికల కోసం ఆప్ ప్రధాన కార్యాలయంలో వార్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం 'జైల్ కా జవాబ్ వోట్ సే' నినాదంతో ఆప్ కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది.

కాంగ్రెస్‌ను ముస్లింలు నమ్మడం లేదు

- మహారాష్ట్ర సీనియర్ నేత ఆరిఫ్
- రాష్ట్రంలో ముస్లింలకు ఒక్క సీటూ కేటాయించని ఎంవీఏ కూటమి



ముంబై: కాంగ్రెస్ పార్టీలో ముస్లింలకు టికెట్ల కేటాయింపులో మొండి చెయ్యి చూపడంపై అసంతృప్తి మొదలైంది. మహారాష్ట్రలోని 48 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అఘాడీ ఒక్క సీటును కూడా ముస్లింలకు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి మహమ్మద్ ఆరిఫ్ ఖాన్(నసీం) ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఘాటు లేఖ రాశారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ తమకు ఒక్క సీటైనా ఇస్తుందని ముస్లింలు నమ్మారు. ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడంతో నమ్మకం పోయింది. ముస్లింల ఓట్లు కావాలి కానీ ముస్లింలకు టికెట్లు ఇవ్వరా? అని వారు ప్రశ్నిస్తున్నారు. వారికి జవాబు చెప్పలేను. పార్టీకి ప్రచారం చేయలేను. స్టార్ క్యాంపెయినర్ పదవి నుంచి తప్పుకుంటున్నాను.' అని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ 17 సీట్లలో పోటీ చేస్తుండగా ఒక్కటీ ముస్లింలకు కేటాయించలేదు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తున్న శివసేన(యూబీటీ), ఎన్సీపీ(శరద్‌చంద్ర పవార్) ముస్లింలకు సీట్లు ఇవ్వకపోవడంతో ముస్లిం నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

రాజకీయాల్లోకి రావాలని దేశం పిలుస్తున్నది: వాద్రా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా తన రాజకీయ రంగ ప్రవేశంపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమేథీ నుంచి పోటీ చేస్తారా? అని ఓ విలేకరి శనివారం అడిగినపుడు ఆయన బదులిస్తూ, తాను క్రియాశీలక రాజకీయాల్లోకి ప్రవేశించడానికి దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో మద్దతు ఉందన్నారు. తాను ఎల్లప్పుడూ ప్రజల మధ్యలోనే ఉంటున్నానని చెప్పారు. తాను అక్కడ (అమేథీలో) 1999 నుంచి ప్రచారం చేస్తున్నానని, ఆ ప్రాంతంలో తాను ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి, అమేథీ ఎంపీ స్మృతి ఇరానీపై వాద్రా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆమె ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు.

అసలు సోనియా, ఇందిరాలకు మంగళసూత్రాలున్నాయా?

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు

బెగుసరాయ్: కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. త్యాగాలు చేయడానికి అసలు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, కాంగ్రెస్ నేత సోనియా గాంధీలకు మంగళసూత్రాలు ఉన్నాయా? అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల మంగళసూత్రాలు, బంగారాన్ని గుంజుకుపోతుందని ప్రధాని మోదీ చేసిన విమర్శలపై కాంగ్రెస్ నేత ప్రియాంక స్పందిస్తూ.. తన తండ్రి రాజీవ్ గాంధీని కోల్పోవడం ద్వారా తన తల్లి సోనియా మంగళ సూత్రాన్ని త్యాగం చేశారని, తన నానమ్మ ఇందిరా గాంధీ కూడా ప్రాణాలను అంకితం చేశారన్నారు. ప్రియాంక వ్యాఖ్యలపై గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ 'ఇటలీ నుంచి వచ్చిన సోనియాకు మంగళసూత్రం ఉంటుందో లేదో నాకే తెలియదు. అలాగే ఇందిరా గాంధీని పెళ్లాడిన ఫిరోజ్ గాంధీ పార్సీ మతస్తుడు' అని వ్యాఖ్యలు చేశారు.

యూపీలో కమలం | ఎదురీత?!

పేపర్ల లీక్ వల్ల యోగి సర్కారుపై నిరుద్యోగులు గరం

- రాజ్‌పుత్‌లదీ అదే బాట..ద్రవ్యోల్బణంపై పేదల్లో కోపం
- రెండు దశల్లోనూ బీజేపీకి వ్యతిరేకంగా ఓటింగ్!
- ఎన్నికల వేళ బీజేపీ-ఆర్‌ఎల్డీ కూటమిలో విభేదాలు
- కమలం పార్టీకి చారిత్రక పరాజయం ఖాయం: అఖిలేశ్



లక్నో, ఏప్రిల్ 27: కేంద్రంలో అధికారం పొందేందుకు కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో కమలానికి ఎదురీత తప్పేలా లేదని విశ్లేషకులు అంటున్నారు. రెండో విడత ఎన్నికల తర్వాత మొత్తం 80 సీట్లున్న యూపీలో బీజేపీ ఎదురుగాలి స్పష్టంగా కన్పించింది. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యపై యువ ఓటర్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ధరల పెరుగుదలకు కేంద్రంలోని బీజేపీనే కారణమని చాలా మంది పేదలు నమ్ముతున్నారు! మరోవైపు రైతుల ఉద్యమం తదితర కారణాల వల్ల రాజ్‌పుత్‌లలోనూ కమలనాథుల పట్ల ఆగ్రహం నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో కమలనాథులకు నిరాశ తప్పకపోవచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇటీవల జరిగిన ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్లు లీక్ కావడం రాష్ట్రంలోని యువ నిరుద్యోగులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. రాష్ట్రంలోని పేదలతో పాటు రాజ్‌పుత్ వర్గాలు కమలం పాలనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఎస్పీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయగా, ఆర్‌ఎల్డీ, బీజేపీ భాగస్వామిగా ఉన్నాయి. బీఎస్పీ ఒంటరిగానే బరిలోకి దిగింది. మొదటి విడతలో మాదిరిగానే రెండో విడత ఎన్నికల్లో సైతం రాజ్‌పుత్ వర్గాలు అధికార బీజేపీపై తమ ఆగ్రహాన్ని ప్రదర్శించినట్టు భావిస్తున్నారు. రెండో విడత ఎన్నికలో మూడు స్థానాల్లో వీరి ప్రాబల్యం గణనీయంగా ఉంది. బీజేపీపై రాజ్‌పుత్‌లు బహిరంగంగానే వ్యక్తం చేస్తున్న కోపాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఇండియా కూటమి, బీఎస్పీలు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి.

బీజేపీ కూటమికి అగ్ని పరీక్ష

ఈ ఎన్నికలు బీజేపీ-ఆర్‌ఎల్డీ కూటమికి అగ్ని పరీక్ష అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా భాగ్‌పట్, మథుర, అలీగఢ్ నియోజకవర్గాల్లో ఇరు వర్గాల మధ్య ఎలాంటి పొత్తు ఉన్న లక్షణాలు కన్పించడం లేదని వారు పేర్కొంటున్నారు. అక్కడ అవి ఎడమొహం, పెడమొహం గానే ఉన్నాయని, ఈ రెండు పార్టీల మధ్య ఇటీవల జరిగిన సమావేశాల్లో పార్టీ కార్యకర్తల మధ్య విభేదాలు ప్రస్ఫుటంగా కన్పించాయని అంటున్నారు.

'మిగతా దశల్లో బీజేపీ మరింత బలహీనం'

యూపీలో బీజేపీ చారిత్రక ఓటమిని చవిచూడబోతున్నదని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ జోస్యం చెప్పారు. రెండో విడత తర్వాత బీజేపీ ఖేల్ ఖతం అన్న విషయం స్పష్టమైందన్నారు. రెండో విడత పోలింగ్ అనంతరం ఆయన మాట్లాడుతూ శుక్రవారం జరిగిన పోలింగ్‌లో ఒక వింత ధోరణిని పరిశీలించానని తెలిపారు. ఇండియా కూటమికి అనుకూలంగా ఓటు వేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, అదే సమయంలో బీజేపీ ఓటింగ్ శాతంలో తగ్గుదల కన్పించిందని చెప్పారు. వచ్చే ఐదు దశల ఎన్నికల్లో ఆ పార్టీ మరింత బలహీన పడుతుందని చెప్పారు.

యూపీలో రాజకీయ భూకంపం: యోగేంద్ర

ఈసారి యూపీలో రాజకీయ భూకంపం సంభవించబోతున్నదని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. 15 పార్లమెంట్ స్థానాల్లోని గ్రామీణ ఓటర్లలో బీజేపీ పట్ల వ్యతిరేకత వ్యక్తమైందన్నారు.

యోగేంద్ర సర్వే అంచనాలు

- ఈసారి బీజేపీ ఇక్కడ 70 సీట్ల సంగతి మర్చిపోవచ్చు. 50 సీట్లు కూడా పార్టీకి దక్కకపోవచ్చు.
- బీజేపీ ఎంపీలు, స్థానిక నేతల పట్ల ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉంది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇక్కడ అతి పెద్ద సమస్యలు. పశువుల సమస్య ఎక్కువగా ఉంది.
- మూడోసారి బీజేపీకి అధికారం ఇస్తే నియంతృత్వం ప్రారంభమవుతుంది. అందుకే ఈసారి మార్పు కావాలనుకుంటున్నాం.
- నాలుగో వంతు మంది బీజేపీ ఓటర్లు ఈసారి ఆ పార్టీకి ఓటేయమని చెబుతున్నారు.
- ఇప్పుడు మోదీని చూసి ఓట్లేసే పరిస్థితి లేదు.



ఓటింగ్ 'మెరవాలని'..!

లోక్‌సభ ఎన్నికలపై అవగాహన పెంచడానికి, ఓటింగ్ శాతం పెంచడానికి ఎన్నికల సంఘం వినూత్న ప్రచారాన్ని చేపట్టింది. ఢిల్లీలోని ప్రఖ్యాత చారిత్రక కట్టడం 'కుతుబ్ మినార్'పై త్రివర్ణ పతాకం, పార్లమెంట్ భవనం, ఎన్నికల సంఘం లోగోతోపాటు ఎన్నికలకు సంబంధించిన అంశాలను విద్యుత్తు వెలుగుల్లో ఇలా ప్రదర్శించింది.

హెలికాప్టర్‌లో జారిపడ్డ మమత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి చిన్న ప్రమాదం జరిగింది. శనివారం ఆమె హెలికాప్టర్‌లోకి ఎక్కి కూర్చోబోతుండగా పట్టు తప్పి కింద పడ్డారు. భద్రతా సిబ్బంది ఆమెకు సహాయం చేశారు. తర్వాత ఆమె తన ప్రయాణాన్ని కొనసాగించారు. దుర్గాపూర్ నుంచి అసనోల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

మణిపూర్‌లో దుండగుల కాల్పులు

ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మృతి

ఇంఫాల్, ఏప్రిల్ 27: మణిపూర్‌లో తాజాగా మరోసారి హింస రేగింది. బిష్ణుపూర్ జిల్లాలో ఒక వర్గానికి చెందిన ఉగ్రవాదులుగా భావిస్తున్న కొంతమంది విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శనివారం అర్ధరాత్రి నరన్‌సేనలోని భద్రతా బలగాల్ని లక్ష్యంగా చేసుకొని జరిగిన ఈ కాల్పుల్లో దాడిలో ఒక ఎస్ఐ, ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్ మరణించారు. ఒక ఇన్‌స్పెక్టర్, మరో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఎత్తయిన కొండలపై నుంచి దుండగులు భద్రతా దళాల క్యాంప్‌పై రెండు గంటలపాటు కాల్పులకు తెగబడ్డారని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు చెప్పారు.

ఒక్క రూపాయైనా స్వాధీనం చేసుకున్నారా?



- ఈడీ నాతో దురుసుగా ప్రవర్తించింది
- మద్యం కేసు రిజాయిండర్‌లో కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినా, గోవా ఎన్నికలకు నిధులు ఖర్చు చేసినట్టు రుజువులు, ధ్రువీకరణ లేకపోయినా, ఒక్క రూపాయి కూడా స్వాధీనం చేసుకోకపోయినా ఈడీ తనను అరెస్ట్ చేసిందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ కేసులో ఈడీ తనతో చాలా దురుసుగా వ్యవహరించిందని శనివారం సుప్రీంకోర్టుకు తెలిపారు. తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈడీ రిప్లై అఫిడవిట్‌కు కేజ్రీవాల్ సమాధానాన్ని దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు తనను అరెస్ట్ చేయడం చూస్తే ఈడీ ఏకపక్ష ధోరణి అర్థమవుతుందన్నారు. మరోవైపు కేజ్రీవాల్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని ఎయిమ్స్ వైద్యుల మెడికల్ బోర్డు నివేదిక ఇచ్చింది.

మన సొత్తుపై | కాంగ్రెస్, బీజేపీ కన్ను!

- వారసత్వ పన్ను న్యాయమేనన్న శామ్ పిట్రోడా
- 2017లో వారసత్వ పన్ను విధింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన కమలనాథులు
- విమర్శలు రావడంతో రహస్యంగా యూటర్న్

'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, దేశ ప్రజల సొత్తును స్వాధీనం చేసుకొంటుందా?' అంటూ నిన్న మొన్నటివరకూ భయపడ్డాం. అయితే, బీజేపీ సర్కారు అధికారంలో కొనసాగినా మన సొత్తు మనకు ఉండకపోవచ్చు. ఎందుకంటారా? వారసత్వ పన్ను విధించాలని మోదీ సర్కారు ఏకంగా చట్ట సవరణలకు సిద్ధపడటమే దీనికి కారణం. అంటే.. కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. చెమటోడ్చి సంపాదించిన మన సొమ్ముకు గ్యారెంటీ లేదన్న మాట!



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశంలో వారసత్వ పన్ను ఉండాలని, మరణించిన వారి ఆస్తుల్లో 55% వాటాను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత, గాంధీల కుటుంబానికి సన్నిహితుడు శామ్ పిట్రోడా ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. వారసత్వ పన్ను తనకు న్యాయంగానే కనిపిస్తున్నదన్న ఆయన.. అమెరికాలో ఉన్నట్టే భారత్‌లోనూ ఈ విధానాన్ని తీసుకురావాలన్నారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, కష్టపడి సంపాదించిన సొమ్మంతా ఎక్కడ ఎత్తుకుపోతారోనని సామాన్యులు భయపడ్డారు. ఇక, పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధానమంత్రి మోదీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'వారసత్వ పన్ను'ను ఇప్పుడు వ్యతిరేకిస్తున్న ప్రధాని మోదీ.. 2017లో గుట్టుచప్పుడు కాకుండా ఈ పన్నును యావత్తు దేశ ప్రజలపై రుద్దాలనుకొన్నారు. ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు.

చట్టంలో సవరణకు ప్రయత్నాలు..

మరణించిన వ్యక్తి నుంచి వారసత్వంగా వచ్చిన సొమ్ముపై విధించే పన్నును వారసత్వ పన్ను లేదా ఎస్టేట్ పన్నుగా పిలుస్తారు. గతంలో భారత్‌లోనూ ఈ విధానం ఉండేది. అయితే, ఈ పన్ను ద్వారా ఆర్థిక అసమానతల్లో తగ్గుదల ఏమీ లేదని గ్రహించిన అప్పటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం1985లో రద్దు చేసింది. అమెరికా, యూకేల్లో వారసత్వ పన్ను కొనసాగుతున్నట్టే, భారత్‌లోనూ ఈ తరహా పన్నును విధిస్తే బాగుంటుందని 2017లో మోదీ ప్రభుత్వం యోచించింది. రూ.50 వేల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు, సొమ్ము వారసత్వంగా సంక్రమించినట్లైతే, ఆ సొత్తును 'ఇతర మార్గాల ద్వారా లభించిన ఆదాయం' కింద పరిగణించాలని భావించింది. దీనిపై వారసత్వ పన్ను విధించాలని అప్పటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించారు. ఈ మేరకు చట్టంలో సవరణలు, ఇతరత్రా మార్గదర్శకాల కోసం మోదీ ప్రభుత్వం విధివిధానాలను కూడా రూపొందించింది. అయితే, సైరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ వంటి న్యాయసలహా సంస్థలు, జితేంద్ర సోలంకీ వంటి ఆర్థిక నిపుణులు, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టిషనర్స్, హక్కుల కార్యకర్తలు, మేధావులు బీజేపీ సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. 'వారసత్వ పన్ను' ఆలోచనను విరమించుకోవాలని, లేకపోతే దేశవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో మోదీ సర్కారు ఆ యోచనను విరమించుకొన్నది. కాగా తమ పార్టీ ప్రభుత్వం రద్దు చేసిన 'వారసత్వ పన్ను'ను తీసుకొస్తామంటూ కాంగ్రెస్ ఇప్పుడు చెప్పడం చిత్రమైన విషయం. 'వారసత్వ పన్ను'ను గతంలో రహస్యంగా తీసుకురావాలని యోచించి ఆ తర్వాత భంగపడ్డ బీజేపీ.. ఇప్పుడు అదే అంశంపై అంతెత్తున ఎగురుతుండటం ఇంకా విచిత్రమనే విమర్శలు పెద్దయెత్తున వస్తున్నాయి.

వర్షాలు పడితేనే ధరల్లో తగ్గుదల!

న్యూఢిల్లీ: వర్షాలు పడితేనే ధరలు తగ్గుతాయని కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేసింది. నెలవారీ సమీక్షలో భాగంగా నిత్యావసర వస్తువుల ధరలను ఆ శాఖ పరిశీలించింది. ఈసారి వర్షాకాలంలో వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పిందన్నారు. ఫిబ్రవరిలో రిటెయిల్ ద్రవ్యోల్బణం 8.7 శాతం కాగా, మార్చిలో ఇది 8.5 శాతానికి తగ్గిందని చెప్పింది. మరోవైపు పప్పు ధాన్యాల ధరలను నియంత్రించేందుకు బ్రెజిల్ నుంచి 20 వేల టన్నుల పెసరపప్పు, అర్జెంటినా నుంచి కందులు దిగుమతి చేసుకొనేందుకు కేంద్రం జరుపుతున్న చర్చలు తుది దశకు వచ్చాయి. మొజాంబిక్, టాంజానియా, మయన్మార్‌ల నుంచి పప్పుల దిగుమతికి కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది.

ముంబైలో బీజేపీ అభ్యర్థి మార్పు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నార్త్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థిని బీజేపీ శనివారం మార్చింది. సిటింగ్ ఎంపీ పూనమ్ మహాజన్‌ను మొదట ఈ స్థానం నుంచి నిలిపినప్పటికీ, ఆమెకు బదులుగా ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌కు టికెట్ ఇచ్చింది. పూనమ్ 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు.



ఫ్రాంక్ టైసన్‌ను కింద పడేసి మోకాలితో తొక్కుతున్న పోలీసులు

కింద పడేసి.. మోకాలితో తొక్కి

అమెరికాలో మరో నల్లజాతీయుడిపై దాష్టీకం

అపస్మారక స్థితిలోకి వెళ్లి బాధితుడి మృతి

వాషింగ్టన్, ఏప్రిల్ 27: అమెరికాలో పోలీసులు మరోసారి దాష్టీకానికి పాల్పడ్డారు. 2020లో చోటుచేసుకొన్న 'జార్జి ఫ్లాయిడ్' తరహాలోనే తాజాగా మరో దురాగతానికి ఒడిగట్టారు. ఫ్రాంక్ టైసన్(53) అనే ఓ నల్లజాతీయుడిని కింద పడేసి.. మెడపై మోకాలితో గట్టిగా నొక్కిపెట్టి, ఊపిరాడకుండా చేసి అతని ప్రాణాలు తీశారు. 'నాకు ఊపిరి ఆడటం లేదు' అని బాధితుడు మొత్తుకున్నా పోలీసులు వదిలిపెట్టకుండా కర్కశంగా వ్యవహరించారు. ఓహియో రాష్ట్రంలోని కాంటన్ నగరంలో వారం రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ప్రపంచాన్ని మరోసారి దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన బాడీ కెమెరా ఫుటేజ్‌ను కాంటన్ పోలీసు విభాగం గురువారం విడుదల చేసింది. టైసన్ పట్ల దారుణంగా వ్యవహరించిన పోలీసు అధికారులను బ్యూ స్కోనెగ్జ్, కామ్డెన్ బుర్చ్‌గా గుర్తించారు.

చేతులకు సంకెళ్లు వేసి కర్కశం

ఈ నెల 18న ఓ కారు ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టిన ఘటన జరిగింది. ఆ సమయంలో కారులో ఉన్న టైసన్‌ను సమీపంలోని ఓ బార్‌లోకి వెళ్లినట్టు పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు అనుమానించి అక్కడికి వెళ్లారు. వీడియో ఫుటేజ్ ప్రకారం టైసన్‌ను పట్టుకొన్న పోలీసులు అతని చేతులకు సంకెళ్లు వేసి, కింద పడేశారు. పోలీసు అధికారుల్లో ఒకరు టైసన్ మెడ సమీపంలోని వెనుక భాగంలో మోకాలు వేసి గట్టిగా నొక్కి పెట్టి 'ఇప్పుడు బాగుందా!' అంటూ వికృత ఆనందం పొందారు. ఆ తర్వాత కొంత సేపటికి టైసన్ చలనం లేకుండా పడిపోయాడు. దీంతో దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మరణించాడు.

గతంలో కూడా ఇదేవిధంగా..

2020లో కూడా ఇదే విధంగా పోలీసుల కర్కశత్వానికి జార్జిఫ్లాయిడ్ బలైన విషయం తెలిసిందే. ఆఫ్రో అమెరికన్ అయిన జార్జి ఫ్లాయిడ్ మెడపై డెరెక్ చౌవిన్ అనే పోలీసు అధికారి దాదాపు తొమ్మిది నిమిషాలకు పైగా మోకాలుతో తొక్కి పెట్టాడు. దీంతో అతను ఊపిరాడక మృతిచెందాడు.



'పనిలో థ్రిల్ తప్ప అన్నీ మారాయి'

శాన్ ఫ్రాన్సిస్కో: గూగుల్‌లో అన్నీ మారాయని, పని చేయడంలో లభించే థ్రిల్(పులకరింత) మాత్రం మారలేదని ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. గూగుల్‌లో తాను ఉద్యోగంలో చేరి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో తన సంతోషాన్ని ఆయన పంచుకున్నారు. ''నేను 2004 ఏప్రిల్ 26న గూగుల్‌లో అడుగు పెట్టాను. అప్పటి నుంచి చాలా మార్పులు వచ్చాయి. సాంకేతికత, మా ఉత్పత్తులను ఉపయోగించేవారి సంఖ్య వంటివెన్నో మారాయి. కానీ మారనిది – ఈ అద్భుతమైన కంపెనీలో పని చేయడం ద్వారా నేను పొందే థ్రిల్. 20 ఏళ్లు గడిచాయి. నేను ఇప్పటికీ అదృష్టవంతుడిగానే భావిస్తున్నాను'' అని తెలిపారు. కొద్ది గంటల్లోనే ఆయన పోస్టుకు 1,32,400 లైక్‌లు వచ్చాయి.

అమెరికాలో రోడ్డు ప్రమాదం ముగ్గురు భారతీయుల మృతి

న్యూయార్క్: అమెరికాలోని సౌత్ కరోలినాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నలుగురు భారతీయులు ప్రయాణిస్తున్న కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాకు చెందిన రేఖాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మనీశాబెన్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు కాగా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. గ్రీన్‌విల్లే కౌంటీలోని ఓ హైవేపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు పరిమితికి మించిన వేగంతో కారు ప్రయాణిస్తున్నదని పోలీసులు భావిస్తున్నారు. కారు అదుపు తప్పి 20 అడుగుల ఎత్తుకు ఎగిరిందని, రోడ్డు పక్క చెట్లపై ఇరుక్కుందని పోలీసులు తెలిపారు.

చర్మ క్యాన్సర్‌కు టీకా!

- మెలనోమా మళ్లీ ఉత్పన్నం కాకుండా అడ్డుకునేలా అభివృద్ధి
- రెండో దశ క్లినికల్ ట్రయల్స్‌లో మెరుగైన ఫలితాలు
- త్వరలో మూడో దశ



లండన్, ఏప్రిల్ 27: చర్మ క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక ముందడుగు పడింది. మెలనోమా(ఒక రకమైన చర్మ క్యాన్సర్) తిరగబడకుండా నిరోధించే టీకా త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మోడెర్నా, ఎంఎస్‌డీ అనే ఫార్మా కంపెనీలు ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశాయి. పలు కొవిడ్ వ్యాక్సిన్‌లలో ఉపయోగించిన ఎంఆర్‌ఎన్‌ఏ ఆధారిత టెక్నాలజీతో ఈ వ్యాక్సిన్‌ను తయారు చేశారు. దీనిని ఎంఆర్‌ఎన్‌ఏ-4157(వీ940)గా పిలుస్తున్నారు. ఇప్పటికే ఈ వ్యాక్సిన్‌కు సంబంధించిన రెండో దశ ట్రయల్స్ విజయవంతమయ్యాయి. మెలనోమా బాధితుల్లో మళ్లీ క్యాన్సర్ తిరగబడే ముప్పును సగం వరకు తగ్గించిందని తేలింది. ఇప్పుడు యూనివర్సిటీ కాలేజ్ లండన్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు మూడో దశ క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 1,100 మందిపై క్లినికల్ ట్రయల్స్ జరగనున్నాయి.

తొమ్మిది డోసుల వ్యాక్సిన్

ఈ వ్యాక్సిన్‌ను మూడు వారాలకు ఒక డోస్ చొప్పున తొమ్మిది డోసులు ఇస్తారు. వ్యాక్సిన్‌తో పాటు కీత్రుడా అనే మరో ఔషధాన్ని ఇస్తారు. మెలనోమా బారిన పడ్డ వారికి సర్జరీ చేసి తొలగించిన కణతుల నుంచి నమూనాను సేకరించి, ఏఐ ద్వారా డీఎన్‌ఏ సీక్వెన్సింగ్ చేసి ఆ రోగి అవసరానికి తగ్గట్టుగా వ్యాక్సిన్‌ను తయారుచేస్తారు. తద్వారా ఈ వ్యాక్సిన్ శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను క్యాన్సర్ కణాలను వెంటనే గుర్తించి, వాటిని నాశనం చేసేలా సిద్ధం చేస్తుందని, మెలనోమా మళ్లీ తిరగబడకుండా చూస్తుందని యూసీఎల్‌హెచ్ ఆంకాలజిస్ట్ హెథర్ షా తెలిపారు.

పీవోకేలో చైనా దురాగతం

సియాచిన్ సమీపంలో రోడ్డు నిర్మాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: డ్రాగన్ దేశం చైనా కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లోని షాక్స్‌గామ్ లోయ ప్రాంతంలో యథేచ్ఛగా రోడ్డు నిర్మాణాలు చేపట్టింది. దీనికి సంబంధించి యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ శాటిలైట్ చిత్రాలు తాజాగా వెలుగులోకి రావడంతో చైనా దురాగతం బయటపడింది. భారత్‌కు అత్యంత కీలకమైన సియాచిన్ గ్లేసియర్‌కు సమీపంలో చైనా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం గమనార్హం. 2022, జూలై-2023, ఆగస్టు మధ్య ఈ రోడ్డు నిర్మాణం జరిగినట్టు శాటిలైట్ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. ఇది భారత్‌కు భద్రతాపరమైన సవాళ్లు విసిరే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు నిర్మాణం భారత సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు. షాక్స్‌గామ్‌లో నిర్మించిన ఈ రోడ్డును బల్టిస్థాన్ నుంచి తవ్వుకొన్న యురేనియం వంటి ఖనిజాల తరలింపునకు ఉద్దేశించిందని లెఫ్టినెంట్ జనరల్ శర్మ వంటి నిపుణులు పేర్కొన్నారు. అదే విధంగా భారత్‌కు వ్యతిరేకంగా పాక్, చైనా సైన్యాలు సైనిక కుయుక్తులు పన్నేందుకు ఉన్న అవకాశాలపై నిరంతరం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ద్వైపాక్షిక సరిహద్దు ఒప్పందంలో భాగంగా పాకిస్థాన్ పీవోకే భాగంగా ఉన్న ఈ షాక్స్‌గాయ్ లోయను పాకిస్థాన్ 1963లో చైనాకు ధారాదత్తం చేసింది. అయితే ఈ అప్పగింతను భారత్ గుర్తించలేదు.

హైదరాబాద్ వాసికి 16 ఏండ్ల జైలు

లండన్, ఏప్రిల్ 27: మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను కత్తితో దారుణంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన 23 ఏండ్ల హైదరాబాద్ వాసి శ్రీరామ్ అంబాలాకు లండన్ న్యాయస్థానం 16 ఏండ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పింది. లండన్‌లోని హైదరాబాద్ వాలా రెస్టారెంట్‌లో పనిచేస్తున్న కేరళకు చెందిన 23 ఏండ్ల సోనా అనే మాజీ గర్ల్‌ఫ్రెండ్‌ను 2022, మే 5న నిందితుడు అందరూ చూస్తుండగా దాడి చేసి కత్తితో 9 పోట్లు పొడిచాడు.

డిజిటలైజేషన్ దిశగా జిల్లా కోర్టులు

- తెలంగాణలో 8,500 పెండింగ్ కేసుల పరిష్కారం
- చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే
- న్యాయవాదులు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్
- టెక్నాలజీతో సత్వర సేవలకు అవకాశం
- హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి
- నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో నూతన టెక్నాలజీతో నిర్మించిన ఐదు కోర్టు భవనాల ప్రారంభం



నల్లగొండలో కోర్టు భవనాల సముదాయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో హైకోర్టు న్యాయమూర్తులు వినోద్‌కుమార్, లక్ష్మణ్, విజయసేన్‌రెడ్డి, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నాగరాజు తదితరులు

రామగిరి, ఏప్రిల్ 27 : రాష్ట్రంలోని అన్ని జిల్లా కోర్టులను డిజిటలైజేషన్ చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్టు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తెలిపారు. వంద శాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తున్నదని అన్నారు. ఆ దిశగా కోర్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ టెక్నాలజీని అందిస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలో 8,500 పెండింగ్ కేసులు పరిష్కారమైనట్టు వెల్లడించారు. జిల్లాల్లోనూ వంద శాతం కేసులు పరిష్కారం అవుతున్నట్టు చెప్పారు. నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలో ఆధునిక టెక్నాలజీతో నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టీ వినోద్‌కుమార్, జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం నాగరాజుతో కలిసి శనివారం సీజే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హైకోర్టు సీజే జస్టిస్ అరాధే మాట్లాడుతూ.. నల్లగొండలో నూతనంగా నిర్మించిన ఐదు కోర్టుల ఆధునిక భవనంలో డిజిటలైజేషన్‌తోపాటు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. ముఖ్యంగా లైబ్రరీ, రిక్రియేషన్ వంటి సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. జిల్లా కోర్టులో అత్యధిక కేసులు పరిష్కారం అవుతున్నాయని, ఆ దిశగా బార్ అండ్ బెంచ్ సహకారం ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయాధికారులు, న్యాయవాదులు ఎప్పటికప్పుడు సామర్థ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఆ దిశగా సుప్రీం కోర్టు సైతం న్యాయమూర్తులు, న్యాయవాదుల సామర్థ్యాల పెంపుదల అవసరమని ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతోనే వాటిని సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. ఇకపై నల్లగొండ జిల్లా కోర్టులో కేసులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే అవకాశం ఉన్నదని తెలిపారు.

రాష్ట్రంలో రెండో డిజిటల్ కోర్టు బిల్డింగ్ నల్లగొండ

ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా సకల మౌలిక సదుపాయాలతో నల్లగొండలో నిర్మించిన ఐదు కోర్టుల భవన సముదాయం తెలంగాణలో రెండోదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్ తెలిపారు. డిజిటల్ టెక్నాలజీతో ఉత్తమమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఇలాంటి వనరులు కల్పించడంతోనే న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించి వంద శాతం కేసుల పరిష్కారం దిశగా న్యాయ వ్యవస్థ పనిచేస్తున్నదని చెప్పారు. నైపుణ్యాల పెంపునకు కోర్టు ఆవరణలో అందుబాటులోకి తెచ్చిన లైబ్రరీలను న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు నిత్యం కొత్త విషయాలు తెలుసుకోవడానికి చట్టాల్లో వచ్చే మార్పులను గమనించి వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. న్యాయవాదులు చురుకుగా ఉంటే పేదలకు సత్వర న్యాయం అందడంతోపాటు ప్రజల్లో న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీతో అందుబాటులోకి వచ్చిన నల్లగొండ కోర్టు సముదాయంతో పేద, అణగారిన వర్గాల వారికి సత్వర న్యాయం అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. జూనియర్ న్యాయవాదులు సీనియర్ల సలహాలు తీసుకోవాలని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ మాట్లాడుతూ.. నల్లగొండ కోర్టులో నూతన భవనాల నిర్మాణానికి 2008-09లో ప్రతిపాదనలు రూపొందించగా, 2011లో నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని, ఇప్పుడు ప్రారంభోత్సవం జరగడంతో తన కల నెరవేరిందని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకట్‌రెడ్డి, వివిధ కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లేడీ జర్నలిస్ట్‌కు సీఎం సాక్షిగా అవమానం

- పాత్రికేయురాలు బర్ఖాదత్ పట్ల అనుచిత ప్రవర్తన
- గాంధీభవన్‌లో ఆమె నడుం పట్టుకొని తోసివేత
- సీఎం సెక్యూరిటీ నిర్వాకంపై జర్నలిస్ట్ మండిపాటు
- ముఖ్యమంత్రి కండ్లెదుటనే ఇంత దారుణమా?
- అధికారం వస్తే కొద్ది నెలల్లోనే ఇంత మార్పా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై లేడీ టీవీ జర్నలిస్ట్ ఫైర్



హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) : దాదాపు 30 ఏండ్లకు పైగా పాత్రికేయ వృత్తిలో ఉన్న ప్రముఖ టీవీ జర్నలిస్ట్, యుద్ధక్షేత్రాలకు కూడా వెళ్లి వార్తలను సేకరించిన ధీశాలి, జాతీయ మీడియా ప్రతినిధి, పద్మశ్రీ అవార్డు గ్రహీత బర్ఖాదత్‌కు సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎదుటే అవమానం జరిగింది. గాంధీభవన్‌లో శనివారం ఉదయం ఎదురైన ఈ అనుభవంపై ఆమె స్వయంగా తన 'ఎక్స్' ఖాతాలో ఆవేదన వ్యక్తం చేశారు. తాను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన సెక్యూరిటీ సిబ్బంది తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని, నడుం పట్టుకొని అసభ్యకరంగా తోసివేశారని మండిపడ్డారు. బహిరంగంగా జరిగే కార్యక్రమాల్లో ప్రముఖ వ్యక్తులతో మాట్లాడే హక్కు పాత్రికేయులకు ఉంటుందని పేర్కొన్నారు. తమ కెమెరా ఇతర పరికరాలు కిందపడిపోయాయని, ఇదంతా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుండగానే జరిగిందని వెల్లడించారు. 'కొన్ని నెలల క్రితం వచ్చిన అధికారం తెచ్చిన మార్పా' అంటూ ఎక్స్ ఖాతాలో ప్రశ్నిస్తూ పోస్ట్ పెట్టగా పలువురు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఇది అత్యంత దురదృష్టకరమైన ఘటన అని, ఒక మహిళా జర్నలిస్టును ఈ విధంగా అవమానించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల తరువాత ఉపాధి కల్పిస్తాం

- నేతన్నలకు అండగా ఉంటాం: మంత్రి పొన్నం, దీపాదాస్ మున్షీ
- సిరిసిల్ల నేతన్నకు దక్కని భరోసా



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న దీపాదాస్ మున్షీ

కరీంనగర్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/సిరిసిల్ల రూరల్: 'మళ్లీ ఉరికొయ్యకు నేతన్న' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో సిరిసిల్లకు కాంగ్రెస్ నేతలు తరలివచ్చారు. కానీ, ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలను ఆదుకునే విషయంలోగానీ, నేతన్నలు కష్టాలు తీర్చే విషయంలో కానీ స్పష్టమైన ప్రకటన చేయకపోవడం నిరాశ పరిచింది. నేత కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, ఎన్నికల తరువాత నేత కార్మికులకు ప్రత్యేక పాలసీలను రూపొందించి అమలుచేస్తామని చెప్పి చేతులు దులుపుకున్నారు. అంతకు మించి మరే సహాయమూ ప్రకటించలేదు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్‌చౌదరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు శనివారం సిరిసిల్లకు వచ్చి ఆత్మహత్యలు చేసుకున్న కార్మికుల కుటుంబాలను పరామర్శించారు. తంగళ్లపల్లిలోని అంకారపు మల్లేశం, సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన అడిశెర్ల సాయి కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ పరిస్థితులు, ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. నేతలు ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. వస్త్ర ఉత్పత్తి పెంచి అందరికీ ఉపాధి కల్పిస్తామని, సిరిసిల్లలో తయారైన వస్త్రాలకు మార్కెటింగ్ చేయడానికి అవసరమైతే హైదరాబాద్‌లో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. నేతన్నలకు గతం కంటే అదనంగా ఆర్డర్లు ఇచ్చేలా తమ పాలసీ ఉంటుందని, ఎన్నికల కోడ్ కారణంగా అది ఆగిందని పేర్కొన్నారు. చేనేత మీద కేంద్ర ప్రభుత్వం 12% జీఎస్టీ విధిస్తే పార్లమెంటు సభ్యుడిగా బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. సిరిసిల్లలో నేతకార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం దురదృష్టకరమని, వారికి అండగా ఉంటామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని, దీంతో నాలుగు నెలలుగా పవర్‌లూం బంద్ అయిందని చెప్పారు. కార్మికుల ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఇది రాజకీయాలు చేయాల్సిన సమయం కాదని, తాము కూడా రాజకీయాలు చేయడానికి రాలేదని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్ నేత కార్మికులకు ప్రత్యేక పాలసీలను రూపొందిస్తుందని, ఎన్నికల తర్వాత వీటిని అమలు చేసి, కార్మికులకు ఆదుకుంటామని చెప్పారు.

కోడ్‌కు ముందే సంక్షోభం

నిజానికి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గురైంది. సమస్య పరిష్కారం కోసం ఎన్నికల కోడ్ రాకముందే సిరిసిల్ల నేతన్నలు కదంతొక్కారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే తమకు ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేయడంతోపాటు సమ్మెకు కూడా పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ రాకముందే ఒకరిద్దరు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను వివరిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అప్పుడే సమస్య తీవ్రతను గుర్తించి, ఆర్డర్లు ఇచ్చి న్యాయం చేసి ఉంటే, మరికొంత మంది ఆత్మహత్య చేసుకునే పరిస్థితి తలెత్తేది కాదు. ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంభించడంపై నేతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పాతబకాయిలను వెంటనే చెల్లించడంతోపాటు కొత్త ఆర్డర్లు ఇచ్చి సాంచాలు నడిచేలా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బీఆఆర్ఎస్ ప్రభుత్వం ఏటా రూ.350 కోట్ల వరకు వర్క్ ఆర్డర్లు ఇస్తే, కాంగ్రెస్ రూ.50 కోట్ల ఆర్డర్లు మాత్రమే ఇచ్చిందని, దీంతో పనుల్లేక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

కొండ ప్రాంతాల్లోని చిన్నారుల్లో ఎదుగుదల లోపం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27: భారత్‌లోని కొండ ప్రాంతాల్లో జీవిస్తున్న చిన్నారుల్లో ఎదుగుదల లోపం ఉంటున్నట్టు ఒక అధ్యయనంలో వెల్లడైంది. నివసిస్తున్న ప్రాంతం ఎత్తు ఎంత ఎక్కువైతే వీరిలో ఈ ముప్పు అంతే ఎక్కువ ఉంటున్నట్టు తేలింది. ఐదేండ్ల లోపు వయసున్న 1.65 లక్షల మంది బాలల డాటాపై పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇందులో 2015 – 16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే డాటా కూడా ఉంది. ఈ వివరాలు బ్రిటిష్ మెడికల్ జర్నల్ న్యూట్రిషన్, ప్రివెన్షన్ అండ్ హెల్త్‌లో ప్రచురితమయ్యాయి. కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ఐదేండ్ల లోపు పిల్లల్లో ఎదుగుల లోపం 36 శాతం అధికంగా ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఏడాదిన్నర లోపు వయసున్న వారిలో ఈ ముప్పు 27 శాతం, ఏడాదిన్నర నుంచి ఐదేండ్ల వయసున్న పిల్లల్లో 41 శాతం ఉన్నట్టు తేల్చారు. సముద్ర మట్టానికి వెయ్యి అడుగుల ఎత్తు లోపల నివసిస్తున్న వారితో పోలిస్తే 2 వేల అడుగులు, అంతకంటే ఎక్కువ ఎత్తులో నివసిస్తున్న వారిలో 40 శాతం ముప్పు ఎక్కువ ఉంటున్నట్టు గుర్తించారు. ఎత్తైన ప్రాంతాల్లో నివసించడం వల్ల ఆకలి తక్కువగా ఉండటం, ఆక్సిజన్, పోషకాల శోషణ తక్కువగా ఉండటం, సరైన ఆహారం లభించకపోవడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి ఉంటుందని పరిశోధకులు చెప్తున్నారు.

వేసవిలో 40 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల కోసం 40 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి జూలై 2 వరకు షెడ్యూల్ వారీగా బిలాస్‌పూర్-యశ్వంత్‌పూర్, తిరుపతి-శ్రీకాకుళం రోడ్, కొచ్చువెలి-భరణి రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వెల్లడించారు.

మాజీ ఏఈకి ఏడాది జైలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఓ రోడ్డు కాంట్రాక్టర్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఇంజినీర్ సోమ రాఘవేందర్‌కు ఏసీబీ కోర్టు ఏడాదిపాటు జైలుశిక్ష విధించడాన్ని హైకోర్టు సమర్థించింది. ఏసీబీ కోర్టు తీర్పును సవాలు చేస్తూ ఆయన చేసుకున్న అప్పీల్‌ను కొట్టివేసింది.

88 ఏండ్ల నాటి భూవివాదానికి తెర


- నవాబ్ ఫక్రుల్ ముల్క్ ఆస్తుల పంపిణీపై 101 పేజీల చారిత్రక తీర్పు ఇచ్చిన హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించక పూర్వం నుంచి పెండింగ్‌లో ఉన్న ఓ భూవివాదానికి 73 ఏండ్ల తర్వాత హైకోర్టు తెరదించింది. ఏడో నిజాం హయాంలో జాగీర్ భూమి రక్షణ కమిటీ ఏర్పాటు, ఆస్తుల పంపిణీపై 1936 నుంచి కొనసాగుతున్న ఈ కేసుకు సుదీర్ఘ వాద, ప్రతివాదనల అనంతరం ఇటీవల ముగింపు పలికింది. నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసుల మధ్య ఏర్పడిన సివిల్ సూట్ (సీఎస్ 9/1/1951)ను పరిష్కరిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఈ నెల 23న 101 పేజీల చారిత్రక తీర్పును వెలువరించింది. తొలినాళ్లల్లో కేవలం ఇద్దరు కక్షిదారులు, 26 మంది ప్రతివాదులకు పరిమితమైన ఈ కేసులో కాలక్రమేణా రెండు తరాలవారు మరణించడంతో కక్షిదారుల వారసులు పెద్ద సంఖ్యలో పెరిగారు. ప్రతివాదులు ఏకంగా 94 మందికి చేరారు.

వివరాల్లోకి వెళ్తే.. నవాబ్ ఫక్రుల్ ముల్క్ 1936లో మృతి చెందడంతో ఆయన జాగీర్ భూముల రక్షణ కోసం ఏడో నిజాం ఓ కమిటీని వేశారు. నిజాం సంస్థానం భారత్‌లో విలీనమయ్యాక కూడా ఆ కమిటీ కొనసాగించింది. ఎర్రమంజిల్ ప్యాలెస్, అక్కడి 21 ఎకరాలు (నాటి విలువ రూ.10.20 లక్షలు), ఎర్రమంజిల్ వద్ద ఉన్న 75.27 ఎకరాలు (రూ.7.50 లక్షలు), ఎర్రగడ్డలోని ఎర్రం నుమా బంగ్లా (రూ.3.72 లక్షలు), బొల్లారంలోని బంగ్లా, మరో 14 ఎకరాలు (రూ.1.09 లక్షలు), యూసఫ్‌గూడ, మూసాపేటలోని భూములు, మరో 3 ఆస్తులు కలిపి మొత్తం తొమ్మిది ఆస్తులను ఐదు భాగాలుగా విభజించి నవాబ్ ఘాజీ జంగ్ బహదూర్, నవాబ్ ఫకర్ జంగ్ బహదూర్, నవాబ్ రాయ్‌శ్యార్ జంగ్ బహదూర్, నవాబ్ రాయిస్ జంగ్ బహదూర్, నవాబ్ షానవాజ్ జంగ్ బహదూర్‌కు పంపిణీ చేయాలని గతంలో డిక్రీ వచ్చింది. ఇది 1951లో హైకోర్టుకు చేరాక వాద, ప్రతివాదుల్లో పలువురు మరణించడంతో వారి వారసులు 73 ఏండ్ల నుంచి న్యాయపోరాటం చేస్తూ వచ్చారు. దీంతో హైకోర్టు రెండేండ్ల క్రితం రిటైర్డు జిల్లా జడ్జి మహమ్మద్ నిజాముద్దీన్‌ను రిసీవర్ కమ్ కమిషనర్‌గా నియమించింది. ఆయన నివేదికపై అభ్యంతరాలను స్వీకరించి, విచారణ తర్వాత వాటిని తిరస్కరించింది. ఈ కేసులో పేర్కొన్న భూములన్నింటినీ ప్రభుత్వం వివిధ అవసరాల కోసం వినియోగంలోకి తెచ్చిందని గుర్తు చేసింది. అమీర్‌పేటలోని శ్మశాన భూమి మాత్రమే యథాతథంగా ఉన్నదని రిసీవర్ తన నివేదికలో పేర్కొన్నారు. దాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఆస్తిగా పరిగణించినందున ఆ ఆస్తిని పంచుకునే హక్కు పిటిషనర్లకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఓ కమిటీని ఏర్పాటు చేసి ఆ శ్మశాన భూమి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ముల్క్ వారసులకు సూచించింది. ఇతర భూముల విక్రయానికి సంబంధించిన రూ.1,18,81,249 నగదును ముల్క్ వారసులు వడ్డీతో సహా పొందవచ్చని తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం హైకోర్టు వద్ద ఉన్న ఆ మొత్తాన్ని జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్

గిఫ్ట్ డీడ్ కోసం 10 వేలు లంచం



కరీంనగర్ జిల్లా గంగాధరలో ఏసీబీకి పట్టుబడిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సురేశ్‌బాబు

గంగాధర, ఏప్రిల్ 27 : భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.10 వేలు లంచం తీసుకుంటూ శనివారం కరీంనగర్ జిల్లా గంగాధర ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకంపేటకు చెందిన కొక్కుల అజయ్‌కుమార్ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తి శివారులో 486.42 చదరపు గజాల భూమిని తన తండ్రి కొక్కుల రాజేశం నుంచి గిఫ్ట్ డీడ్ చేయించుకోవడానికి రెండు రోజుల క్రితం గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. గంగాధరకు చెందిన తన మిత్రుడు ఆకుల అంజయ్య ద్వారా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ శివారం సురేశ్‌బాబును సంప్రదించారు. గిఫ్ట్ డీడ్ చేయడానికి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రూ.10 వేల లంచం డిమాండ్ చేయగా ఆకుల అంజయ్య ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం రిజిస్ట్రేషన్ అనంతరం సురేశ్‌బాబు సూచనల మేరకు రూ.10 వేలను కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కొత్తకొండ శ్రీధర్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ సురేశ్‌బాబు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్‌పై కేసు నమోదు చేసి, వారిని ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

తన్నుకున్న ఇసుక స్మగ్లర్లు: ఒకరికి గాయాలు

శక్కర్‌నగర్, ఏప్రిల్ 27: నిజామాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం ఘర్షణకు దారి తీసింది. స్మగ్లర్ల పరస్పర దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ పట్టణ శివారులో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నది. మంజీర నది నుంచి అర్ధరాత్రి సమయంలో జోరుగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బోధన్‌కు చెందిన యూసుఫ్ టిప్పర్‌లో శుక్రవారం రాత్రి ఇసుక తీసుకొస్తున్నాడు. బీటీనగర్‌కు చెందిన మరో ఇసుక స్మగ్లర్ అర్బాజ్‌ఖాన్ అలియాస్ లడ్డు నాగన్‌పల్లి దాబా వద్ద టిప్పర్‌ను అడ్డుకున్నాడు. అర్బాజ్‌ఖాన్.. యూసుఫ్‌పై దాడిచేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్వల్పంగా గాయపడిన యూసుఫ్ తన మిత్రుడు ఇర్ఫాన్, మరికొంత మందితో కలిసి బీటీనగర్‌లోని అర్బాజ్‌ఖాన్ ఇంటికి వెళ్లి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అర్బాజ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

ఇంటర్ పరీక్షల షెడ్యూల్లో మార్పులు

మే 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్లో స్వల్పమార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన షెడ్యూల్‌ను ఇంటర్‌బోర్డు సవరించింది. మొదట మే 24 నుంచి జూన్ 1 వరకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించగా, తాజాగా మే 24నుంచి జూన్ 3వరకు నిర్వహిస్తామని ఇంటర్‌బోర్డు ప్రకటించింది. పూర్తి షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5:30వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జూన్ 4నుంచి 8వరకు నిర్వహిస్తారు. ఫస్టియర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్ ఎగ్జామ్ జూన్ 10న ఉదయం 9గంటలకు నిర్వహిస్తారు. జూన్ 11న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఎగ్జామ్, 12న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ ఎగ్జామ్ నిర్వహిస్తారు.

ఫస్టియర్ టైం టేబుల్

మే 24	– సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1
మే 25	– ఇంగ్లిష్ పేపర్–1
మే 28	– గణితం పేపర్–1ఏ, బోటనీ పేపర్ –1, పొలిటికల్ సైన్స్ పేపర్ –1
మే 29	– గణితం పేపర్ –1బీ, జువాలజీ పేపర్ –1, హిస్టరీ పేపర్ –1
మే 30	– ఫిజిక్స్ పేపర్ –1, ఎకానమిక్స్ పేపర్ –1
మే 31	– కెమిస్ట్రీ పేపర్ –1, కామర్స్ పేపర్ –1
జూన్ 1	– పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ –1, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్ –1 (బైపీసీ విద్యార్థులకు)
జూన్ 3	– మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ –1, జియోగ్రఫీ పేపర్ –1

సెకండియర్ టైం టేబుల్

మే 24	– సెకండ్ లాంగ్వేజ్ పేపర్ –2
మే 25	– ఇంగ్లిష్ పేపర్ –2
మే 28	– గణితం పేపర్–2ఏ, బోటనీ పేపర్ –2, పొలిటికల్ సైన్స్ పేపర్ –2
మే 29	– గణితం పేపర్–2బీ, జువాలజీ పేపర్ –2, హిస్టరీ పేపర్ –2
మే 30	– ఫిజిక్స్ పేపర్ –2, ఎకానమిక్స్ పేపర్ –2
మే 31	– కెమిస్ట్రీ పేపర్ –2, కామర్స్ పేపర్ –2
జూన్ 1	– పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ –2, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ పేపర్ –2 (బైపీసీ విద్యార్థులకు)
జూన్ 3	– మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ –2, జియోగ్రఫీ పేపర్ –2

బీదర్ రైల్వే లైన్ పూర్తిచేయిస్తా

- **యువత కోసం జాబ్ మేళాలు**
- **మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్**
- **రైతులను కష్టాలు చుట్టుముట్టినయ్**
- **నమ్మకం లేనోళ్లే దేవుళ్లపై ఒట్లేస్తరు**
- **జహీరాబాద్‌లో గెలుపు బీఆర్ఎస్‌దే**
- **'నమస్తే' ఇంటర్వ్యూలో గాలి అనిల్‌కుమార్**



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ Special Interview

నిజామాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'గత ఎంపీలు అభివృద్ధిని పక్కనబెట్టి సొంత లాభం, కాంట్రాక్టుల కోసమే పనిచేసింన్రు. ప్రజా సమస్యలపై ఎన్నడూ పార్లమెంట్‌లో మాట్లాడింది లేదు. జహీరాబాద్‌కు జాతీయ రహదారులతో పాటు రైల్వే కనెక్టివిటీని పెంచాల్సి ఉన్నది. బీదర్ టు బోధన్ రైల్వే లైన్ పూర్తిచేయాలి. నేను ఎంపీగా గెలిస్తే తప్పక సాధిస్తా' అని జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ చెప్పారు. శనివారం 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన, యువతకు పెద్ద సంఖ్యలో జాబ్‌మేళాలు పెట్టి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అంటేనే మోసాలకు కేరాఫ్ అని, రాష్ట్రంలో రైతులను కష్టాలు చుట్టుముట్టాయని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆగస్టు 15లోగా గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ అంటున్నది. దీనిపై మీ అభిప్రాయం?

దేవుళ్లపై ఒట్లు.. కేసీఆర్‌పై తిట్లు తప్ప కాంగ్రెస్ చేసేదేం ఉండదు. ప్రచారంలో కేవలం దూషణలు, ఒట్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నడు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి ఉంటే దేవుళ్లపై ఒట్లు పెట్టే అవసరం రాదు.. నమ్మకం లేకనే ఇలా ఒట్లు పెడుతున్నరు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అసంబద్ధమైన హామీలు గుప్పించి ప్రజలను గందరగోళంలో పడేసి ఓట్లు వేయించుకున్నాక చేతులెత్తేసిన్రు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని తెలిసే సీఎం రేవంత్‌రెడ్డి అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నడు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్, మహిళలకు నెలకు రూ.2,500, పింఛన్ రూ.4వేలు ఇస్తామని చెప్పి ఐదు నెలలవుతున్నా అమలు చేయకపోవడం వారి చేతగాని తనానికి నిదర్శనం. మోసం చేయడంలో రేవంత్‌ను మించినోళ్లు లేరు.

ఎన్నికల ప్రచారంలో నాయకుల తోడ్పాటు, ప్రజల స్పందన ఎలా ఉంది?

లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల సహకారంతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాం.. మా పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో ప్రచారం జోరుగా నడుస్తున్నది. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అండదండలు, ఎమ్మెల్యే మాణిక్ రావు, ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్, క్రాంతి, భూపాల్ రెడ్డి, కార్యకర్తలంతా కలిసి పార్టీ విజయం, నా గెలుపు కోసం సైనికుల్లా పనిచేస్తున్నరు. ప్రచారంలో ప్రజలను కలిసినప్పుడు వారి కళ్లలో బాధ కనిపిస్తున్నది. కేసీఆర్‌ను అనవసరంగా ఓడగొట్టుకున్నామనే భావన వినిపిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాదనుకోలేదని వాళ్లంతా చెప్తున్నరు. ఈసారి మాత్రం కేసీఆర్‌కే మద్దతుగా నిలుస్తామని తెగేసిచెప్తున్నరు. రైతులైతే ఎప్పుడో డిసైడయ్యిండ్రు. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు బాధ అన్నదే తెల్వలేదు, కాంగ్రెస్ పాలకులు నరకం చూపిస్తున్నరని ఆవేదన చెందుతున్నరు. వాస్తవాలను రైతులు, సామాన్యులు గుర్తిస్తున్నరు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తరు.

మీరు గెలిస్తే ఏమేం పనులు చేస్తారు?

ఇంతకు ముందు పనిచేసిన ఎంపీలు జహీరాబాద్ సమస్యలపై ఏనాడూ పార్లమెంట్‌లో మాట్లాడలేదు. వారి వ్యాపారాలను పెంచుకున్నారే తప్ప ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేదు. తెలంగాణ మేలు కోరే బీఆర్ఎస్ ఎంపీలు ఉంటేనే రాష్ట్రానికి దక్కాల్సిన హక్కులు దక్కుతాయి. ప్రజలు ఆశీర్వదించి నన్ను పార్లమెంట్‌కు పంపిస్తే బీదర్ టు బోధన్ రైల్వే లైన్‌ను పూర్తి చేయిస్తా. జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి జాతీయ రహదారితో కనెక్టివిటీ పెంచడం నా ప్రధాన ఎజెండా. ఎంపీగా గెలిచాక సొంత నిధులతో పెద్ద సంఖ్యలో జాబ్ మేళాలు పెట్టి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.

గత ఎంపీలు ప్రజలకు అందుబాటులో ఉండలేదన్న విమర్శలున్నాయి. మరి మీరు?

నిరంతరం ప్రజల్లోనే ఉండి వారి సాధక బాధకాలను పంచుకుంట. ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతోనే కేసీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లో వచ్చా. ప్రజల మద్దతుతో గెలిచిన వారికి ఏ కష్టం వచ్చినా తోడుంట. జహీరాబాద్ ప్రజలను నా కుటుంబ సభ్యుల్లా చూసుకుంటా. గతంలో పని చేసిన ఎంపీల గురించి మాట్లాడుకోవడం వృథా. ఎన్నికలప్పుడే ప్రజల ముందు కొచ్చేవాళ్లను ప్రజలు తిరస్కరిస్తారు. సురేశ్ షెట్కార్, బీబీపాటిల్‌ను ఈ ప్రాంత ప్రజలు ఆదరించినా వారు నిలబెట్టుకోలేదు. పదేండ్ల పాటు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్‌కు ఇప్పటికీ ఏ ఊరు ఎక్కడుందో తెలియదు. పదవిని అడ్డం పెట్టుకుని పబ్బం గడపడం మినహా ప్రజలకు వాళ్లు చేసిన మేలేం లేదు. నిరంతరం ప్రజల్లో ఉండే నాకు వాళ్లు పోటీయే కాదు.

ఎప్‌సెట్‌లో ఫేషియల్ రికగ్నిషన్!

- **తొలిసారి అమలుకు సన్నాహాలు**
- **ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడం కుదరదిక**
- **రేపటి నుంచి అందుబాటులో హాల్‌టికెట్లు**

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడాన్ని అరికట్టేందుకు.. ఈ ఏడాది ఎప్‌సెట్ పరీక్షల్లో ముఖ ఆధారిత గుర్తింపు విధానాన్ని (ఫేషియల్ రికగ్నిషన్) అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతానికి టెస్టింగ్స్ నిర్వహిస్తుండగా, అంతా సవ్యంగా ఉంటే ఈ ఏడాదే అమలు చేయనున్నారు. లేదంటే వచ్చే ఏడాది నుంచి ఈ విధానం తప్పనిసరిగా అమలవుతుంది.

నేడు నిపుణుల సమక్షంలో టెస్ట్

ఎప్‌సెట్‌లో ఇప్పటివరకు బయోమెట్రిక్ హాజరు తీసుకుంటున్నారు. కుడి చేతి బొటనవేలి ముద్రను కూడా తీసుకుంటారు. ఈసారి వీటితో పాటు ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విధానంలో దరఖాస్తు సమయంలో విద్యార్థి అప్‌లోడ్ చేసిన ఫొటోను, పరీక్షకు వచ్చినప్పుడు క్యాప్చర్ చేసిన ఫొటోను రెండింటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పరిశీలిస్తారు. ఇందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు. విద్యార్థి పోలికలు సరిపోతేనే సాఫ్ట్‌వేర్ ఆయా విద్యార్థిని పరీక్షకు అనుమతిస్తుంది. దీంతో పరీక్షకు వచ్చిన వారు అసలు విద్యార్థియా? లేక నకిలీ విద్యార్థా? అన్నది ఇట్టే తేలిపోతుంది. ఈ విధానాన్ని అమలుచేసేందుకు ఆదివారం నిపుణుల సమక్షంలో టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ ట్రయల్స్ తర్వాత అమలుచేయాలా? వద్దా అన్నది నిర్ణయిస్తారు. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు 3.5లక్షలకుపైగా దరఖాస్తులొచ్చాయి. ఇంజినీరింగ్‌కు 2.5లక్షలు, అగ్రికల్చర్, ఫార్మసీకి 98వేల మంది దరఖాస్తు చేసుకొన్నారు. మే 7, 8న అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ, మే 9, 10, 11న ఇంజినీరింగ్ విభాగానికి పరీక్షలు జరగనున్నాయి. సోమవారం ఉదయం నుంచే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

• రామానంద తీర్థలో వేసవి శిబిరం



బేగంపేట్ బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ ప్రాంగణం పీవీ స్మారక భవనంలో మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించనున్నట్టు రామానంద తీర్థ ఇన్‌చార్జి చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ సురభివాణిదేవి తెలిపారు. పాటలు, యోగా, డ్యాన్స్ తదితర అంశాల్లో చిన్నారులకు నెల రోజుల పాటు శిక్షణ అందించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రామానంద తీర్థ కమిటీ భవన్‌లో సంప్రదించాలని సూచించారు.

–బేగంపేట్

టెట్‌ను వాయిదా వేయండి


హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో మే 20 నుంచి జూన్ 3 వరకు జరగాల్సిన టెట్ పరీక్షలను వాయిదావేయాలని టెట్ అభ్యర్థులు, ఓటర్లు శనివారం ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాశారు. పరీక్షలు నిర్వహిస్తే 70వేల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదమున్నదని ఆయా లేఖల్లో ప్రస్తావించారు. టెట్‌ను వాయిదావేయాలని అభ్యర్థి రావుల రామ్మోహన్‌రెడ్డి ఈసీని కోరారు.

'జేఎన్టీయూ వీసీపై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి గుట్టుచప్పుడు కాకుండా కార్యాలయాలను ప్రారంభిస్తున్న జేఎన్టీయూ వీసీపై చర్యలు తీసుకోవాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్‌ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మారపు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, సీఎస్ శాంతికుమారి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు వినతిపత్రాలు అందజేశారు.

సీనియర్ జర్నలిస్ట్ వినయ్ వీర్‌జీ కన్నుమూత

సంతాపం ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



జూబ్లీహిల్స్, ఏప్రిల్ 27: ప్రముఖ జర్నలిస్ట్, హిందీ మిలాప్ సంపాదకుడు వినయ్ వీర్‌జీ (72) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో చదివిన ఆయన.. హిందీ భాషోన్నతికి విశేషంగా కృషి చేశారు. లండన్‌లో ఉన్నత విద్యాభాసం అనంతరం దక్షిణాదిలో హిందీ జర్నలిజం అభ్యున్నతికి పాటుపడ్డారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు యుధ్‌వీర్ కుమారుడు ఈయన. తండ్రి మరణాంతరం యుధ్‌వీర్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ఫొటో జర్నలిస్టుగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని విస్పర్ వ్యాలీలో ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వినయ్ వీర్‌జీ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. జాతీయస్థాయి జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

శ్రీదేవి ప్రసాద్‌కు యుధ్‌వీర్ అవార్డు

హైదరాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి ప్రసాద్ ప్రతిష్ఠాత్మకమైన 31వ యుధ్‌వీర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రత్యేక అవసరాలు గల వారికి నాణ్యమైన పునరావాస సేవలందించడం కోసం నిర్విరామంగా చేస్తున్న కృషికి గుర్తింపునకు యుధ్‌వీర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆమెను ఈ అవార్డు కోసం ఎంపికచేశారు. ఈ నెల 30న కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.



బరువు తగ్గడమే లక్ష్యం

సెలెబ్రిటీలకు అందం ముఖ్యం. అందం ఉన్నంత కాలమే అవకాశాలు క్యూ కడతాయి. వయసుతోపాటు పెండ్లి, పిల్లలు.. అందాన్ని ప్రభావితం చేస్తాయి. అందరిలాగే తనకూ అవి అవరోధాలుగా నిలిచాయని చెబుతున్నది బాలీవుడ్ నటి సోనమ్ కపూర్. స్టార్ డాటర్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ సినిమాలు, పెండ్లి విషయంలో అనేక ట్రోల్స్‌కు గురైంది సోనమ్. 'తల్లి అయ్యాక నా శరీరంలో వచ్చిన మార్పులు, అధిక బరువు కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నా. నాతో నేను గడిపే సమయం తగ్గిపోయింది. శరీరం గురించి ఆలోచించే తీరికే లేకుండా పోయింది. కానీ, అమ్మతనం కన్నా అందమేముంది చెప్పండి? అయితే బాబు పుట్టిన తర్వాత ఏకంగా 32 కిలోల బరువు పెరిగాను. దాన్ని గుర్తించడానికి నాకు ఏడాదిన్నర పట్టింది. పెరిగిన బరువు తగ్గించుకోవాలని సంకల్పించాను. కష్టతరమైన వ్యాయామాలు చేస్తున్నా. ఆహారపు అలవాట్లు మార్చుకున్నా. త్వరలోనే మునుపటి సోనమ్‌ను చూస్తార'ని చెబుతున్నది ఈ బ్యూటీ.

మనసంతా వాటిపైనే



'మల్లీశ్వరి' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను అలరించిన కత్రినా కైఫ్ బాలీవుడ్‌లో తిరుగులేని స్టార్‌గా ఎదిగింది. తన అందం, అభినయంతో బాలీవుడ్‌లో అభిమానులను సంపాదించుకున్న ఈ బ్యూటీకి ఇప్పుడు అవకాశాలు కాస్త సన్నగిల్లాయి. 'కెరీర్‌లో ఎత్తుపల్లాలు సహజమే.. మంచి అవకాశాలను అందిపుచ్చుకుని మరోసారి బిజీ అవుతాన'ని నమ్మకంగా చెబుతున్నదీ క్యాట్.

'హిందీలో బూమ్ తర్వాత తెలుగులో మల్లీశ్వరి సినిమాతో కెమెరా ముందు నటించడం ప్రారంభించాను. నా సినీ ప్రయాణంలో ఎంతో నేర్చుకున్నాను. కొన్ని సినిమాల తర్వాత దర్శకనిర్మాతలతో అన్ని విషయాలపైనా చర్చించడం అలవాటు చేసుకున్నాను. నేను అనుకున్నవన్నీ సాధించాను. ఇటీవల హాలీవుడ్ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ చాన్స్ మిస్ చేసుకోవాల్సి వచ్చింది. భవిష్యత్తులో మళ్లీ ఆఫర్ వస్తుందని ఆశిస్తున్నా. ఇకపోతే, నా అభిమానుల అంచనాలకు తగ్గట్టుగా మంచి పాత్రలు ఎంచుకుంటున్నా. ఎలాంటి కథలు ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారో అని ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నా. ఏదిఏమైనా నా మనసు మాత్రం సినిమాలపైనే ఉంటుంది.' అని చెప్పుకొచ్చింది కత్రినాకైఫ్.





అందరూ రచనలు చేయడం వేరు. అమ్మ రాయడం వేరు. అమ్మ రాతలో అభిమానం తొంగిచూస్తుంది. అనునయం హత్తుకుంటుంది. ఆవేశమూ అంతే రీతిలో హెచ్చరిస్తుంది. పడిశం పట్టిన సమాజానికి అమ్మ రాత మిరియాల చారు. చక్కటి అనుబంధాలను ఆవిష్కరించేటప్పుడు కమ్మటి పాలబువ్వ. మధురమైన ముచ్చట్లు పంచుకునేటప్పుడు అది తియ్యటి తేనెధార. సమాజం మీద ఆమె రచనల సంతకం పదికాలాలూ పదిలంగా నిలిచి ఉంటుంది. అలా అరవై ఏండ్లుగా రచనా వ్యాసంగాలను నిర్వహిస్తున్న అమ్మల కలాలకు షష్టిపూర్తి మహోత్సవం జరుగుతున్నది. ఆ మహత్తర క్రతువుకు తెలుగు విశ్వవిద్యాలయం వేదిక అవుతున్నది. రెండేండ్లుగా 'మాతృవందనం' పేరిట అలరిస్తున్న ఈ కార్యక్రమం.. ఈ నెల 30న మరోసారి జరగనుంది.

అమ్మా నీకు వందనమే!



సాహితీ సదస్సులు చాలానే జరుగుతుంటాయి. ఉగాది కవి సమ్మేళనాలు ఏటా వినిపిస్తాయి. అయితే అందులో మహిళల ప్రాతినిధ్యం మాత్రం 'మమ' అన్నట్టుగానే ఉంటుంది. అక్కడనే కాదు సాహిత్య వేదికలన్నిటా ఇదే పరిస్థితి. అందుకే, ఆడవాళ్ల కోసం ప్రత్యేకంగా ఓ రచయితల వేదికను ఏర్పాటు చేస్తే బాగుంటుంది కదా... అన్న ఆలోచన 'అక్షరయాన్' పుట్టుకకు కారణమైంది. తెలుగు ఉమెన్ రైటర్స్ ఫౌండేషన్‌గా అయిదేండ్ల క్రితం అవతరించిన ఈ సంస్థలో తెలుగు భాష పట్ల అభిమానం ఉన్న పదిహేను వందల మందికిపైగా రచయిత్రులు ఉన్నారు. రాష్ట్రంలోనే కాదు, దేశ విదేశాల్లో ఉన్న తెలుగు రచయిత్రులు ఇందులో భాగమయ్యారు. వీళ్లందరి అక్షరాలకూ కలంలా సహకారం అందిస్తున్నారు 'అక్షరయాన్' వ్యవస్థాపక అధ్యక్షురాలు అయినంపూడి శ్రీలక్ష్మి. ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని చిత్రవాణి విభాగానికి డిప్యూటీ డైరెక్టర్ హోదాలో సేవలు అందిస్తున్నారామె. అక్షరయాన్ ద్వారా శ్రీలక్ష్మి ప్రారంభించిన మాతృవందనం కార్యక్రమం... తెలుగు విశ్వవిద్యాలయం కూడికతో ఆకాశమెత్తుకు ఎదిగింది. రచనా వ్యాసంగం మొదలుపెట్టి అరవై ఏండ్లు దాటిన సాహితీమూర్తులను సత్కరించే ఈ వేడుక... వణికే చేతులతో మళ్లీ వడివడిగా అక్షరాలు రాయిస్తున్నది.

ఆలోచన అలా...

అక్షరయాన్ ఆన్‌లైన్ వేదికగా మహిళలంతా కలిసి తమ కవితలు, కథల్ని పంచుకోవడమే కాదు... గొప్ప రచయితల్ని సత్కరించే కార్యక్రమాలూ నిర్వహించేవారు. అందులో భాగంగా ఒకసారి ఒక పెద్ద వయసు రచయిత్రికి జరిగిన సన్మాన సభకు, మనుమలతో పాటు మునిమనుమలు కూడా వచ్చారు. 'బామ్మా... నువ్వింత గ్రేటా... నీకింతమంది ఫ్యాన్స్ ఉన్నారా?!' అని వాళ్లంతా అంటుంటే, ఆ పెద్దావిడ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆమె కండ్లలోని కాంతుల్ని అక్షరయాన్ నిర్వాహకులంతా గమనించారు. 'ఇలా పెద్దవాళ్లను సత్కరించేలా 'మాతృ వందనం' పేరిట ఒక కార్యక్రమాన్ని పెట్టుకుందామా..' అన్న అధ్యక్షురాలి ప్రతిపాదనకు అక్కడి వాళ్లంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పెద్ద వయసు రచయిత్రుల్ని ఇండ్లకు వెళ్లి సత్కరించుకున్నారు. అలా ఒక ఏడాది అక్షరయాన్ తరఫున జరిగిన కార్యక్రమం గురించి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి తంగెడ కిషన్ రావుతో పంచుకున్నారు శ్రీలక్ష్మి. ప్రతి ఏటా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించుకునే సంప్రదాయం తెలుగు విశ్వవిద్యాలయానికి ఉండటంతో, ఈ కార్యక్రమాన్ని మాత్రం ఎందుకు చేయకూడదు అని ఉత్సాహం చూపారాయన. అలా 2022లో తెలుగు విశ్వవిద్యాలయం తరఫున 'మదర్స్ డే' నాడు 31 మంది వయోధిక రచయిత్రులకు 'మాతృవందనం' సత్కారం అట్టహాసంగా జరిగింది. అప్పుడు 92 ఏండ్ల రచయిత్రి వాసిరెడ్డి కాశీరత్నం... ఇక్కడి వేదిక మీద వెలిగారు.

గుర్తించి.. సత్కరించి..

చిరపరిచితులైన ఒకనాటి రచయిత్రులు వస్తున్నారంటే తెలుగు విశ్వవిద్యాలయ ఆడిటోరియం కిటకిటలాడింది. వాళ్లను చూసేందుకు, వాళ్ల మాటలు వినేందుకు చాలా మంది ఉత్సాహం చూపారు. తాము ఇంకా జనానికి గుర్తున్నామా అన్న సంభ్రమం అక్కడి రచయిత్రుల్లో కనిపించింది. కుటుంబాలలో అయితే వాళ్లకు సెలెబ్రిటీ హోదా వచ్చింది. ఈ ఉత్సాహం మరుసటేడాదీ మాతృవందనం దిశగా అడుగులు వేయించింది. మరో 32 మంది పెద్దవాళ్లను సాదరంగా సత్కరించుకున్నారు. రెండోసారి ఓ మెట్టు పైనే. 93 ఏండ్ల శాంతమ్మ... సభకు వచ్చారు. ఇక, ఈ ఏడాది మరో 43 మంది చిరపరిచితులు, చిరకాలంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్న వాళ్లను గుర్తించి, జాబితా తయారుచేసింది అక్షరయాన్. ప్రతి జిల్లా, రాష్ట్రంలో ఉండే సభ్యులే తమతమ ప్రాంతాల వారి వివరాలు ఇచ్చి, ఈ జాబితా సిద్ధం చేసేందుకు సహకరిస్తున్నారు. మాతృవందనంలోని వందమందినీ సత్కరించడం ఈ సంవత్సరం పూర్తవుతుంది. అంతేకాదు, ఈసారి వందేండ్ల రచయిత్రి తెన్నేటి మాణిక్యాంబ... ఈ సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

ఏం చేస్తారంటే...

ఈ ఏడాది.. బీనాదేవి, ఓల్గా, సత్యవాణి, కేతవరపు శోభారావు, ముదిగొండ సీతారావమ్మ, ఆకెళ్ల విశాలాక్షి... ఇలా సాహితీ ప్రముఖులెందరో తెలుగు సత్కారాన్ని అందుకోబోతున్నారు. ఈ అతిథులందరినీ పూల జల్లులతో వేదిక మీదికి ఆహ్వానిస్తుంది తెలుగు విశ్వవిద్యాలయం. సారె కార్యక్రమాన్నీ నిర్వహిస్తారు. అంటే చీర, జాకెట్‌తో పాటు పండ్ల బుట్ట, మొక్క, శాలువాలాంటివి రచయిత్రులకు బహూకరిస్తారు. తర్వాత వాళ్ల రచనల గురించి ప్రసంగం, రచయిత్రుల ప్రసంగం రెండూ ఉంటాయి. కార్యక్రమం పూర్తయ్యాక, పలు దఫాలుగా వీళ్లందరి ఇంటర్వ్యూలనూ, వాళ్ల రచనలకు సంబంధించిన విశేషాలను ఒక గంట నిడివితో వీడియో రూపంలో తీసుకువస్తుంది విశ్వవిద్యాలయం. చాలు... రచయిత మస్తిష్కంలో మరుగున పడి ఉన్న ఆలోచనలెన్నో మళ్లీ అక్షరాల చొక్కా తొడుక్కోవడానికి... అందంగా ముస్తాబై అప్పటి సంగతులను మన ముందుకు మోసుకురావడానికి!

... లక్ష్మీహరిత ఇంద్రగంటి

వీరగోని రజనీకాంత్ గౌడ్

అదే ఆనందం..

అక్షరయాన్ అంటే, అఆలు. అ...అంటే అవకాశం. ఆ అంటే ఆత్మస్థైర్యం. మా సంస్థ ద్వారా రచయిత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించేలా రకరకాల వేదికల మీద మాట్లాడే అవకాశాలు కల్పిస్తాం. తెలుగు అక్షరాలను కంప్యూటర్‌లో టైప్ చేయగలిగేలా డీటీపీ నేర్పిస్తాం. ఎప్పటికప్పుడు ఒక్కో సామాజిక అంశాన్ని ఎంచుకుంటూ దాని మీద కవితలు రాస్తూ పుస్తకాలు వేస్తుంటాం. అందరం కలిసి విహారయాత్రలకూ వెళ్తుంటాం. ఇవన్నీ ఒక ఎత్తయితే, సంస్థ నిర్వహిస్తున్న మాతృ వందనం కార్యక్రమం ఒక్కటీ ఒక ఎత్తు. మాది నిజామాబాద్ జిల్లా, బోధన్. నేను మా నాయనమ్మ దగ్గర పెరిగాను. తాను ఓ ధీరోదాత్త నాయకురాలు. నన్ను ఎంతో గారాబం చేసేది. ఆడపిల్ల ఎంత ధైర్యంగా ఉండాలో కూడా నేర్పించేది. ఆమె స్ఫూర్తితోనే నేనీ స్థాయిలో ఉన్నా. అందుకే పెద్దవాళ్లందరిలో ఆమెను చూసుకుంటా. 'మాతృవందనం' నాకు ఎంతో సంతృప్తినిస్తుంది. అయితే, దీనికి ఒక గుర్తింపును, హోదాను తీసుకువచ్చింది మాత్రం తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి తంగెడ కిషన్ రావుగారే. సమున్నత లక్ష్యంతో ఈ క్రతువు నిర్వహిస్తున్న కర్తగా ఆయన్ను చెబుతాను. ఆ పని అంతా చక్కగా చూసుకుంటూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భట్టు రమేశ్‌గారు కార్యక్రమ కర్మగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా సంచాలకులు మామిడి హరికృష్ణగారు ఆర్థిక దన్నునిచ్చి క్రియగా నిలిచారు. కొన్ని ప్రత్యేక కారణాలతో ఈ ఏడాది సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాణి నల్లమోతు సమర్పణలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. అప్పుడూ ఇప్పుడూ కార్యక్రమం నిర్వహణ బాధ్యత అంతా అక్షరయాన్ చూసుకుంటుంది. నేటి తరానికి, నాటి తరానికీ మధ్య వారధిగా నిలవడం నిజంగా సంతోషంగా ఉంది.

• అయినంపూడి శ్రీలక్ష్మి

యవ్వనం పదిలం!


వయసు పెరిగేకొద్దీ అనుభవం ఇనుమడిస్తుంది. కానీ, శారీరకంగా కొన్ని మార్పులు జరుగుతుంటాయి. కండ్ల కింద క్యారీ బ్యాగులు వస్తాయని కొందరికి భయం. బుగ్గలు జారిపోతాయని ఇంకొందరిలో అనుమానం! జుట్టు నెరిసిపోతుందని కంగారు పడుతుంటారు మరికొందరు. పెరిగిన వయసు కనిపించకుండా మేకప్‌ను నమ్ముకుంటుంటారు. అయితే, సరైన డైట్ ఫాలో అయితే... వయసుతో వచ్చే శారీరక మార్పులను కొంతవరకు నియంత్రించవచ్చు. యవ్వనాన్ని మరికొంత కాలం కాపాడుకోవచ్చు.






బ్లూబెర్రీలు యాంటీ ఏజింగ్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మం నిగారించేలా చేస్తాయి. శారీక మార్పులను అధిగమించేందుకు దోహదపడతాయి.

చిలగడదుంప, క్యారెట్, గుమ్మడికాయల్లో బీటా- కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇవి వయసు కారణంగా శరీరంలో వచ్చే మార్పులను నియంత్రించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. చర్మాన్ని పట్టులా ఉంచుతాయి. కండ్లలో కాంతి తగ్గకుండా చూస్తాయి.



ఆకుకూరలు రెగ్యులర్‌గా తినడం వల్ల ముఖవర్చస్సు తగ్గకుండా ఉంటుంది.

కీరదోస కూడా యాంటీ ఏజింగ్ ఫుడ్. ఇందులో నీరు ఎక్కువగా ఉండటం వల్ల చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది.



ప్రతిరోజూ పాలలో గుప్పెడు బాదం నానబెట్టుకొని తింటే... యవ్వనం నిత్య నూతనంగా మారుతుంది.

విటమిన్ -సి అధికంగా ఉండే బ్రకోలీ తింటే చర్మంపై ముడతలు మాయమవుతాయి. చర్మం పొడిబారే సమస్య దరిచేరదు.

యాంటీ-ఏజింగ్‌కు సాల్మన్ చేపలు బాగా పనిచేస్తాయి. వీటిని తినడం వల్ల యవ్వనంగా కనిపిస్తారు.

ఇస్మార్ట్‌గా తగ్గిద్దాం

ప్రస్తుత నిత్యావసరాల్లో ఒకటి స్మార్ట్‌ఫోన్. చేతిలో స్మార్ట్‌ఫోన్ లేనిదే ఏ పనీ జరగడం లేదు. ఓ అధ్యయనం ప్రకారం సగటున ఒక వ్యక్తి రోజుకు 2,617 సార్లు ఫోన్ తాకుతున్నాడట. అంటే ప్రతీ 3 నిమిషాలకు ఓసారి ఫోన్ చూస్తున్నాడన్నమాట! పెరిగిన స్క్రీన్ టైమ్ కారణంగా కంటిచూపుతోపాటు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తున్నది. అయితే చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఈ స్మార్ట్ వ్యసనాన్ని ఇస్మార్ట్‌గా దూరం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు.

- ఫోన్ ఎంత పక్కన పెట్టినా... నోటిఫికేషన్ టోన్ రాగానే అలర్ట్ అయిపోతుంటాం. ఆ టైమ్‌లో ఎంత బిజీగా ఉన్నా... మరుక్షణం ఫోన్ పట్టేసుకుంటాం. ఇలా కావొద్దంటే.. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల నోటిఫికేషన్లు మ్యూట్ చేయడం మంచిది. మార్కెటింగ్ కాల్స్, మెసేజ్‌లు రాకుండా 'డు నాట్ డిస్టర్బ్ మీ' ఎనేబుల్ చేయండి.
- చాలామంది పడుకునేటప్పుడు ఫోన్ పక్కనే పెట్టుకుంటారు. అర్ధరాత్రి దాకా ఫోన్ చూస్తూ ఉంటారు. పడక గదిలోకి ఎంటర్ కావడంతోనే ఫోన్‌ను సైలెంట్ మోడ్‌లో పెట్టేయండి. ఉదయం లేవగానే ఫోన్ చూస్తూ రోజును ప్రారంభించకండి. మీ పనులు పూర్తయ్యాక ఫోన్ అందుకోండి.
- కాలక్షేపానికి కబుర్లు చెప్పుకోండి గానీ, ఫోన్‌లో ఆటల్లో మునిగిపోకండి. పుస్తక పఠనాన్ని అభిరుచిగా మలచుకోండి. పెయింటింగ్, ధ్యానం, యోగ లాంటి అభ్యాసాలు ఫోన్‌కు, మీకు కాసేపైనా దూరం పెంచుతాయి. అదే పనిగా ఫోన్‌లో తల దూర్చకుండా.. ఇంటి పనుల్లో సాయం అవ్వండి. కుటుంబసభ్యులతో పిచ్చాపాటీ కబుర్లు మొదలు పెట్టండి. ఈ పనుల్లో ఉన్నప్పుడు ఫోన్‌ని కాసేపు పక్కన పెట్టేయండి.



- స్క్రీన్ టైమ్ ఇంత అని ఫిక్స్ చేయండి. దానిని మించకుండా ప్రయత్నం చేస్తే... కొన్నాళ్లకు స్మార్ట్ ఫోన్ ఉచ్చునుంచి బయటపడగలుగుతారు.

చల్లగా చందేరీ..

సూర్యుడు మండిపోతే చంద్రుడి చల్లదనం కోరుకోవడం కాస్త విచిత్రమైన విషయమే. అయినా సరే దాన్ని సచిత్రం చేయడం సులభమే అంటుంది చందేరీ వస్త్రం. భానుడితో భేటీకి భయపడని కోవలో ఇది కూడా ఉంటుంది మరి! ఇక్కడ నేవీ బ్లూ రంగులో డిజైనర్ అంచుతో సింగర్ మంగ్లీ కట్టుకున్నది కూడా అలాంటి చందేరీ మెర్సిడిస్ సిల్క్ చీరే. దానికి పిస్తా పచ్చ రంగు జాకెట్‌ను జోడీ చేయడంతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నది.



• సమతా చౌదరి, డిజైనర్
Samatha Chowdary@wowostudios